మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 110 • పేజీలు:12+16 • వెల: రూ.5 గురువారం • 22-3-2018 www.manamnews.com /manamnews

పోయాం.. మోసం

- 14 బ్యాంకులలో రూ.వెయ్యి కోట్లు హాంఫట్
- బ్యాంకింగ్ రంగానికి 'కనిష్క్ గోల్డ్' సున్నం
- మారిషస్‌లో ప్రమోటర్.. డైరెక్టర్ దంపతులు!
- నీరవ్.. మాల్యా.. లలిత్‌ల తరహాలో పరార్
- 215 కోట్ల మోసంపై సీబీఐకి ఎస్‌బీఐ ఫిర్యాదు
- ఆ తర్వాత అదే బాటలో 13 యాజమాన్యాలు

7లో..

ఎస్పీ, బీఎస్పీకి అమిత్ 'షా'క్!

- రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ భేటీ
- ఏడుగురు ఎమ్మెల్యేల డుమ్మా.. వారంతా బీజేపీకే ఓటు?
- తెరవెనుక మంత్రాంగం నడిపిన అమిత్‌షా!

7లో..



ఫేస్‌బుక్‌ను డిలీట్ చేయండి!



వాట్సాప్ సహ వ్యవస్థాపకుడి పిలుపు.. డేటా లీకేజి నేపథ్యంలో ఫేస్‌బుక్‌పై బాంబు.. బీజేపీ- కాంగ్రెస్ సోషల్‌వార్

ఫేస్‌బుక్ వ్యవహారంపై భారత్‌లో ప్రకంపనలు.. కేంబ్రిడ్జి ఎనలిటికాతో బంధాలపై ఆరోపణలు

ఏ పార్టీకి సంబంధాలున్నాయో విచారించండి.. ఈసీకి కాంగ్రెస్ నేత మనీష్ తివారీ వినతి.. కాంగ్రెస్‌కే సంబంధం: రవిశంకర్ ప్రసాద్

7లో..

అప్పులు.. తప్పవు!

అభివృద్ధి సాకారానికి ఇదీ ముఖ్యమే

- స్థూల దేశీయోత్పత్తిలో రుణాలు 49.5 శాతం
- కానీ... రాష్ట్ర జీడీపీలో 21 శాతం మాత్రమే
- తెలంగాణలో నమోదైన ఆదాయ వృద్ధి 22 శాతం
- బీజేపీ పాలిత రాష్ట్రాలు అప్పు చేయడం లేదా?
- 24 వేల కోట్లిమ్మంటే రూ.24 కూడా ఇవ్వలేదు
- సత్వర నిర్ణయాలతోనే పురోగతి సాధించగలం
- బడ్జెట్‌పై చర్చకు మండలిలో కేసీఆర్ సమాధానం



అసెంబ్లీ ప్రాంగణంలోని జూబిలీ హాల్‌ను బుధవారం పరిశీలిస్తున్న సీఎం

హైదరాబాద్, మార్చి 21 (మనం ప్రతినిధి):

రాష్ట్ర భవిష్యత్తు కోసమే అప్పులు చేస్తున్నామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పునరుద్ఘాటించారు. జాతీయంగా మన అప్పులు రూ.82 లక్షల కోట్లుగా ఉన్నట్లు తెలిపారు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ఈ రుణాలు 49.5 శాతం కాగా- రాష్ట్ర జీడీపీలో అప్పుల వాటా మిగతా 6లో..



శంకర్ దాదాలు!

600 మంది నకిలీ డాక్టర్లు.. యూపీలోనూ వ్యాపం స్కామ్

- పరీక్షల్లో మోసం.. మెడికోల అరెస్టు
- 2014 నుంచి కొనసాగుతున్న మోసం
- 600 మందికి పరీక్షలలో 'సాయం'
- వాళ్లంతా రాష్ట్రంలో.. దేశంలో డాక్టర్లే
- ఒక్కొక్కరి నుంచి రూ.1-1.5 లక్షలు

మీరట్, మార్చి 21:

శంకర్‌దాదా ఎంబీబీఎస్ సినిమా చూసే ఉంటారు కదూ.. అందులో వైద్య శాస్త్రం గురించి అక్షరం ముక్క తెలియకపోయినా ఒక మెడికల్ ప్రొఫెసర్ చేత జవాబులు చెప్పించుకుని హీరో దాదాపు డాక్టర్ అయినంత పనిచేస్తాడు. వెండితెర మీద ఎలా ఉన్నా.. నిజ జీవితంలో కూడా అలాగే చాలామంది శంకర్‌దాదాలు మిగతా 6లో..

ఇదీ లోకం!



అప్పుడు.. మన సీఎం ఎవరవుతారో కూడా చెప్పేస్తే ఓ సందిగ్ధం తీరుద్దేమో సార్..!



హెచ్1-బి మళ్లీ ప్రారంభం

వీసా ప్రాసెసింగ్ త్వరలో షురూ

యూఎస్‌సీఐఎస్ ప్రకటన


భారతీయ టెకీలకు శుభవార్త

వాషింగ్టన్, మార్చి 21:

భారత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు శుభవార్త. అతి త్వరలోనే.. అంటే ఏప్రిల్ 2 నుంచి హెచ్1-బి వీసాల ప్రాసెసింగ్ మొదలవుతోంది. ఈ విషయాన్ని అమెరికాకు చెందిన యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ మిగతా 6లో..

ఉత్తమ నగరం హైదరాబాద్.. దేశంలోనే 'భాగ్య' నగరం

దేశంలో నం.1 ప్రపంచంలో 142



వరుసగా నాలుగోసారి కిరీటం

అన్నివేళలా అనుకూల వాతావరణం

- నగరంలో నేరాల సంఖ్య తక్కువ
- రేసులో ద్వితీయ స్థానంలో పుణె
- అంతర్జాతీయ ఉద్యోగులకు అనువు
- అట్టడుగు స్థానంలో దేశ రాజధాని
- ట్రాఫిక్, వాతావరణ కాలుష్యాలే కారణం
- అంతర్జాతీయంగా వియన్నా టాప్
- తరువాతి స్థానాల్లో జ్యూరిక్, మ్యూనిక్
- మెర్సర్ వార్షిక జాబితా విడుదల

6లో..



తెలంగాణకు మరో విజయం

ఫార్మా సమస్యపై ఫలించిన ప్రభుత్వ చొరవ

ఎగుమతులపై కేంద్రం సానుకూల ఆదేశాలు

పరిశ్రమల మంత్రి కేటీఆర్ సంతృప్తి.. హర్షం

హైదరాబాద్, మార్చి 21:

పరిశ్రమలకు ఎదురవుతున్న సమస్యలపై తెలంగాణ ప్రభుత్వ చొరవ ఫలించింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమలు-వాణిజ్య మంత్రి కేటీఆర్ నేతృత్వంలో ఆ శాఖ వివిధ అంశాలపై కేంద్రంతో సమన్వయం ద్వారా పరిశ్రమల వృద్ధికి మిగతా 6లో..


ముహూర్తం

శ్రీవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి మ.1.52 తదుపరి షష్ఠి; నక్షత్రం: కృత్తిక సా.6.03 తదుపరి రోహిణి; వర్జ్యం: ఉ.6.31-8.04; దుర్ముహూర్తం: మ.3.12-4.48; రాహుకాలం: మ.1.53-3.24; అమృతఘడియలు: మ.3.46-5.18; శుభసమయం: మ.1.00-1.30.

సూర్యోదయం: 6.23

సూర్యాస్తమయం: 6.24

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో గురువారం భానుడి ప్రతాపం కొనసాగుతుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరగుతుంది.. రాత్రి ఉష్ణోగ్రత, గాలిలో తేమ శాతం తగ్గుతాయి. రాత్రిపూట గంటకు 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 38 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 22 డిగ్రీలు

గాలిలో తేమ: 37 శాతం

దొంగే.. దొంగ అన్నట్లుగా ఉంది!



బీజేపీ ఎంపీ తివారీపై ఎంపీ కవిత ఆగ్రహం



టీఆర్ఎస్ ఎంపీలతో లోక్‌సభ స్పీకర్ సుమిత్రామహాజన్

ఉభయసభల్లో విపక్ష ఎంపీల ఆందోళన

వేతనాల్లో కోతకు స్పీకర్‌కు తివారీ లేఖ

ట్విట్టర్‌లో తీవ్రంగా స్పందించిన కవిత

న్యూఢిల్లీ, మార్చి 21:

ఉభయ సభల్లో ఆందోళన చేస్తూ సభ నడవకుండా అడ్డుకుంటున్న ఎంపీల వేతనాల్లో కోత విధించాలన్న బీజేపీ ఎంపీ మనోజ్ తివారీపై ఎంపీ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు దీటైన జవాబు మిగతా 6లో..



మరో కోనసీమగా తెలంగాణ

రీ ఇంజనీరింగ్ వల్లే కాళేశ్వరానికి అనుమతులు

- ప్రాజెక్టుతో 37 లక్షల 8 వేల ఎకరాలకు సాగునీరు
- జాతీయహోదాకు బీజేపీ నేతలు సహకరించాలి
- పూర్వ వరంగల్ జిల్లాకు కాళేశ్వరం తొలి ఫలితం
- ఎస్ఆర్ఎస్‌పి కింద పూర్తి ఆయకట్టుకు నీరు
- కోటి ఎకరాల మాగాణి కేసీఆర్ సంకల్పం
- టీఆర్ఎస్‌కు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం
- కృష్ణా, గోదావరిలో ప్రతి చుక్క వాడుకుంటాం
- కాంట్రాక్టర్ల కోసమే రీ డిజైన్ అనేది దుష్ప్రచారం

3లో..



ఓయూకు 'ఏ' కేటగిరి

- ఏయూ, ఎస్వీ విద్యాలయాలకు కూడా
- ప్రమాణాల ఆధారంగా నాక్ ర్యాంకులు
- కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ వెల్లడి
- నాక్ గ్రేడింగ్‌తో మరింత స్వయం ప్రతిపత్తి


విశాఖపట్నం, మార్చి 21 (మనం న్యూస్ బ్యూరో): హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 'ఏ' కేటగిరి దక్కింది. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 60 విశ్వ విద్యాలయాల్లో ఓయూతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని ఆంధ్ర విశ్వవిద్యాలయం, నల్సర్ యూనివర్సిటీ ఆఫ్ లా, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయాలు ఏ కేటగిరి సాధించాయి. విశ్వ విద్యాలయాల ప్రమాణాలను పరిశీలించి ర్యాంక్‌లు ఇచ్చే నాక్ సర్వే ఈ మేరకు నిర్ధారించినట్లు కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ స్పష్టం చేశారు. నాక్ గ్రేడింగ్ ఆధారంగా ఈ విశ్వ విద్యాలయాలకు మరింత స్వయం ప్రతిపత్తి లభించనుంది. యూజీసీ నుంచి అన్ని అనుమతుల కోసం ఎదురు చూడకుండా సొంతంగా నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఈ విశ్వ విద్యాలయాలకు దక్కనుంది. కొత్త కోర్సులు, ఆఫ్ క్యాంపస్ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, పరిశోధనల్లో స్వయం నిర్ణయాలకు అవకాశం లభించనుంది. దేశ వ్యాప్తంగా 52 విశ్వ విద్యాలయాలు, ఐదు కేంద్రీయ విశ్వ విద్యాలయాలు, రెండు డీమ్డ్ విశ్వ విద్యాలయాలకు కేటగిరిలను నిర్ధారించి మరింత స్వయం ప్రతిపత్తిని కేంద్ర మానవ వనరుల శాఖ కల్పించింది.



నాక్ గణాంకాల ప్రకారం ఏ కేటగిరిలో నిలచిన ఆంధ్రా విశ్వ విద్యాలయం 3.60 స్కోరుతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంది. ఏయూలో విదేశీ కోర్సులు ఉండడం, పలు విశ్వ విద్యాలయాలతో ఎంవోయూలు కుదుర్చుకోవడం, రక్షణ రంగంలో కోర్సుల నిర్వహణకు నౌకాదళంతో ఒప్పందాలు కలిగి ఉండడం వంటివి బాగా కలసి వచ్చాయి. ఏ కేటగిరిలో ఇంకా జాదవపూర్ (కోల్‌కతా), అలగప్ప (కారైకూడి), సావిత్రీభాయి (పుణె), ఉత్కల్ (భువనేశ్వర్), కురుక్షేత్ర (ఉత్తరప్రదేశ్), గురునానక్ (అమృత్‌సర్) వర్సిటీలు ఉన్నాయి. తెలంగాణలోని కాకతీయ విశ్వవిద్యాలయం రెండో కేటగిరిలో చోటు దక్కించుకుంది.

అసెంబ్లీ కార్యదర్శిపై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

- కోర్టు స్టే విధించినా 'రాజ్యసభ'
- జాబితా నుంచి తొలగించారు:మర్రి



సీఈసీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, మార్చి 21 (మనం ప్రతినిధి): తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శిపై కేంద్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ కాంగ్రెస్ నేతలు బుధవారం ఫిర్యాదుచేశారు. కాంగ్రెస్‌కు చెందిన శాసనసభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌లను శాసనసభ నుంచి అనైతికంగా, కుట్ర పూరితంగా టీఆర్ఎస్ ప్రభుత్వం బహిష్కరించిందని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టుగా కాంగ్రెస్ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. సరైన కారణాలు లేకుండానే ఇద్దరు ఎమ్మెల్యేలను బహిష్కరించటం అన్యాయమన్నారు. తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌లను రాజ్యసభ ఓటర్ల జాబితా నుంచి తొలగించటం అన్యాయమని ఎన్నికల సంఘం అధికారులకు వివరించామని పేర్కొన్నారు. అసెంబ్లీ సెక్రటరీని రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాధ్యతల నుంచి తప్పించాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్టు తెలిపారు. ఇద్దరు ఎమ్మెల్యేల పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలని ఎన్నికల సంఘానికి విన్నవించామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఎమ్మెల్యేలపట్ల వ్యవహరించిందని ఆరోపించారు.



గెజిటెడ్ అధికారుల భేటీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్

సీపీఎస్ రద్దుకు మరో ఉద్యమం

- 25న సరూర్‌నగర్ స్టేడియంలో సభ
- గెజిటెడ్ అధికారుల భేటీలో శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్‌సిటీ, మార్చి 21(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఉద్యమ స్ఫూర్తితో కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేసేందుకు పోరాటం చేయాలని తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. బుధవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఇంజనీర్లు, గెజిటెడ్ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దుతో పాటు 11వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయడం, ఆంధ్రలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను తిరిగి రప్పించడం తదితర డిమాండ్లతో ఈ నెల 25న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ సీఎం కేసీఆర్‌ను కలిసి కేంద్ర ప్రభుత్వానికి లేఖ ఇప్పించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. సీపీఎస్ రద్దు, పీఆర్సీ ఏర్పాటుపై మరో రెండుమూడు రోజుల్లో ఉద్యోగ సంఘాలతో కలిసి సీఎం కేసీఆర్‌ను ప్రత్యేకంగా కలవనున్నట్టు తెలిపారు. 2014 అనంతరం నియమితులైన ఉద్యోగుల భవిష్యత్ కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానంతో ఆగమ్యగోచరంగా మారిందని పేర్కొన్నారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మమత మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఇంజనీర్ల సంఘం అధ్యక్షులు మోహన్‌సింగ్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నగర అధ్యక్షుడు కృష్ణయాదవ్, టీజీవో ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, తెలంగాణ ఇంజనీర్ల సంఘం కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.



కండ్లకోయ అర్బన్ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి జోగు

ప్లాస్టిక్ ఫ్రీ జోన్లుగా అడవులు: జోగు

- కేరళ తరహాలో కొత్త విధానం అమలు

హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): రాష్ట్రంలోని అడవులు, అర్బన్ పార్కులను ప్లాస్టిక్ ఫ్రీ జోన్లుగా మారుస్తామని అటవీ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా బుధవారం మంత్రి కండ్లకోయ అర్బన్ పార్కుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల వన్యప్రాణులకు ప్రమాదం పొంచి ఉందని, అడవుల్లో పర్యాటక ప్రాంతాలు, వ్యూ పాయింట్లు, వాటర్ ఫాల్స్, ఫారెస్ట్ అర్బన్ పార్కులకు వచ్చే సందర్శకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందన్నారు. అదే సమయంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరుగుతున్నాయన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కేరళ ప్రభుత్వం కొన్ని అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ తీసుకువెళ్లే సందర్శకుల నుంచి నామమాత్రపు ఫీజు వసూలు చేస్తుందని, తిరిగి ఆ ప్లాస్టిక్‌ను ఇస్తే.. ఆ మొత్తాన్ని వెనక్కి ఇస్తోందని తెలిపారు. ఇదే విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని నిర్ణయించామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కలెక్టర్ ఎంవీ రెడ్డి, పీసీసీఎఫ్ పీకే.ఝా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు సోయిలేదు

- అభివృద్ధిని చూడకుండా అనవసర విమర్శలా: ముత్తిరెడ్డి



హైదరాబాద్, మార్చి21 (మనం ప్రతినిధి): ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలు చేపడుతున్నా, ప్రతిపక్షాలు సోయి లేకుండా విమర్శలు చేస్తున్నాయని టీఆర్ఎస్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారంఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీతో పాటు, 24 గంటల ఉచిత విద్యుత్ ప్రభుత్వ ఘనత అని అన్నారు. అర్హులైన దళితులకు ప్రభుత్వం 3 ఎకరాలు భూమి ఇస్తుందన్నారు. ఒక్క జనగాం నియోజక వర్గంలోనే 350 ఎకరాలు పంచామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఇంటిఇంటికీ నీళ్లు అందిస్తున్నామన్నారు. మూడున్నర ఏళ్లలో102 గ్రామాల్లో 300 వాటర్ ట్యాంకులు నిర్మించామన్నారు. ఇప్పటికీ 65,000 ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. ఇంత చేస్తున్నా.. ప్రతిపక్షాలు సోయి లేకుండా మాట్లాడుతున్నాయని ఆయన విమర్శించారు. ప్రతిపక్షాలకు దమ్ముంటే.. పక్క రాష్ట్రాలు తెలంగాణ వాటా నీళ్లను దొంగలిస్తున్నాయని. ఆ విషయంపై పోరాడాలని ఆయన సవాల్ విసిరారు. తాను భువనగిరి నుంచి ఎంపీగా పోటీ చేస్తానని వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు.

టీఎస్ ఐపాస్‌తో..

లక్ష కోట్ల పైబడి పెట్టుబడులు

6609 యూనిట్లకు అనుమతి ...4,382 యూనిట్లు ప్రారంభం

- 10195 యూనిట్లకు టీ-ఐడియా
- 1658 కోట్లు మంజూరు చేశాం
- పరిశ్రమల శాఖ సమీక్షలో సీఎస్




పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్ష సమావేశంలో సీఎస్ ఎస్‌కే జోషి

హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): తెలంగాణలో రూ.1,24,664 కోట్ల పెట్టుబడితో ముందుకొచ్చిన 6609 యూనిట్లకు టీఎస్ ఐపాస్ ద్వారా అనుమతిచ్చామని, రూ.38,203 కోట్ల పెట్టుబడితో 4,382 యూనిట్లు ప్రారంభమయ్యాయని సీఎస్ ఎస్‌కే.జోషి తెలిపారు. బుధవారం సచివాలయంలో పరిశ్రమల శాఖపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. టీఎస్ ఐపాస్ ద్వారా ఇప్పటికే ప్రారంభమైన 4,382 యూనిట్ల ద్వారా 1,87,978 ఉద్యోగాలు లభించాయని మరో 684 యూనిట్లు అడ్వాన్స్ స్టేజ్‌లో ఉన్నాయని తెలిపారు. అనుమతులు ఇచ్చాక 6 నెలల్లోగా ప్రారంభించని యూనిట్లకు గల కారణాలపై విశ్లేషణ చే యాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలకు అనుమతులతోపాటు వివిధ శాఖల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటికి టైమ్‌లైన్ నిర్ణయించాలని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్, రిటైల్, ఎలక్ట్రికల్ వాహనాల పాలసీలపై సంబంధిత శాఖల అభిప్రాయాలు తీసుకున్నామని, డ్రాఫ్ట్ పాలసీలు రూపొందించాల్సి ఉందని చెబుతూ త్వరలోనే వీటిపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్(ఈఓడీజీ)కి సంబంధించి 372 రికమెండేషన్స్‌కుగాను 362 ఆమోదం పొందాయని వెల్లడించిన సీఎస్.. నాలుగింటిని తిరస్కరించినట్లు తెలిపారు. మరో 6 ప్రతిపాదనలు వివిధ శాఖల పరిశీలనలో ఉన్నాయని వివరించారు. వివిధ శాఖలకు సంబంధించి 1 యాక్ట్, 17 జీవోలు, 42 సర్క్యులర్లు జారీ చేశామన్నారు. 78 అంశాలపై ఫీడ్ బ్యాక్ నిర్వహించనున్నందున స్టాక్ హోల్డర్స్‌తో ఇప్పటికే ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటినుంచి టీ-ఐడియా స్కీం ద్వారా 10,195 యూనిట్లకు రూ.1658 కోట్లు, ఎస్సీపీ ద్వారా రూ. 8994 యూనిట్లకు రూ.542 కోట్లు, టీఎస్పీ ద్వారా రూ.7976 యూనిట్లకు రూ.363 కోట్లు ఇన్సెంటివ్‌ను మంజూరు చేశామన్నారు. టీఎస్ ఐఐసీ కి సంబంధించి 23 మెగా ప్రాజెక్టులపై సమీక్షించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి ఫిజికల్ ఎక్స్‌క్యూషన్‌పై కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. పనుల పురోగతిని ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించాలన్నారు. మెగా టెక్స్‌టైల్స్ పార్కు, ఫార్మా సిటీ, నిమ్జ్ తదితర అంశాలపై సమీక్షించారు. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు ఉండాలన్నారు. పరిశ్రమలు సత్వరం ప్రారంభించేలా చూడాలన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, కమిషనర్ నదీమ్ అహ్మద్, టీఎస్ఐఐసీ ఎండీ వెంకటనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమర వీరుల స్థూపానికి 80 కోట్లు

- మండలిలో మంత్రి తుమ్మల వెల్లడి



హైదరాబాద్, మార్చి 21 (మనం ప్రతినిధి): హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ వద్ద తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపాన్ని నిర్మించేందుకు రోడ్లు, భవనాల శాఖ జీవోఆర్‌టీ నెం. 330 ద్వారా రూ. 80 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. అమరవీరుల స్మృతి చిహ్నం, స్వంత భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు అంశాలపై కర్నె ప్రభాకర్, కాటేపల్లి జనార్ధన్ రెడ్డి, పూల రవీందర్ వివరణకోరగా మంత్రి సమాధానమిస్తూ... స్మారక స్థూపం పని నిమిత్తం కన్సల్టెంట్లుగా ఎంవీ రమణారెడ్డి-మెసర్స్ తనికెళ్ల ఇంటిగ్రేటెడ్ కన్సల్టెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ప్రభుత్వం ఒక జాయింట్ వెంచర్‌ను నియమించిందన్నారు. కన్సల్టెంటు సంభావిత డిజైన్లను రూపొందించగా సీఎం ఆమోదించారని తెలిపారు. టెండర్లను రెండు వారాల్లోపు ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. హైదరాబాద్, మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నియంత్రణకింద లుంబినీ పార్కుకు ఆనుకుని ఉన్న 3 ఎకరాల 29 గుంటల భూమిని ఈ స్మారక స్థూప నిర్మాణానికి కేటాయించినట్టు తెలిపారు. ప్రయివేటు భవనాల్లో ఏర్పాటు చేసిన వసతిపై సమాచారాన్ని తెలుపవలసిందిగా జిల్లా కలెక్టర్లకు లేఖ రాశామన్నారు. జిల్లా ప్రధాన కార్యస్థానాల్లోని వివిధ శాఖల కార్యాలయాలకు వసతిని కల్పించడం కోసం కొత్తగా ఏర్పడిన 21 జిల్లాలోను, 5 పాత జిల్లాల్లోనూ ఏకీకృత కార్యాలయ కాంప్లెక్స్‌ల నిర్మాణాన్ని రోడ్లు, భవనాల శాఖ చేపట్టిందన్నారు.

థర్డ్ ఫ్రంట్ ఓ డ్రామా

- ప్రజల దృష్టి మరల్చేందుకే
- నిలదీస్తారనే భయంతోనే గెంటేశారు
- కాంగ్రెస్ నేతల సస్పెన్షన్‌పై దాసోజు



హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): ఎన్నికల హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే సీఎం కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ పేరుతో డ్రామాలాడుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రావణ్ కుమార్ విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీల అమలుపై కాంగ్రెస్ సభ్యులు నిలదీస్తారనే భయంతోనే టీఆర్ఎస్ ప్రభుత్వం వారిని కుట్ర పూరితంగా వెళ్లగొట్టిందని ఆరోపించారు. తన పార్టీ పనులకోసం సీఎం కేసీఆర్ ప్రజల సొమ్ము దాదాపు రూ. కోటి ఖర్చు చేసి చార్టెడ్ విమానంలో కోల్‌కతాకు వెళ్లి రావడం అన్యాయమన్నారు. థర్డ్ ఫ్రంట్‌కు మమత వ్యతిరేకమని అక్కడి ప్రధాన పత్రిక ప్రచురించిన విషయాన్ని దాసోజు గుర్తుచేశారు. రాష్ట్ర విభజన హక్కుల కోసం పక్క రాష్ట్రం అలుపెరుగని పోరాటం చేస్తుంటే మన రాష్ట్రప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందన్నారు. తమ హక్కుల సాధన కోసం తోటి రాష్ట్రం కేంద్రంపై అవిశ్వాసం పెడతానంటే మద్దతు ఇవ్వకుండా అడ్డుపడటం విచారకరమన్నారు. కాంగ్రెస్ సభ్యులపై తీసుకున్న చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్తారన్నారు. రాష్ట్ర అభివృద్ధికోసం అప్పులు చేయడం తప్పులేదన్నారు. కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం తమ కమీషన్ల కోసం ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తూ ప్రజలపై ఆర్థిక భారం మోపుతుందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై టీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. బడ్జెట్‌లో దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి భారీగా నిధులు కేటాయించామని చెప్తున్నా, ఖర్చు చేయటంలో మాత్రం ప్రభుత్వం నత్తతో పోటీ పడుతోందన్నారు. ఎంబీసీలకు గతంలో రూ. వెయ్యి కోట్లు కేటాయించినట్లు చెప్తున్న ప్రభుత్వం ఒక్క పైసా ఖర్చుచేసిన దాఖలాలు లేవని దాసోజు విమర్శించారు.

రైతులను ఏనాడు పరామర్శించలేదు

ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబాలను సీఎం కేసీఆర్ ఏనాడు పరామర్శించలేదన్నారు. జీవో 421 ప్రకారం ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబానికి రూ.4 లక్షలు చెల్లించాల్సి ఉన్నా, టీఆర్ఎస్ ప్రభుత్వం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన హక్కుల సాధన కోసం మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావటంలో పూర్తిస్థాయిలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు ఏటా రూ.10వేల కోట్లు ఇస్తామని చెప్పి నాలుగేండ్లలో రూ.17,483 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. ధర్నాచౌక్‌ను ఎత్తివేసి ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కు లేకుండాచేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని విమర్శించారు. మహిళా సాధికారిత గురించి ఓ వైపు దేశం, ప్రపంచం గొప్పగా చెప్తుంటే తన మంత్రి వర్గంలో ఒక్క మహిళకు కేసీఆర్ చోటు ఇవ్వలేదన్నారు.

రేషన్ కార్డులపై కేంద్రం లోగో ముద్రించాలి

- కౌలు రైతులకు పెట్టుబడి సాయం: కిషన్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ ప్రకారం రేషన్ కార్డులపై కేంద్ర ప్రభుత్వ లోగోను ముద్రించాలని బీజేపీ శాసనసభపక్ష నేత జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శాసనసభలో బుధవారం సివిల్ సప్లై పద్దుపై చర్చలో భాగంగా మాట్లాడారు. రేషన్ కార్డులను ప్రజలు ఆత్మగౌరవంగా భావిస్తారన్నారు. మూడేండ్లుగా కొత్త కార్డులను ఎందుకు ముద్రించడంలేదని ప్రశ్నించారు. అద్దెకు నడుపుకునే కార్లు, ఆటోలు ఉన్నా..రేషన్ కార్డులను తొలగించడం సరికాదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 14 లక్షల మంది కౌలు రైతులకు పెట్టుబడి పథకాన్ని వర్తింపజేయాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు రీషెడ్యూల్ చేసిన రుణాలను విడుదల చేయాలని ఆయన కోరారు.



గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

పార్లమెంట్‌లో టీఆర్ఎస్ రిజర్వేషన్ల డ్రామా

- మండలి ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ విమర్శ

హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): పార్లమెంటులో రిజర్వేషన్ల పేరుతో టీఆర్ఎస్ ఎంపీలు నాటకాలాడుతున్నారని మండలి ప్రతిపక్షనేత షబ్బీర్ అలీ విమర్శించారు. వెంటనే ఈ నాటకాలను కట్టిపెట్టాలని ఆయన హితవు పలికారు. ఈమేరకు గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం, గిరిజన రిజర్వేషన్లపై టీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. రిజర్వేషన్ల పేరుతో టీఆర్ఎస్ సర్కారు ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర జనాభా కంటే ఎక్కువ రిజర్వేషన్లు ఎందుకంటూ కేంద్ర హోంశాఖ నిలదీసిన విషయం నిజంకాదా అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని అలీ ప్రశ్నించారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, ఐఐటీ, రైల్వే కోచ్ వంటి వాటిపై టీఆర్ఎస్ ఎంపీలు కేంద్రాన్ని ఎందుకు నిలదీయటంలేదని ప్రశ్నించారు. ప్రధాని మోదీ, బీజేపీ నేత అమిత్‌షా కనుసన్నలలోనే సీఎం కేసీఆర్ నాటకాలడుతున్నారని విమర్శించారు. థర్డ్‌ఫ్రంట్ ఇందులో భాగమేనని విమర్శించారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించటంలో కేసీఆర్‌ది అందెవేసిన చేయని షబ్బీర్ అలీ ఎద్దేవా చేశారు.

ఆర్టీసీ కార్మికుల వేతన సవరణ చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): ఆర్టీసీ కార్మికులకు వెంటనే వేతన సవరణ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో వివిధ రంగాలకు చెందిన కార్మికులు చేస్తున్న మూడో రోజు ధర్నాలో చాడ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల జీతాలు చాలా తక్కువగా ఉన్నందున వెంటనే వేతన సవరణ జరిపి జీతాలు పెంచాలన్నారు. డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకొస్తే ఆర్టీసీకి ఆరు వందల కోట్లు మిగులుతాయన్నారు. ఇటు ప్రైవేటు బస్సుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ప్రైవేటు బస్సులను అరికడితే ఆర్టీసీ నష్టాల ఊబి నుంచి బయటపడుతుందని ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.నరసింహన్ పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడమే మంచిదన్నారు. బుధవారం దీక్షలో వరంగల్, నల్లగొండ, సికింద్రాబాద్, హైదరాబాద్‌కు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

23న చలో అసెంబ్లీ: లక్ష్మణ్

హైదరాబాద్, మార్చి 21 (మనం ప్రతినిధి): రైతు సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని,కిసాన్ మోర్చా నేతృత్వంలో ఈ నెల 23న చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రైతులకు మేలు జరిగే వరకు బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని ఆయన స్పష్టంచేశారు. దుబ్బాక ప్రాంతంలోని దుబ్బలపల్లి, చర్లాపూర్, బల్వంతపూర్, రాజక్కపేటలో 1600 మందికి పైగా రైతులకు.. రుణమాఫీకి సంబంధించి బ్యాంకులు నోటీసులు జారీ చేశాయన్నారు. బడ్జెట్ సమావేశాల్లో రైతాంగ సమస్యలపై ప్రస్తావిస్తే... ముఖ్యమంత్రి స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా రాజకీయంగా ఎదురు దాడి చేశారని విమర్శించారు. రాష్ట్రంలో దాదాపు 80వేల మంది రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుని అల్లాడుతున్నారన్నారు. రైతు రుణాల వడ్డీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లించకపోవడంతో దాదాపు 15లక్షల మంది రైతులు నష్ట పోతున్నారన్నారు.



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్

కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి, అధికార ప్రతినిధి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంపై తొలి దండయాత్ర మాదే: జీవన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కారుపై టీడీపీ ఎంపీలు పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయంలో కేంద్ర వైఖరిని నిరసిస్తూ టీడీపీ అవిశ్వాస తీర్మానం పెట్టిన విషయం తెలిసిందే! అయితే, దీనికి టీఆర్ఎస్ సర్కారు మద్దతివ్వడంలేదన్న వాఖ్యలను జీవన్‌రెడ్డి ఖండించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కేంద్రంపై అవిశ్వాసం పెట్టే సమయంలో కేసీఆర్‌తో టీడీపీ ఏమైనా సంప్రదింపులు జరిపిందా అని ప్రశ్నించారు. 2014 నుంచి ఇప్పటి మోదీపై, కేంద్రంపై దండయాత్ర మొదలు పెట్టింది మొదటగా తామేనని, కేంద్రంతో టీఆర్ఎస్ ఎప్పుడూ పొత్తు పెట్టుకోలేదని జీవన్‌రెడ్డి స్పష్టంచేశారు. తెలంగాణకు అన్యాయం జరిగితే టీడీపీ ఎప్పుడైనా మాట్లాడిందా? అని ప్రశ్నించారు. తమ పార్టీ కేంద్రంపై తిరుగుబాటు చేస్తుంటే టీడీపీ తమతో ఎందుకు కలవడంలేదో చెప్పాలని నిలదీశారు. ప్రస్తుతం దేశానికి మంచి నాయకత్వం అవసరమని, త్వరలోనే కేసీఆర్ దేశానికి నాయకత్వం వహిస్తారని చెప్పారు. రాబోయే రోజుల్లో కేసీఆర్‌ను ప్రధానిగా చూస్తామని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

రైతులకు యంత్రీకరణను చేరువ చేయాలి

- నకిలీ విత్తనాల నియంత్రణకు ప్రత్యేక విభాగం: ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): ప్రపంచ దేశాల్లో వ్యవసాయ రంగంలో యంత్రీకరణ శరవేగంగా సాగుతోందని, తెలంగాణ రైతాంగానికి యంత్రీకరణను మరింత చేరువ చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య అన్నారు. శాసనసభలో బుధవారం పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాల నియంత్రణకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం దొడ్డు రకం వడ్లతో పాటు సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. రోజురోజుకు పసుపు రైతుల పరిస్థితి దిగజారిపోతుందని, చెరకు పంటకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల మాదిరిగా మద్దతు ధరను పెంచాలని చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. రాజకీయ జోక్యం లేకుండా రైతులకు ట్రాక్టర్లను పంపిణీ చేయాలని, ఆర్గానిక్ పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని కోరారు. అగ్రికల్చర్ యూనివర్సిటీల్లో విద్యార్థులు గ్రామాల్లోకి వెళ్లి రీసెర్చ్ చేయాలన్నారు. ప్రభుత్వం మేలురకం జాతి చేప పిల్లలను సరఫరా చేయాలన్నారు. చేపలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంతోపాటు రాష్ట్రంలో మత్స్య ఉత్పత్తుల పరిశ్రమలను నెలకొల్పాల్సిన అవసరం ఉందని కృష్ణయ్య అన్నారు.

ఉద్యోగాలు భర్తీ చేయండి

ఉద్యోగాల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని టీడీపీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం జరిగిందే నీళ్ళ, నిధులు, నియమాకాల కోసమని, అలాంటిది ప్రభుత్వం ఆ అంశాలపై దృష్టి సారించడం లేదన్నారు. గ్రూప్-1లో 1500, గ్రూప్-3లో 8000, గ్రూప్-4లో 12వేల ఖాళీలున్నాయని, ప్రభుత్వం వాటిని ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఒక్కో ఐఏఎస్ అధికారి అనేక అదనపు బాధ్యతలు చేస్తున్నారని, సివిల్ సర్వీస్‌లో పెద్దస్థాయిలో ఖాళీలున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. జూనియర్ అసిస్టెంట్లతో ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. గత ప్రభుత్వంలానే, ఈ ప్రభుత్వం నిరుద్యోగులకు అన్యాయం చేస్తుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

వ్యవసాయశాఖలో సిబ్బంది కొరత

- గోపాలమిత్రలకు వేతనం పెంచాలి
- సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య



హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): వ్యవసాయ శాఖలో సిబ్బంది కొరత సమస్యగా మారిందని, రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య అన్నారు. శాసనసభలో బుధవారం పద్దులపై చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. పశువులకు నిరంతరం సేవలందిస్తోన్న గోపాల మిత్రలకు వేతనం పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ దిగుబడులు పడిపోయాయని, గతంలో కంటే ఈ ఏడాది మిర్చి పంట సాగు తగ్గిపోయిందన్నారు. 32 లక్షల ఎకరాలు సాధారణ పంటల సాగు ఉండాల్సింది.. ప్రస్తుతం 27 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయని తెలిపారు. కనీస మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటున్నాయని చెప్పారు. ఉద్యాన పంటలపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేపట్టాల్సి ఉందని, గిరిజనులకు సబ్సిడీపై గొర్రెలు, గేదెలు అందజేయాలని కోరారు. గొల్లకురుమలకు సబ్సిడీపై గొర్రెలు అందించారు కానీ వాటిని మేపేందుకు స్థలాలు లేవని పేర్కొన్నారు. గిరిజనులు పదెకరాలు భూమి ఉన్నా.. రెండు పంటలు పండే పరిస్థితి లేదని, గిరిజనులందరికీ తెల్లరేషన్ కార్డు ఇవ్వాలని చెప్పారు.

రాజ్యసభ ఎన్నికల్లో తటస్థంగా ఉంటాం..


రాజ్యసభ ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటేయ్యకుండా తటస్థంగా ఉండాలని వామపక్ష పార్టీలు నిర్ణయం తీసుకున్నాయని ఎమ్మెల్యే సున్నం రాజయ్య తెలిపారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో అభ్యుదయ భావాలతో వామపక్షాలు ముందుకుపోతున్నాయన్నారు.

పంటలకు బోనస్ ఇవ్వాలి: చింతల



హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): తెలంగాణాలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కంటే అదనంగా బోనస్ ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. శాసన సభలో బుధవారం పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో ఎంఎస్‌పీ కంటే గుజరాత్ ప్రభుత్వం రూ.వెయ్యి బోనస్ ఇస్తుందని, మహారాష్ట్రలో రూ.800 బోనస్ ఇస్తోందని గుర్తు చేశారు. రుణమాఫీని విడతల వారీగా చేయడం వల్ల రైతులపై వడ్డీ భారం పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు రుణాలిచ్చేందుకు నాబార్డుకు రూ.11 లక్షల కోట్లు కేటాయించిందని, దాన్ని రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు నకిలీ విత్తనాల కారణంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. రైతులను ఆదుకునేందుకు కేంద్రం ఫసల్ బీమా యోజనను తీసుకొచ్చిందని, దాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం చూపుతోందన్నారు. పూర్తిస్థాయిలో సర్వే చేయకుండానే రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన పూర్తి చేశామనడం సరికాదన్నారు. 27 రాష్ట్రాల్లో మిగులు విద్యుత్ ఉందని, 23 శాతం బొగ్గును తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం అధికంగా కేటాయించిందని పేర్కొన్నారు. కేంద్రం వెయ్యి మెగావాట్ల విద్యుత్ తెలంగాణకు వస్తోందని, అందువల్లే రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల విద్యుత్‌ను ఇవ్వగలుగుతుందని చెప్పారు.

రైతు సంక్షేమానికి సీఎం కృషి: రసమయి



హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి):సబ్బండ కులాలకు ఆధారం రైతు అని, అలాంటి రైతును అన్నివిధాలా ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ నిత్యం పరితపిస్తున్నారని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. శాసనసభలో బుధవారం పద్దులపై చర్చ సందర్భంగా మాట్లాడారు. వ్యవసాయాన్ని గాడిన పెట్టేందుకు 46వేల చెరువులను పునరుద్ధరించారన్నారు. పోలీస్ స్టేషన్లలో విత్తనాలు ఉంచి అమ్మిన ఘటనలు ఎన్నో గత ప్రభుత్వాల హయాంలో చూశామని, నేడు అలాంటి పరిస్థితులు ఎక్కడా లేవని తెలిపారు. విద్యుత్ గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదన్నారు. మద్దతు ధర లభించే వరకు రైతులు పంటను నిల్వ చేసుకునేందుకు గోదాములు నిర్మించారని చెప్పారు. ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలను ఆదుకునేందుకు రూ.5లక్షలతో రైతు బీమా కల్పిస్తున్నారని చెప్పారు. గొర్రెల పంపిణీ ద్వారా గొల్ల కురుమల జాతి గౌరవాన్ని పెంచారని గుర్తు చేశారు.

తెలంగాణ మరో కోనసీమ

- రీ ఇంజనీరింగ్ వల్లే కాళేశ్వరానికి అనుమతులు
- ప్రాజెక్టుతో 37 లక్షల 8 వేల ఎకరాలకు సాగునీరు
- జాతీయహోదాకు బీజేపీ నేతలు సహకరించాలి
- పూర్వ వరంగల్ జిల్లాకు కాళేశ్వరం తొలి ఫలితం
- ఎస్ఆర్ఎస్‌పి కింద పూర్తి ఆయకట్టుకు నీరు
- కోటి ఎకరాల మాగాణి కేసీఆర్ సంకల్పం
- టీఆర్ఎస్‌కు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం
- కృష్ణా, గోదావరిలో ప్రతి చుక్క వాడుకుంటాం
- కాంట్రాక్టర్ల కోసమే రీ డిజైన్ అనేది గోబెల్స్ ప్రచారం
- ప్రతి ప్రాజెక్టుకు డీపీఆర్, పనుల్లో పూర్తి పారదర్శకత
- పాలమూరు ప్రాజెక్టుతో కృష్ణా జలాల్లో న్యాయం
- రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): తెలంగాణ సోయితోనే టీఆర్ఎస్ ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులకు రీ డిజైన్, రీ ఇంజనీరింగ్ చేసిందని ఆ పార్టీ నేత, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు తెలియజేశారు. భవిష్యత్‌లో దేశానికి అన్నం పెట్టే భాండాగారంగా తెలంగాణ మారుతుందని ఆయన చెప్పారు. నీటి ప్రాజెక్టులను కట్టడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. రైతుల ఆత్మహత్యలను నివారించాలని, ప్రతి నియోజ కవర్గానికి సాగునీరు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని ఆయన శాసనసభకు తెలిపారు. బుధవారం నాడు అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. రాజకీయలబ్ధి కోసం ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజల ఆకాంక్షలు ముఖ్యమని తేల్చిచెప్పారు.

భవిష్యత్తు తరాల కోసమే రీ డిజైన్

భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రాజెక్టులను రీ డిజైన్ చేశారని మంత్రి అన్నారు. నీటి లభ్యత తక్కువ ఉన్నందున ప్రాణహిత-చేవెళ్ల పథకం కింద ప్రతిపాదించిన తమ్మిది హట్టి కాకుండా మేడిగడ్డ దగ్గర ప్రాజెక్టుకు కేసీఆర్ రూపకల్పన చేశారని మంత్రి హరీశ్ రావు చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారంలో వరుస బ్యారేజీలు నిర్మిస్తున్నామని మంత్రి చెప్పారు. తుపాకుల గూడెం నుంచి శ్రీరాం సాగర్ వరకు 270 కిలోమీటర్ల మేరకు గోదావరి నది ఏడాది పొడవునా 365 రోజులపాటు సజీవంగా ఉంటుందన్నారు. మహారాష్ట్ర నుంచి సముద్రం వరకు నౌకాయానం జరుగుతుందని, మత్స్య పరిశ్రమ, టూరిజం అభివృద్ధి చెందుతుందని హరీశ్ రావు తెలిపారు.

రీడిజైన్, రీఇంజనీరింగ్‌తో పెరిగిన వ్యయంప్రాణహిత-చేవెళ్ల పథకం కింద 16 లక్షల ఎకరాలకే ప్రతిపాదించారని రీ డిజైన్, రీ ఇంజనీరింగ్ అనంతరం 37 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి లభించనుందని ఇరిగేషన్ మంత్రి గుర్తు చేశారు. ఆయకట్టు పెంచడం,అందుకు అనుగుణంగా రిజర్వాయర్ల సామర్థ్యం పెంచడం వంటి కారణాలతో ప్రాజెక్టు వ్యయం పెరగడం అనివా ర్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రాణహిత-చేవెళ్ళ పథకంలో 11టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్లు ప్రతిపాదించగా 147 టీఎంసీలకు వాటి సామర్థ్యాన్ని కేసిఆర్ పెంచారని హరీశ్ రావు తెలియజేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలను నిర్మించి ఎత్తిపోతల ద్వారా మల్లన్న సాగర్, కొండపోచమ్మ, గంధమల్ల తదితర రిజర్వా యర్లను నిర్మించి తెలంగాణలోని అత్యంత కరువుపీడిత ప్రాంతాలలోని సుమారు 37 లక్షల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో రీ-డిజైనింగ్ చేశారని తెలిపారు. ప్రభుత్వం రీ ఇంజనీరింగ్ చేయడం వల్లనే కాళేశ్వరానికి అనుమతులు వచ్చాయని చెప్పారు. 2007నుంచి 2014 వరకు అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రం లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు రాలేదన్నారు. ముఖ్యమంత్రి వ్యూహాత్మక వైఖరితో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం చేసుకున్నందుకే అంతర్రాష్ట్ర అనుమతులు, జలసంఘం అనుమతులు సాధించుకోగలిగినట్టు హరీశ్ రావు వివరించారు. రీ ఇంజనీరింగు చేయకపోతే,ఈ ప్రాజెక్టుకు ఇంత వేగంగా అనుమతులు కేంద్రం నుంచి లభించేవి కావన్నారు.

దుమ్ముగూడెంతో ఖమ్మం జిల్లాకు నీరు..

కాంతనపల్లి దగ్గర గతంలో ప్రతిపాదించిన విధంగా ప్రాజెక్టు నిర్మిస్తే 20 గిరిజన గ్రామాలు,11వేల ఎకరాలు మునుగుతాయని హరీశ్ రావు చెప్పారు. అందుకే ఈ ప్రాజెక్టు విషయంలో జాగ్రత్త వహించి రీడిజైనింగ్ చేశామని వివరించారు. 20 గిరిజన గ్రామాలు ముంపునకు గురి కాకుండా కేవలం 250 ఎకరాలు మునిగే విధంగా రీ డిజైన్ చేసినట్టు తెలిపారు. తుపాకులగూడెం వద్ద కాపర్ డ్యాం ఏర్పాటు చేసి చెరువులకు నీరు ఇస్తున్నామని పేర్కొన్నారు. దుమ్ముగూడెం వద్ద నీటి లభ్యత అధికంగా ఉన్నందున ఖమ్మం జిల్లా వాసులకు నీరు అందించేందుకు దుమ్ముగూడెం ప్రాజెక్టును రీఇంజనీరింగ్ చేశామని ఇరిగేషన్ మంత్రి తెలిపారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ గురిచి వస్తున్న విమర్శలను మంత్రి కొట్టిపారేశారు. నీటి లభ్యత, నదులు లేని చోట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కండలేరు, గోరకల్లు, వెలుగోడు, అవుకు తదితర ప్రాజెక్టులు నిర్మించిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తు చేశారు.

పూర్వ వరంగల్‌కు తొలి ఫలితం

పూర్వ వరంగల్ జిల్లా కు కాళేశ్వరం తొలి ఫలితం అందనున్నట్టు మంత్రి హరీశ్ రావు చెప్పారు. వరంగల్‌తో పాటు పూర్వ నల్లగొండ జిల్లాలోని తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాలకు సాగునీటిని ఇవ్వనున్నట్టు మంత్రి తెలిపారు. కాళేశ్వరం నుంచి మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యాం మీదుగా హుజురాబాద్,పరకాల, మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల ఆయకట్టుకు నీరందుతుందని హరీశ్ రావు తెలిపారు. లోయర్ మానేరు డ్యాం దిగువ ప్రాంతాల్లో ముఖ్యంగా అసెంబ్లీ స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న భూపాలపల్లి సెగ్మెంట్లో 80 వేల ఎకరాలు సాగులోకి రానున్నట్టు మంత్రి తెలియజేశారు. ఎస్ఆర్ఎస్‌పి కింద 9 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉందని, గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల కొన్ని నియోజకవర్గాలకు ఎస్ఆర్ఎస్‌పీ నుంచి చుక్క నీరు కూడా వెల్లలేదన్నారు. ఎల్.ఎం.డి.దిగువన 5.40 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ కాలువలు శిధిలమై పూర్తి ఆయకట్టుకు నీరందలేదని హరీశ్ రావు విమర్శించారు.

నీటి లభ్యత ఆధారంగా ప్రాజెక్టులు

ప్రస్తుత వేసవికాలంలోనూ జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘనపూర్ అసెంబ్లీ నియోజక వర్గాలకు నీరు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా ఏ ప్రాజెక్టులను చేపట్టలేదన్నారు. నీటి లభ్యత ఆధారంగానే ఐదు ప్రాజెక్టులను రీడిజైనింగ్ చేశామన్నారు. రీడిజైనింగ్ తర్వాత కాళేశ్వరం కింద 16 లక్షల నుంచి 37 లక్షల ఎకరాలకు ఆయకట్టు అదనంగా పెరిగిందన్నారు. పాలమూరు ప్రాజెక్టు కట్టకపోతే తెలంగాణ ప్రభుత్వం చారిత్రక తప్పిదం చేసినట్లు అవుతుందని ఇరిగేషన్ మంత్రి వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తేనే భవిష్యత్ తరాలకు న్యాయం చేసిన వాళ్లమవుతామని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టును కట్టుకుంటేనే కృష్ణా జలాల కేటాయింపుల్లో న్యాయం జరుగుతుందన్నారు.

చుక్క నీరు వృథా పోనివ్వం..

కాంగ్రెస్ హయాంలో ప్రజలను వంచించి కాంట్రాక్టర్ల జేబులు నింపుతూ పెద్ద ఎత్తున ధనార్జనకు పాల్పడినట్టు ఆయన ఆరోపించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల విధానాన్ని, ఈపీసీ పద్ధతిని రద్దు చేసిన విషయాన్ని హరీశ్ రావు గుర్తు చేశారు. కృష్ణా, గోదావరిలో ప్రతి నీటి చుక్కను వాడుకుంటామని, ఒక్క చుక్క కూడా వృథా పోనివ్వమని చెప్పారు. కృష్ణా, గోదావరి నుంచి తెలంగాణకు రావలసిన న్యాయమైన వాటా సాధిస్తామన్నారు. బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్‌లో మన వాదనలు బలంగా వినిపిస్తున్నామని హరీశ్ రావు తెలిపారు. కేసు ట్రైబునల్‌లో ఉన్నందును కొన్ని విషయాలు అసెంబ్లీలో వెల్లడించడం సాధ్యం కాదని మంత్రి వివరించారు. తన ప్రాణాలు ఒడ్డి తెలంగాణ రాష్ట్రం సాధించిన ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టుల కోసం ప్రత్యేక ప్రణాళికలు రచించారని చెప్పారు. తెలంగాణను ఆకుపచ్చని తెలంగాణగా, కోటి ఎకరాల మాగాణిగా మార్చడం సీఎం సంకల్పం అని మంత్రి తెలిపారు. ప్రతి సాగునీటి ప్రాజెక్టుకు డీపీఆర్ ఉందని చెప్పారు. డీపీఆర్ లేవంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని మంత్రి ఖండించారు. ప్రాజెక్టుల సర్వే, డిజైన్లు, నిర్మాణ పనులకు సంబంధించి ప్రతి దశలోనూ అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్టు మంత్రి తెలిపారు.

వెయ్యి కోట్లతో శ్రీరామ్ సాగర్ ఆధునికీకరణ

వెయ్యి కోట్ల వ్యయంతో శ్రీరామ్ సాగర్ ఆధునికీకరణ పనులు చేపట్టామని దాంతో శ్రీరామ్‌సాగర్ పూర్తి ఆయకట్టుకు నీరందనుందని అన్నారు. శ్రీరామ్‌సాగర్ రెండో దశ కింద చేపట్టిన పనుల వల్ల పాలకుర్తి నియోజకవర్గంలో రైతులకు సాగునీరు లభిస్తుందన్నారు. ఆ నియోజకవర్గానికి అటు దేవాదుల నుంచి కూడా సాగు నీరు వస్తుందన్నారు.

బీజేపీ నేతలు సహకరించాలి

కాళేశ్వరానికి జాతీయ హోదా కోసం తెలంగాణ బీజేపీ నేతలు సహకరించాలని ఇరిగేషన్ మంత్రి కోరారు. విభజన సమయంలో పోలవరానికి జాతీయహోదా ఇచ్చిన విధంగానే కాళేశ్వరానికి కూడా జాతీయహోదా ఇస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడిన తర్వాత సాగునీటిరంగంలో దశాబ్దాలుగా జరుగుతున్న అన్యాయాలను కేసీఆర్ ప్రశ్నించడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారని ఆయన గుర్తు చేశారు. కంతనపెల్లి బ్యారేజికి 2009 ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేసినా తట్టెడు మన్ను తీయలేదని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు భూసేకరణకు అడ్డు తగులుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పనులు ముందుకు సాగకుండా కుట్రలకు పాల్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన తర్వాత ఆయా అనుమతులను అడ్డుకోవడానికి కూడా కుట్రలు చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. రీ-డిజైన్ చేసిన ప్రాజెక్టులలో ఖమ్మం జిల్లాకు చెందిన సీతారామ, భక్తరామదాసు ప్రాజెక్టులు కూడా ఉన్నాయన్నారు. గతంలో రాజీవ్ సాగర్, ఇందిరాసాగర్ పేరుతో తలపెట్టిన రెండు ప్రాజెక్టులను సీతారామ పేరిట సీఎం కేసీఆర్ సమీకృత ప్రాజెక్టును రూపొందించినట్టు మంత్రి హరీశ్ రావు తెలియజేశారు. రికార్డు సమయంలో 10 నెలలలో భక్త రామదాసు ప్రాజెక్టును తమ ప్రభుత్వం నిర్మించిందని తెలిపారు. 2001లో ప్రారంభించిన దేవాదుల ప్రాజెక్టు 2014 నాటికి అసంపూర్తిగానే మిగిలిపోయింది. ఈ ప్రాజెక్టును కూడా కేసీఆర్ రీ డిజైన్ చేసినట్టు హరీశ్ రావు తెలిపారు. భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోని రామప్ప చారిత్రాత్మక దేవాలయానికి ప్రమాదం కలుగకుండా పైప్డ్ ఇరిగేషన్ విధానంతో పనులు చేపట్టామని చెప్పారు. ములుగు, భూపాలపల్లి, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో గ్యాప్ ఆయకట్టుకు నీరందిస్తున్నట్టు హరీశ్ రావు తెలిపారు.

కేసీఆర్ పర్యవేక్షణలో కాళేశ్వరం పనులు

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 37 లక్షల 9 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు పారిశ్రామిక, తాగు నీటి అవసరాలకు నీటిని అందిస్తామని మంత్రి హరీశ్ రావు ప్రకటించారు. త్వరలోనే తెలంగాణ మరో కోనసీమ కానుందని ఆయన అన్నారు. టీఆర్ఎస్ పార్టీకి రాజకీయ ప్రయోజనాల కన్నా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. వందేళ్ళ తర్వాత కూడా కేసీఆర్‌ను, టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గుర్తు పెట్టుకునే విధంగా సాగునీటి రంగంలో పనులు సాగుతున్నట్టు హరీశ్ రావు తెలియజేశారు. కాళేశ్వరం లింక్ 1 లో మూడు బ్యారేజీ లు,మూడు పంప్ హౌస్‌లను అతి తక్కువ వ్యవధిలో 20 నెలల్లోనే పూర్తి చేస్తున్నట్టు ఇరిగేషన్ మంత్రి తెలిపారు. కాళేశ్వరం పనులు మూడు షిఫ్టులలో వేగంగా జరుగుతున్నట్టు చెప్పారు. గత ఆరు నెలల్లోనే 2 కోట్లకు పైగా సిమెంట్ బస్తాలు వాడినట్టు పేర్కొన్నారు. ఇప్పటికే 60 శాతానికి పైగా నిర్మాణ పనులు పూర్తయినట్టు మంత్రి తెలియజేశారు. సీఎం కేసీఆర్ ప్రతిరోజు లైవ్ టెలికాస్ట్ ద్వారా కాళేశ్వరం పనులను పర్యవేక్షిస్తూ, సూచనలు, సలహాలు ఇస్తున్నట్టు హరీశ్ రావు తెలిపారు.

బడ్జెట్ సమరం

రేషన్ వ్యవస్థలో పోర్టబులిటీ

- అర్హులందరికీ రేషన్ కార్డులు
- అన్ని ప్రాంతాల్లో ఈ-పాస్ మిషన్లు: ఈటల



హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): ప్రజాపంపిణీ వ్యవస్థలో పోర్టబులిటీని తీసుకొచ్చినట్టు రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. శాసనసభలో బుధవారం సివిల్ సప్లై పద్దుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోర్టబులిటీ సౌకర్యంతో రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ సరుకులు తీసుకోవచ్చని మంత్రి చెప్పారు. త్వరలోనే అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తామన్నారు. అన్ని ప్రాంతాల్లో ఈ-పాస్ మిషన్లు అందుబాటులోకి తీసుకొచ్చామని, రేషన్ కార్డులకోసం ఇప్పటికే 2.50 దరఖాస్తులు వచ్చాయని, 75 వేల కార్డులు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. ఏప్రిల్ చివరి నాటికి అర్హులకు కార్డులు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో 1.03 లక్షల కుటుంబాలు ఉంటే.. 85 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులను అందజేస్తామని చెప్పారు. వసతి గృహాల్లో రూ.650 కోట్లతో సన్నబియ్యం పంపిణీ అమలు చేస్తుందని తెలిపారు. ఈ పాస్ మిషన్ల ద్వారా 95 శాతం అక్రమాలను నియంత్రిం చగలిగినట్టు పేర్కొన్నారు. ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ ప్రకారం కార్డులను ముద్రిస్తామని చెప్పారు. తెలంగాణలో దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిన వారందరికీ కిరోసిన్‌ను ఇవ్వడంలేదని, గ్యాస్ లేనివారికి మాత్రమే కిరోసిన్ సరఫరా చేస్తున్నట్టు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 1.08లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఇస్తే.. రాష్ట్ర ప్రభుత్వం 1.77 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఇస్తున్న విషయాన్ని మంత్రి ఈటల గుర్తు చేశారు.

భవిష్యత్‌లో మీట్ ప్రాసెసింగ్ యూనిట్లు


- పశుపోషణ మీద 90 లక్షల కుటుంబాలు
- రెండుచోట్ల ఫిషరీస్ యూనివర్సిటీలు: తలసాని



హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్‌లో పెద్ద ఎత్తున మీట్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పనున్నట్టు రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శాసనసభలో బుధవారం వ్యవసాయం, పశుసంవర్థక, సివిల్ సప్లై శాఖ పద్దులపై చర్చలో భాగంగా పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలపై మాట్లాడారు. 70 ఏండ్ల చరిత్రలో ఏనాడూ రైతులు, గొల్లకురుమలు, ముదిరాజ్‌లను ఏ ప్రభుత్వం ప్రోత్సహించలేదన్నారు. పెబ్బేరులో ఇప్పటికే ఫిషరీ యూనివర్సిటీ ఏర్పాటు చేయగా.. మానకొండూర్‌లో ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తునట్టు తెలిపారు. గతంలో పశుసంవర్థక శాఖ కేవలం పేరుకే పరిమితమయ్యేదని, తెలంగాణలో మాత్రం సీఎం కేసీఆర్ వ్యవసాయం తర్వాత అంతటి ప్రాధాన్య మిస్తున్నారని తెలిపారు. పశుపోషణపై 90 లక్షల కుటుంబాలు ఆధార పడ్డాయని, గొర్ల పంపిణీకి రూ.5వేల కోట్లు కేటాయించామని చెప్పారు. రాజేంద్రనగర్‌లో పీవీ నరసింహారావు పేరు మీద వెటర్నరీ యూని వర్సిటీ ఏర్పాటు చేశామని, టీఎస్‌పీఎస్సీ ద్వారా 160 పోస్టులను భర్తీ చేశామని పేర్కొన్నారు. మూడు దఫాలుగా పశువులకు వ్యాక్సినేషన్ చేయిస్తున్నామని, 100 సంచార వైద్యశాలలను అందుబాటులోకి తీసుకొచ్చామని మంత్రి తలసాని వివరించారు.

రైతు అప్పు వద్దనే రోజు రావాలి

- ఉమ్మడి పాలనలో దీనస్థితిలో రైతులు
- త్వరలో సబ్సిడీపై నాట్లువేసే యంత్రాలు
- వాణిజ్య పంటలకు మద్దతు ధర ఇవ్వాలి
- ఫసల్ బీమాలో చాలా లొసుగులున్నాయి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం



హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): రైతు అప్పు అవసరం లేదనే రోజు రావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. వ్యవసాయం, పశుసంవర్థక, సివిల్ సప్లై శాఖ పద్దులపై బుధవారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో రైతులు దీనస్థితికి చేరుకున్నారని, అప్పుల ఊబిలో కూరుకుపోయారని పోచారం అన్నారు. మహరాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిపై 400 ప్రాజెక్టులకు నిర్మించి తెలంగాణకు నీళ్లు రాకుండా చేస్తే అప్పటి ప్రతిపక్షాలు కండ్లప్పగించి చూశాయని గుర్తు చేశారు. దాంతో నిజాం సాగర్ ఏడారిగా మారి కరీంనగర్, నిజామాబాద్ తదితర జిల్లాలో పంట భూమలు బీళ్లుగా మారాయన్నారు. 1611 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి వెళుతున్న గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఆ నీటిని సద్వినియోగం చేసుకునేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.1.50 లక్షల కోట్ల సాగు నీటి ప్రాజెక్టులను నిర్మిస్తున్నారని తెలిపారు. రైతులు బాధలో ఉంటే.. రాజకీయం చేయడం సరికాదన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు యాసంగి పంటకు నీరందించనున్నట్టు తెలిపారు. రైతులు అప్పుల ఊబిలోంచి బయటకు వచ్చేందుకు, రైతు ఆత్మహత్యలను నివారించేందుకు పెట్టుబడి పథకాన్ని వర్తింప జేస్తోందని చెప్పారు. 1931 సంవత్సరంలో నిజాం ప్రభుత్వ హయాంలో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన చేశారని, ఆ తర్వాత సీఎం కేసీఆర్ 100 రోజుల్లో 1707 బృందాలతో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టారని వివరించారు. 1.50 కోట్ల ఎకరాలకు పెట్టుబడి పథకానికి రూ.12వేల కోట్లు అవసరమవుతాయని తెలిపారు. అధికారంలోకి వస్తే.. స్వామినాథన్ సిఫారసులను అమలు చేస్తామన్న ప్రధాని మోదీ.. నేటికీ అమలు చేయడం లేదని తెలిపారు. కనీస మద్దతు ధర వాణిజ్య పంటలకు లేదని, కేవలం 16 ఆహార పంటలకు మాత్రమే కేంద్రం ఇస్తుందన్నారు. కేంద్రం వాణిజ్య పంటలకు మద్దతు ధర ఇప్పించేలా బీజేపీ ఎమ్మెల్యేలు ప్రయత్నించాలని సూచించారు. నాట్లు వేసే యంత్రాలను త్వరలో సబ్సిడీపై అందించనున్నట్టు పేర్కొన్నారు.ఫసల్ బీమా యోజన పథకంలో లోసుగులు ఉన్నాయని, 2014-17 వరకు 29 లక్షల మంది రైతులు బీమా ప్రిమియం చెల్లిస్తే.. కేవలం 10 లక్షల మంది రైతులకే క్లెయిమ్ అయ్యిందని చెప్పారు. ఈ పథకంలో రైతును యూనిట్‌గా తీసుకునే విషయంపై కేంద్ర ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

గురువారం, మార్చి 22


పుతిన్ పునరాగమనం

రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమర్ పుతిన్ నాలుగోసారి ఎన్నికయ్యారు. ఆయన మరో ఆరేళ్లపాటు పదవీ బాధ్యతలు స్వీకరించేలా రష్యా ప్రజలు ఆయనకు పట్టం కట్టారు. జోసెఫ్ స్టాలిన్ తరువాత అత్యధిక కాలం రష్యాను ఏలబోతున్న నేతగా పుతిన్ చరిత్రను సృష్టించనున్నారు. ఎన్నికల్లో ఎన్నో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఆరోపణల మాట అలా వుంచితే ఎవరు పోటీచేసినా పుతిన్ విజయం మాత్రం ఖాయమని అనుకోవడంలో సందేహపడనక్కరలేదు. అధికారం కోసం జీవితాంతం వరకు కుర్చీకి అంటుకుని కూర్చోవాలన్న కోరిక తనకేమీ లేదని పుతిన్ చెబుతున్నప్పటికీ అది నాలుకపై నుంచి వచ్చిందా లేక హృదయపూర్వకంగా ఆయన అన్నారో ఇప్పటికైతే ఊహించలేము.

ప్రచ్ఛన్నయుద్ధం తరువాత సోవియట్ యూనియన్ అంతరించిన తరుణంలో రష్యా పూర్తిగా చితికిపోయింది. పుతిన్ అధికార పగ్గాలు చేపట్టేవరకు రష్యాను అమెరికా ముప్పుతిప్పలు పెట్టింది. ఈ నేపథ్యంలో అధికారాన్ని చేపట్టిన పుతిన్ వినూత్న పోకడలతో రష్యాను మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తీసుకురాగలిగారు. కడు దయనీయ స్థితిలో ఉన్న రష్యా ఆర్థిక స్థితిని చక్కదిద్దడంలోనూ, రష్యా చుట్టుపక్కల దేశాల్లో అమెరికా ఆధిపత్యాన్ని తిప్పికొట్టడంలోను పుతిన్ విజయం సాధించి రష్యా ప్రజల అభిమానానికి పాత్రులయ్యారు. రష్యన్లలో ఆత్మస్థైర్యాన్ని నింపడమే కాకుండా రష్యాను మళ్లీ సూపర్ పవర్‌గా తీర్చిదిద్దారు. ఈ ప్రయత్నాల్లో పుతిన్‌పై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. వాటిని లెక్కచేయకుండా రష్యాను మళ్లీపట్టాలెక్కించడంలో పుతిన్ వెనుదిరిగి చూడలేదు. ఇతర దేశాల వ్యవహారాల్లో తలదూర్చడం, దూకుడుగా, నిర్మొహమాటంగా మాట్లాడడం ఆయనకు కొన్ని చిక్కులు తెచ్చిపెట్టినా లక్ష్యపెట్టలేదు. ఈ చర్యలన్నీ ఒక్క రష్యాలోనే కాకుండా ప్రపంచంలోనే ఆయనకు ఎంతో గుర్తింపు తెచ్చిపెట్టింది.

ఆర్థికంగా కుదేలైన దేశాన్ని కుదురుగా నిలపడంలో ఇంతవరకు ఆయన చేసిన కృషి అద్వితీయమైనదైనా భవిష్యత్తులో రష్యన్ల పరిస్థితుల్ని చక్కదిద్దగలిగిన నేతగా ఆయనను ఆ దేశ ప్రజలు అత్యంత విశ్వాసాన్ని చూపారు. ఈ క్రమంలో రష్యాను తీర్చిదిద్దడంలో పుతిన్‌పై అనేక ఆరోపణలు వచ్చివుండవచ్చు, కానీ ఆయన చర్యలన్నీ ఆయన వ్యక్తిత్వాన్ని, ఆయనపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించాయనే చెప్పుకోవాలి. ప్రపంచదేశాలు ఆయన మార్గాన్ని మొదట్లో తప్పు పట్టినా రషన్లు మాత్రం ఆయనకు నీరాజనాలు సమర్పించారు. అనంతర కాలంలో ఆయన దారిని ప్రశంసించడం భారత్ వంటి దేశాలకు తప్పలేదు. దాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యతగా పుతిన్ గుర్తించాలి. గత సెప్టెంబర్‌లో బ్రిక్స్ దేశాల సమావేశాల నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఆయన చర్చలు జరపడం, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన ప్రపంచ దేశాల ఆర్థిక సదస్సులో మొట్టమొదటిసారిగా భారత్ పాల్గొనే అవకాశం కల్పించడం వెనుక పుతిన్ చేసిన కృషి మరువలేనిది. భారత్ అంటే తమకెంత ప్రాధాన్యం ఉన్న దేశమో ఆయన నిరూపించారు. ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితులు అగమ్య గోచర దిశలో పయనిస్తున్న నేపథ్యంలో పుతిన్ నిర్వర్తించాల్సిన గురుతర బాధ్యత ఎంతో ఉంది. ఒక్క అంగుళం భూమినైనా వదులుకోమని, అందుకు అవసరమైతే రక్తపాత యుద్ధానికైనా సిద్ధమేనని చైనా పొరుగుదేశాలను హెచ్చరిస్తున్న సమయంలో అంతర్జాతీయ రంగంలో శాంతిభద్రతలను కాపాడేందుకు, ఆసియా ఖండంలో యుద్ధమేఘాలను తొలగించేందుకు రష్యాపై ఎంతో గురుతర బాధ్యత ఉంది. ప్రపంచ పోలీస్‌గా భావిస్తూ ప్రపంచదేశాలను తన చెప్పుచేతుల్లో ఉంచుకోవాలని ఒకప్పటి అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న కుటిలయత్నాలను తిప్పికొట్టగల శక్తి ఒక్క రష్యాకే ఉందని గతానుభవాలు తెలుపుతున్నాయి. ఇందుకు ఆగ్నేయాసియా దేశాల సహకారంతో అమెరికాను నిలువరించే యత్నాలు చేపట్టే బాధ్యత కూడా పుతిన్ పైనే ఉంది. ఎందుకంటే ప్రపంచంలో అస్తవ్యస్త పరిస్థితుల్ని సృష్టించడమే ధ్యేయంగా పెట్టుకుని కుట్రలకు పాల్పడుతున్న ట్రంప్‌ను దోషిగా నిలబెట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఉత్తర కొరియా కవ్వింపు చర్యలకు, అమెరికా రెచ్చగొడుతున్న ధోరణికి ముకుతాడు వేయాల్సిన సమయం ఇదే. ఇందుకు ఆగ్నేయాసియా దేశాల్లో సుస్థిర రాజకీయ పరిస్థితులేర్పడాలి. ఈ దేశాల్లో ఒక్క పాకిస్థాన్ మినహా ఇతర దేశాల్లో పరిస్థితులు అదుపులోనే ఉంటున్నాయి. ఆగ్నేయాసియా దేశాల్లో ఏ దేశంలోనైనా అస్థిర రాజకీయ పరిస్థితులేర్పడితే వాటిని ఉపయోగించుకోవడంలో అమెరికా ఉంటుందనేది నిస్సందేహం. ఇందుకు ఉదాహరణగా ఆఫ్ఘనిస్తాన్‌ను తీసుకోవచ్చు. పాకిస్థాన్‌లో టెర్రరిస్టుల ప్రభావంతో పాలకులు సతమతమవడాన్ని ట్రంప్ ప్రభుత్వం ఆ దేశంపై పెత్తనం చేయడానికి, తాను గీసిన 'లక్ష్మణరేఖ'ను ఉల్లంఘించకూడదని ఆంక్షలు పెడుతున్న విషయం తెలిసిందే.

అభివృద్ధి చెందుతున్న దేశాలతో 1950 దశకం నుంచి రష్యా (అప్పటి సోవియట్ యూనియన్) ఎంతో మెరుగైన మైత్రీబంధాన్ని కొనసాగిస్తోంది. కశ్మీర్ వివాదంపైగానీ, గోవాలో పోర్చుగీస్ అంశంలోగానీ అప్పటి సోవియట్ యూనియన్ అధ్యక్షుడు కృశ్చేవ్ 1955లో భారత్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అప్పటి నుంచి రెండు దేశాల మధ్య కొనసాగుతున్న మైత్రీబంధం బంగ్లాదేశ్ యుద్ధం సమయంలో పాకిస్తాన్‌కు మద్దతుగా అమెరికా తన సప్తమవాహక నౌకాదళాన్ని బంగాళాఖాతంలో మోహరించినపుడు రష్యా అనుసరించిన వైఖరితో న్యూఢిల్లీ-మాస్కోల మధ్య మైత్రి మరింత విస్తరించింది. అప్పటినుంచి భారత్‌కు విశ్వాసపాత్రమైన మిత్రుడుగా ఉంటున్న రష్యా భవిష్యత్తులో కూడా ఇదే మాదిరిగా వ్యవహరించే విషయంలో పుతిన్ చర్యలు చేపడతారని విశ్వసించవచ్చు. ఆగ్నేయాసియాలో యుద్ధమేఘాలు చెదిరి శాంతిభద్రతలు ఏర్పడే దిశగా పుతిన్ చర్యలుంటాయని భావించవచ్చు.



మంచిమాట



'నీ కలలు నిన్ను భయపెట్టడం లేదంటే.. అవి నువ్వు సాధించేంత పెద్దవి కావని అర్థం'

- ఎలెన్ జాన్సన్ సర్‌లీఫ్


ప్రతిఫలనం

విశ్వాసాల నీలినీడల్లో విజ్ఞానం

శాస్త్రీయ దృక్పథం కోల్పోయే కొద్దీ ఒకానొక సమాజం భరించలేని అభివృద్ధి నిరోధకత్వంలోకి జారిపోతుంది. నేడు అలాంటి పరిస్థితులు దేశంలో వేగంగా నెలకొంటున్నాయి. నిరూపిత శాస్త్రీయ సిద్ధాంతాలకు తప్పుడు వ్యాఖ్యానాలు, తప్పుడు ఆధారాలు ఇచ్చేందుకు జరిగే ప్రయత్నాల వల్ల ఆయా శాస్త్ర విషయాలకు ఏమీ హాని జరగదు కానీ, అలాంటి అనిర్ధారిత విషయాలను అలవోకగా పాలకులు ప్రచారం చేస్తుండడం వల్ల విజ్ఞాన శాస్త్రాలతో పరిచయంలేని ప్రజల మనుషుల్లో అనేక అనుమానిత బీజాలు తప్పక నాటుకుంటాయి. ప్రజల కుల, మత, జాతి తదితర అస్తిత్వ భావోద్వేగాలను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చేందుకు, ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ పోటీపడి తరతమ స్థాయిల్లో చేస్తున్నవే. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రాచీన భారతంలో 'ప్లాస్టిక్ సర్జరీ' ప్రతిభ గురించి ఘనంగా కీర్తించడంతో ప్రారంభమై, డార్విన్ పరిణామ వాదం అశాస్త్రీయమంటూ ఉన్నత విద్యాశాఖ మంత్రి సత్యపాల్ సింగ్ తప్పుపట్టడం, నేడు శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి హర్షవర్ధన్ ఐన్‌స్టీన్ ద్రవ్య-శక్తి సమీకరణ $E=MC^2$ కంటె గొప్ప సిద్ధాంతాలు వేదాల్లో ఉన్నాయని 10వ భారత వైజ్ఞానిక కాంగ్రెస్‌లో చెప్పడం... ఇలా ఎన్నో ప్రకటనలు శాస్త్రీయ దృక్పథం గల ప్రజానీకాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తాయి. భారత రాజకీయ వర్గాలు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అశాస్త్రీయమైన అపోహలను ప్రచారం చేయడం ద్వారా సాధారణ ప్రజానీకంలో అభివృద్ధి నిరోధక ఉద్వేగ వైషమ్యాలు రెచ్చగొట్టడం ఆందోళన కలిగిస్తోంది.

పాలకుల నిర్లక్ష్య ప్రచారం

గణేశ్‌కు ఏనుగు తల అతికించిన (హెడ్ ట్రాన్స్ ప్లాంటేషన్), గోవుల నుంచి ఆక్సిజన్ విడుదల కావడం, నెమళ్ళ పాతివ్రత్యం గురించి గొప్పలు చెప్పడం తదితర అనేక అశాస్త్రీయ నమ్మకాలను పాలకులు నిర్లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారు. ఏ శాస్త్రాన్నైనా, శాస్త్రీయ సిద్ధాంతాన్ని, నియమాలను ప్రశ్నించడం తప్పు కాదు, అయితే ఎలాంటి శాస్త్రీయ ప్రమాణాలను పాటించకుండా ప్రశ్నించడం తీవ్ర తప్పిదమవుతుంది. శాస్త్రీయ అధ్యయనం లేకుండా ప్రశ్నించే హక్కు ఉండదని ఒక తత్వవేత్త వ్యాఖ్యానించారు. ప్రతి వైజ్ఞానిక సిద్ధాంతం ప్రామాణికతను ప్రశ్నించాలి, నిరూపితమవుతుందో లేదో పరిశీలించాలి. అందుకు శాస్త్రీయ దృక్పథ ప్రమాణాలు పాటించకుండా వ్యక్తిగత విశ్వాసాలు, మత భావోద్వేగాలు, సాంస్కృతిక పిడివాదంతో ప్రశ్నించడం ఘోర తప్పిదమవుతుంది. కొత్త సమాచారం ఆధారంగా రూపొందే మరింత సంక్లిష్ట సిద్ధాంతాలు పాత వాటిని పూర్వపక్షం చేస్తాయి. దాన్ని సాకుగా తీసుకొని విజ్ఞాన శాస్త్రాల ప్రామాణికతను, విశ్వసనీయతను తప్పుపట్టి మత, జాతి భావోద్వేగాలు ప్రజల్లో రెచ్చగొట్టడం తప్పు. విజ్ఞాన శాస్త్రాల్లోని సిద్ధాంతాలన్నీ మరింత పరీక్షలకు గురై, మరింత సంక్లిష్టమైన, మరింత స్పష్టమైన ఉన్నతస్థాయి సిద్ధాంతాలకు చోటివ్వక తప్పదు. అంతమాత్రాన నూతన సిద్ధాంతాలన్నీ ఆకాశం నుంచో లేదా బ్రహ్మముఖం నుంచో ఊడిపడవు. పాత సిద్ధాంతాల భుజాలపై నుంచి ఎదిగివచ్చినవే. ప్రతి పాత సిద్ధాంతం కొత్త దానికి చోటిచ్చి తప్పుకోవలసిన అనివార్య చారిత్రకాభివృద్ధి క్రమాన్ని తప్పుగా నిర్వచించి శాస్త్రాలు బోధించే విషయాలు సత్యాలు కావని, వేదప్రామాణికతే శాశ్వత సత్యమని ప్రచారం చేసి ప్రజల్ని తప్పు దారి పట్టించడం తగదు. విజ్ఞానశాస్త్ర సిద్ధాంతాలు ప్రపంచం (ప్రకృతి+సమాజం) గురించిన అంతస్సారాన్ని, అంతర్గత చలన నియమాలను వెలికితీస్తూ నిరంతర సత్యాన్వేషణలో అనంత పాక్షిక సత్యాల దశలను దాటుకుంటూ పరమ సత్యం వైపు నిరంతరాయంగా ప్రయాణిస్తాయి. ఉనికిలో ఉన్న ప్రతి పాక్షికసత్యం, తదనంతరం కొత్తగా ఉనికిలోకి వచ్చే మరొక పాక్షిక సత్యం ద్వారా పూర్వపక్షమవడం అంటే పాత పాక్షిక సత్యం అసత్యమని కాదు, అవాస్తవమని మాత్రమే అర్థం చేసుకోవాలి. అట్లని పాక్షిక సత్యాల దారి వెంట ఎప్పటికీ చేరుకోలేని పరమ సత్యం వెంట అన్వేషణలు సాగించడమంటే ఎండమావిలో నీటికోసం వెతకడమనే నిరర్థక సత్యాన్వేషణగా భ్రమపడకూడదు. పరమ సత్యంకోసం చేసే అనంత అన్వేషణ గణిత శాస్త్ర సంకేతాలులాగా ఎలాంటి అవధులులేని శుద్ధ అనంతం, నిరంతరాయత కాదు. అవధుల్లేని అనంతం 'దుష్ట అనంతం' (Bad Infinity)గా, అర్థరహితమైనదిగా పరిగణించాలి. ఉనికిలో ఉన్న అంశాలనే మరింత మెరుగైన మరింత సంక్లిష్టమైన, మరింత లోతుగా అర్థం చేయించే రూపంలో ఉన్నత స్థాయిలో పునరావృత్తమవుతూ కొనసాగుతుందని గుర్తించడం 'యుక్త అనంతం'(Good Infinity)గాను, గతంతో పోలిస్తే 'మరింత లోతైన పరమసత్యం'గాను గుర్తించాలి. ఈ భావనను ప్రజలకు అర్థమయ్యే భావజాలంగా మలచగలిగితే, విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధి క్రమం సక్రమంగా అర్థమవుతుంది. లేకపోతే ఒక శాస్త్రీయ అధ్యయనం 'కాఫీ' మంచిదని నిర్ధారిస్తే, అదే సమయంలో మరొక అధ్యయనం 'కాఫీ' మానవ జాతికి వినాశకరమని చెబుతుండడంతో ప్రజలు తరచూ తీ వ్ర గందరగోళానికి గురవుతున్నారు.



అభివృద్ధి నిరోధక భావజాలం

ఇలాంటి అవకతవకలను ఆధారం చేసుకొని ప్రజలను మతతత్వ, అభివృద్ధి నిరోధక భావజాల వ్యసనానికి గురిచేసేలా ఆధిపత్య వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. ఈ కారణంగా శాస్త్రీయ దృక్పథాన్ని నిరంతరాయంగా అలవర్చుకోవాల్సిన సమాజం క్రమంగా వ్యక్తిగత విశ్వాసాలు, ఉద్వేగాలు ప్రజాభిప్రాయంగా స్థిరపడుతున్న సత్యానంతర కాలంలోకి చేరుకుంది. సత్యానంతర రాజకీయాలతో అంటగాగుతున్న అధికార, ప్రతిపక్ష రాజకీయ నాయకులు ఓటు బ్యాంకుల కోసం ప్రజల మధ్య అస్తిత్వ వైషమ్యాలను రెచ్చగొడుతున్నారు. మెజారిటీ మతస్తులను 'ఏకీకృత హిందూ అస్తిత్వం' పేరు మీద బీజేపీ సంఘటితం చేస్తుంటే, మైనారిటీ మతస్తులు సహా హిందూ మతంలో అంతర్భాగమైన లింగాయత్ మైనారిటీ మతశాఖీయులను, వివిధ కుల సమూహాలను కాంగ్రెస్ సంఘటితం చేస్తోంది. అదే సమయంలో హిందూ మతం సమాజాన్ని వివిధ శకల ప్రజాసమూహాలుగా నిర్వచించడంతో ఏర్పడిన కులసంఘాలను వామపక్షాలు సహా వివిధ లౌకిక శక్తులు కూడా ఏర్పరుస్తున్నాయి. ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ భారత దేశ సామాజిక ప్రత్యేకతల పేరుతో పాలకవర్గ పార్టీలు, వామపక్ష, లౌకికవాద పార్టీలు పోటీపడి మతతత్వ, మతంలో అంతర్భాగంగా ఉన్న కులతత్వ భావోద్వేగాలను రెచ్చగొడుతున్నట్టే లెక్క.

వైజ్ఞానిక అభివృద్ధికి తప్పుడు మేధో ఆలోచనా ధోరణి ప్రధాన అడ్డంకిగా నిలుస్తుంది. భారతీయ ప్రజానీకం ప్రధానంగా మతవిశ్వాసాల పునాదిగా గల భావోద్వేగాలపై జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయాధిపత్యం కోసం విజ్ఞాన శాస్త్రాల ప్రామాణికతను ప్రశ్నిస్తూ, తప్పుడు శాస్త్ర చరిత్రను ఉద్వేగాల పునాదిపై ప్రచారం చేయడం సామాజిక వైషమ్యాలు పరాకాష్ఠకు చేరుకోవడానికి దారితీస్తుంది. రాజకీయ ఆధిపత్య లక్ష్యాలకోసం ప్రజల భావోద్వేగాలను వాడుకోవడం ప్రపంచవ్యాప్తంగా పాలకుల నైజం.

మితవాద విశ్వరూపం

సమాజంలోని ప్రజల వైజ్ఞానిక స్ఫూర్తిస్థాయిని బట్టి రాజకీయపక్షాలు ఆ మేరకు విద్వేష రాజకీయాల కోసం అశాస్త్రీయ మత, సాంస్కృతిక విషయాలను ప్రజల్లో బలంగా ప్రచారం చేసేందుకు సాహసిస్తాయి. ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన ఫాసిస్టు, అర్థ ఫాసిస్టు, ఫాసిస్టు ధోరణులు గల ప్రభుత్వాలు విజ్ఞాన శాస్త్ర విషయాలపై తీవ్రంగా దాడి చేస్తున్నాయి. వాతావరణ మార్పు వంటి భౌగోళిక సవాళ్ళను, అంతర్జాతీయం చేపట్టిన కార్యాచరణ ప్రణాళికను సైతం తప్పుడు అధ్యయనాలుగా వారు తృణీకరిస్తున్నారు.

ప్రపంచ ఆర్థిక సంక్షోభ సమయంలో ప్రపంచవ్యాప్తంగా కఠినమైన నిర్ణయాలు తీసుకోగల రాజ్యాలు ఏర్పడితే గానీ, కార్పొరేట్ అనుకూల ఆర్థిక ఎజెండాను అమలు చేయడం సాధ్యంకాదు. అందుకు ఆర్థిక వికాస కాలంలో ప్రజాస్వామిక ముసుగుతో ఉన్న సెంట్రిస్ట్ (మధ్యేమార్గం) ప్రభుత్వాలు చాలా కీలక పాత్ర నిర్వహించాయి. సంక్షోభం తీవ్రతరమయ్యే కొద్దీ మధ్యేమార్గ ప్రభుత్వాలు ఎలాంటి కార్పొరేట్ అనుకూల నిర్ణయాలు తీసుకోలేకపోవడమే కాక, దిగజారుతున్న ప్రజల జీవన ప్రమాణాలను, సాధారణ పాలనను సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడుతుంది. అస్తవ్యస్తమైన సాధారణ పాలన, ఆర్థిక వ్యవస్థను చక్కదిద్ది కార్పొరేట్ వాణిజ్య కార్యకలాపం సజావుగా సాగాలంటే, ప్రజామోదం పొంది, డబ్ల్యూటీవో ఆర్థిక విధానాలను కచ్చితంగా, కఠినంగా అమలు చేయగల సత్తా ఉన్నా పార్టీ అధికారంలోకి రావలసి ఉంటుంది. ఆ కారణంగా మి(మ)త వాద భావజాల సంస్థలకు, రాజకీయ పక్షాలకు ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ శక్తుల నుంచి అమిత ప్రోత్సాహం లభించి అమెరికాలో ట్రంప్, భారత్‌లో నరేంద్రమోదీ సహా అనేక దేశాల్లో మితవాద పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ప్రపంచార్థిక సంక్షోభం పరిష్కారమయ్యే దాకా దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల్ని నెరవేర్చే విధానాలు అమలు కావాలంటే ఒక క్రమశిక్షణ కలిగిన మితవాద పార్టీ అధికారంలో సుస్థిరంగా కొనసాగాలి. ఈ రహస్య హిందుత్వ ఎజెండాతో మెజారిటీ సమూహాన్ని సంఘటితం చేసి అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు గో రక్షక దళాలు వంటి సమూహాల విధ్వంస/మారణకాండలకు అధికార పక్షం పరోక్ష/ప్రత్యక్ష ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. ఈ క్రమంలో కల్బుర్గి, గౌరీ లంకేష్ వంటి సామాజిక ఉద్యమకారులను హత్యలకు గురిచేస్తున్నారు.

గతంలో అల్బర్ట్ ఐన్‌స్టీన్‌పై హిట్లర్ సారథ్యంలోని నోబెల్ పురస్కార గ్రహీతలైన ఫిలిప్ లెనార్డ్, జోహెన్నెస్ స్టార్క్ వంటి శాస్త్రవేత్తలు అర్థరహితమైన విమర్శలు చేపట్టారు. అలాంటి వాతావరణాన్ని భారత పాలకులు నేడు పనిగట్టుకుని సృష్టించేందుకు పలు వైజ్ఞానిక సిద్ధాంతాలను పురాణాల ఆధారంగాను, వేద ప్రమాణాలతోనూ తీవ్రంగా విమర్శిస్తూ సాధారణ ప్రజల్లో మత భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారు. 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైంటిఫిక్ రిసెర్చ్ ఆన్ వేదాస్' అనే వెబ్‌సైట్‌లో స్టీఫెన్ హాకింగ్ పేరుతో నడుస్తున్న తప్పుడు ఫేస్‌బుక్ పేజీ నుంచి తీసుకొని వండివార్చిన కథనం ఆధారంగా ఐన్‌స్టీన్ సిద్ధాంతానికి మించిన ద్రవ్య శక్తి సిద్ధాంతం వేదాల్లో ఉన్నాయని హాకింగ్ అభిప్రాయపడుతున్నట్లు వ్యాసం ప్రచురితమైంది. దాన్ని ఉటంకిస్తూ, ఇతరత్రా ఎలాంటి అధ్యయనం లేకుండా, తమ హిందుత్వ రాజకీయాలకు సారూప్యత ఉన్న కారణంగా సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి హర్షవర్ధన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఉటంకించడం హేతు విరుద్ధం. ఇందుకు ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలు తప్పుడు అశాస్త్రీయ భావాలను ప్రచారం చేసేందుకు కీలక మాధ్యమాలుగా అవతరించాయి. అశాస్త్రీయ, కుల, మత, జాత్యహంకార భావాలు ఇంటర్‌నెట్ పునాదిగా నేడు అతి తక్కువ కాలంలో విద్యావంతులను ప్రభావితం చేస్తున్నాయి. వాస్తవికతకు, వస్తుగత అంశాల పునాదిగా రూపొందించిన సమాచారానికి బదులు వ్యక్తిగత విశ్వాసాలు, భావోద్వేగాలు, అశాస్త్రీయ భావాలు అంతర్జాతీయ సమాజంలోని ప్రతి జీవనరంగంలో పెను తుఫానులా ఆవరించి రాజ్యమేలుతున్న తరుణంలో శాస్త్రీయ ప్రాపంచిక దృక్పథంతో ప్రజా ఉద్యమాలు దీప స్తంభాల్లా, దిక్సూచుల్లా దృఢంగా ముందుకు సాగాలి.

> 'అశాస్త్రీయ, కుల, మత, జాత్యహంకార భావాలు ఇంటర్‌నెట్ పునాదిగా నేడు అతి తక్కువ కాలంలో విద్యావంతులను ప్రభావితం చేస్తున్నాయి. వాస్తవికతకు, వస్తుగత అంశాల పునాదిగా రూపొందించిన సమాచారానికి బదులు వ్యక్తిగత విశ్వాసాలు, భావోద్వేగాలు, అశాస్త్రీయ భావాలు అంతర్జాతీయ సమాజంలోని ప్రతి జీవనరంగంలో పెను తుఫానులా ఆవరించి రాజ్యమేలుతున్న తరుణంలో శాస్త్రీయ ప్రాపంచిక దృక్పథంతో ప్రజా ఉద్యమాలు దీప స్తంభాల్లా, దిక్సూచుల్లా దృఢంగా ముందుకు సాగాలి.'

◆ వెన్నెలకంటి రామారావు

నీరు అవసరం కాదు.. హక్కు


ప్రపంచ జలదినోత్సవం (మార్చి 22) సందర్భంగా జల పరిస్థితి కాదు దుస్థితి గురించి ఒక్కసారి సమీక్షించుకుందాం. ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు తలసరి జల వినియోగం పెరుగుతున్నది. మరోవైపు జల దుబారా కూడా జరుగుతున్నది. జల కాలుష్యం పెచ్చరిల్లుతున్నది. రక్షిత మంచినీరు కరువవుతున్నది. వెరసి నీటి సంక్షోభం తీవ్రమవుతున్నది.

ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రాంతాలు, నగరాలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ఇటీవల దక్షిణ ఆఫ్రికాలోని కేప్ టౌన్ నగరాన్ని డ్రై సిటీగా ప్రకటించారు. అక్కడి ప్రభుత్వం ఏప్రిల్ 14 వరకు మత్రమే నీరు సరఫరా చేస్తామని ప్రకటించింది. నీటికోసం వీధిపోరాటాలు జరుతున్నాయి. నీరు సరఫరా చేసే కేంద్రాలకు సైనిక రక్షణ కల్పించాల్సి వస్తున్నది. గుక్కెడు నీళ్ళు దొరకక దాహానికి అలమటించే పరిస్థితులు తలెత్తున్నాయి. భవిష్యత్తులో నీళ్ళకోసం యుద్ధాలు జరిగిన ఆశ్చర్యపోనక్కర్లేదు.

పంచభూతాల్లో నీరు ఒక్కటి. నీరు ప్రకృతి ఇచ్చిన వరం. ప్రకృతిలో ఉచితంగా లభ్యమయ్యే సహజ వనరు. సర్వ ప్రాణ కోటికి నీరే ప్రాణాదారం, నీరే జీవనాధారం. మానవ శరీర నిర్మాణంలో 60 శాతం పైగా నీరే. జీవ ప్రక్రియలోను నీరు పోషించే పాత్ర అమోఘమైంది. భూగోళంపై మూడవ వంతు నీరున్నప్పటికి, స్వచ్ఛమైన నీరు మూడు శాతానికి మించలేదు. అందులోనూ ఒకశాతం ఉత్తర, దక్షిణధ్రువాల్లోని మంచు కొండల్లో ఉంది. అంటే భూమిపై లభ్యమయ్యేది కేవలం రెండుశాతం నీరుమాత్రమే మన వినియోగానికి పనికి వస్తుంది.

నీరు అమూల్యమైన సహజ వనరు. అయితే అపరిమితమైన వనరు కాదు. ప్రజలందరు నీళ్ళను ధనంలాగా దాచుకోవాలి. మంచినీళ్ళలాగా ఖర్చుపెట్టకూడదు. నీటిని పొదుపు చేయాలి. ప్రజలు నీటిని ఇష్టానుసారం వినియోగిస్తున్నారు. నీటి వినియోగంపై ఎలాంటి ఆంక్షలు లేవు. ప్రజలకు జలస్పృహ తక్కువే. జల చైతన్యమూ తక్కువే. అందువల్ల జల వృథాచేసి, వ్యథనొందుతున్నారు.

జలాశయాలు ఆక్రమణకు గురౌతున్నాయి. రియల్ ఎస్టేట్లకు కల్పతరువు అవుతున్నది. సిమెంట్ కాంక్రీట్‌లు పెరిగి భూమిలోకి నీరు ఇంకే సామర్థ్యం తగ్గుతున్నది. ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. బోరు బావుల లోతు పెరుగుతున్నది. నీరు పాతాళం చేరుతున్నది.



భూమాత బోరుబావుల మయమవుతున్నది. బోరు బావి నడవక బోరున విలపిస్తున్నారు సామాన్య జనం.

ప్రజల కన్నీరు కొంతమంది పాలిట పన్నీరవుతున్నది. రక్షిత మంచినీరు అత్యంత ఖరీదైన వస్తువుగా మారిపోతున్నది. కార్పొరేటు సంస్థలకు కోట్లాది రూపాయలు సంపాదించి పెట్టే బంగారు బాతవుతున్నది. వారి జలసంపద కోటకు పడగలెత్తుతున్నది. షేర్ మార్కెట్‌లో లిస్టింగ్ అయిన ఆశ్చర్యపోనక్కర్లేదు.

నీళ్ళు రకరకాల బ్రాండ్లతో మార్కెట్‌ను ముంచెత్తుతున్నారు. బాటిల్ వాటర్ సంస్కృతి వచ్చేసింది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, హోటళ్ళు, ఒక్కటేంటి ఎక్కడ చూసిన బాటిల్ వాటరే. తాగి పడేసిన బాటిళ్ళే. భూమిలో ఉండాల్సిన నీళ్ళు షెల్ఫ్‌ల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. తిండి ఖర్చు కంటే నీళ్ళ ఖర్చే ఎక్కువవుతున్నది. భూమిలో వాటర్ టేబుల్ తగ్గుతున్నది. షెల్ఫ్‌ల్లో వాటర్ బాటిళ్ళ సంఖ్య పెరుగు తున్నది. మరోవైపు ఎండిపోతున్న చేదబావులు, నీళ్ళురాని బోరుబావులు, జలకళ తప్పిన చెరువులు, వట్టిపోతున్న వాగులు ఎక్కడికి వెళ్ళిన దర్శనమిస్తున్నాయి. దప్పికగొన్న బాటసారి 'చెలిమి' తవ్వి నీళ్ళు తాగే రోజులు అంతమయినాయి. ఇండ్లల్లో సైతం నీళ్ళను బిందెల్లో నింపి పట్టుకునే రోజులు గతించాయి. క్యాన్ వాటర్ కాలరెగరేస్తున్నాయి. నీరు ప్రజల ఉమ్మడి సహజ వనరుగా మాయమవుతున్నది.మెల్లమెల్లగా ప్రైవేటుపరం అవుతున్నది. ఇప్పుడు అంతా జల మార్కెట్.

డబ్బున్నవాళ్ళు మంచి నీళ్ళకోసం డబ్బును మంచి నీళ్ళలాగా ఖర్చుచేసి నీళ్ళను కొనుగోలు చేస్తున్నారు. వేసవిలో గ్రామీణ పేద మహిళలు బిందెడు నీళ్ళ కోసం కిలోమీటర్లు నడుస్తున్నారు. రోజులో సగ సమయం నీళ్ళ కోసమే వెచ్చిస్తున్నారు. ఈ నీటి గ్రహంలో ఇంకా 60 కోట్ల మందికి రక్షిత మంచినీరు అందుబాటులో లేదు. ఎందరో అపరిశుభ్రమైన నీళ్ళుతాగి రోగాల బారిన పడుతున్నారు. ఎనబై శాతం వ్యాధులు అపరిశుభ్రమైన నీళ్ళుతాగడం వల్లే సంభవిస్తున్నాయి. నీళ్ళు అందక రైతాంగం విలవిలలాడుతున్నాది. భూములు నీళ్ళులేక నోర్లు తెరుస్తున్నాయి. పంటలు ఎండిపోతున్నాయి. పంట దిగుబడి తగ్గుపోతున్నది. రైతుల ఆరుగాలం కష్టం వృథా అవుతున్నది. అప్పులపాలైన రైతులు ఆత్మహత్యల వైపు నెట్టబడుతున్నారు. ఈ సంవత్సరం ప్రపంచ జల దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి '21వ శతాబ్దపు నీటి సవాళ్ళు-ప్రకృతి ఆదార పద్ధతుల అన్వేషణ' అనే అంశంపై జరుప తలపెట్టింది. మనమందరం ఈ జలదినోత్సవంలో భాగస్వాములౌదాం. ప్రతి వర్షపు బొట్టును బంగారంలా ఒడిసి పట్టుకుందాం. వీలైన చోట నీళ్ళను నిల్వ చేసుకుందాం. వీలుకాని చోట నీటిని భూమిలో ఇంకేలా చర్యలు తీసుకుందాం. కలుషితం కాకుండా చూసుకుందాం. నీటిని రీసైకిల్ చేసుకొని వినియోగించుకుందాం. ఆధునిక సాంకేతిక పద్ధతులు ఉపయోగించి వ్యవసాయం చేద్దాం. ఇంటింటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుందాం. ప్రజల్లో జలస్పృహను పెంచుదాం. నీటి క్రమశిక్షణను అలవర్చుకుందాం. తలసరి వినియోగంపై రేషన్ విధించుకుందాం. విద్యార్థుల్లో జలచైతన్యాన్ని కలిగించుదాం. జలపొదుపు వినియోగాన్ని పాఠ్యాంశంగా చేర్చుకుందాం. జల సంరక్షణ సమిష్టిగా ఉద్యమిద్దాం. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరం ప్రతిన బూనుదాం . 'స్వచ్ఛమైన నీరు ప్రజలందరి ప్రాథమిక హక్కు'. అని నినాదిద్దాం.

◆ పుల్లూరు జగదీశ్వర్ రావు

(నేడు ప్రపంచ జలదినోత్సవం)

సంతకం

కవిత

అనునిత్యపు/రణగొణధ్వనులకంటె ముందుగానే
రోడ్డు నిద్ర లేచింది / అప్పటికింకా
ఎవరూ చూడని
ఎవరి పాదముద్రలూ అంటని / ఆ రోడ్డుమీద
ముందుగా నేను నా సంతకం పెట్టాను
ఇంట్లోకి ప్రవేశించాను
ఇక్కడా అక్కడా / చిందరవందరగా పడివున్న
అనేకానేక వస్తువుల్ని
ఓ క్రమపద్ధతిలో అమర్చాను
అక్కడే ఓ మూల / కనీకనబడనిచోట
నా సంతకం పెట్టాను / నదిలోకి ప్రవేశించాను
ఒడ్డుల్ని ఒరుసుకొంటు / నీటిపై తేలుతున్న
నాచు గుర్రపుడెక్కల్ని తొలగించాను
నదిని ఒక్కసారిగా కుదిపేశాను / అట్టడుగున
నదీలోతుల్లోని నీళ్లపై / నేను నాసంతకం పెట్టాను
/ ఋతువుల్లోకి నడిచాను
చలన జీవనసూత్రాల్ని వేరుచేశాను
విరిగిన విషాద వృక్షాల్ని
ఆశావహ స్పృహతో అతికించాను
అగమ్యంగా ఎగురుతున్న / పక్షుల రెక్కల్ని
ఎగిరెళ్లిపోకముందే ముడేశాను / ఎక్కడో ఓచోట
ఓ కూలి దినభత్యపు జీవితం మీద
మళ్లీ నేను నా సంతకం చేశాను.

- మూలం - కేదార్ నాథ్ సింగ్
- ఆంగ్లానువాదం - వినయ్ ధార్వాడ్కర్
- తెలుగు - బండ్ల మాధవరావు

మనం కుటుంబం
గురువారం, 22 మార్చి 2018
www.manamnews.com

రైడింగ్ ఓ ఫన్

రొటీన్ అంటే విసుగు, స్టీరియోటైప్‌కు గుడ్ బై కొట్టి హ్యాపీగా, అడ్వెంచరస్‌గా లైఫ్ లీడ్ చేయాలనుకున్న అమృత కాశీనాథ్, శుభ్ర ఆచార్యలు సరికొత్త ప్రయత్నం చేసి విజయం సాధించారు. బైకర్స్ అయిన అమృత, శుభ్రలకు గంటల తరబడి, రోజుల తరబడి అలా డ్రైవ్ చేసుకుంటూ పోవడమంటే అత్యంత ఇష్టమైన వ్యాపకం. అందుకే ఈ వ్యాపకాన్నే తమ సంకల్పానికి మాధ్యమంగా ప్రయోగించారు.



వరల్డ్ రికార్డ్ సృష్టించారు.. అబ్బాయిల ప్రపంచాన్ని అమ్మాయిల కళ్లతో చూసి.. అమ్మాయిల కళ్లకు కట్టినట్టు చూపాలనుకున్న సంకల్పానికి తుది రూపు ఇచ్చేలా ఇద్దరు అమ్మాయిలు చూపిన తెగువ అందరికీ షాక్ ఇచ్చింది. నమ్మశక్యం కానిదాన్ని... సాధించలేనిది ఏదీ లేదు అన్నదానికి నిలువెత్తు రూపంగా నిలిచారు వారు.

కన్యాకుమారి టు లే.. 5 రోజుల్లో!!





కష్టాలు ముందే తెలుసు

వీరిద్దరికీ విహార యాత్రలంటే ప్రాణం. ఇద్దరూ కలిసి, లేదా విడివిడిగా ఇప్పటికే దాదాపు భారతదేశమంతా పలుమార్లు చూసిన అమృత, శుభ్రలు తాము చేస్తున్న బైక్ అడ్వెంచర్‌లో ఎదురుకానున్న కష్టనష్టాలు బాగా ఎరిగినవారు కావడంతో సునాయాసంగా అనుకున్నది సాధించేశారు. కన్యాకుమారి నుంచి లేకు వెళ్లే సమయంలో వీరు ఎదుర్కొన్న అతి పెద్ద సమస్య రోజూ కేవలం 5 గంటలపాటు మాత్రమే నిద్రపోతూ, 5 రోజుల్లో దేశం ఈ చివరినుంచి ఆ చివరికి చేరుకోవడం అని చెబుతారు అమృత. నిద్ర సరిపోక టైట్ షెడ్యూల్‌ను తూ.చ. పాటించినందునే లక్ష్యాన్ని చేరుకోగలిగినట్టు చెబుతారు. బెంగళూరుకు చెందిన వీరు బ్రేవ్ వుమెన్‌గా బైకులు నడిపడానికి సరదా చూపే అమ్మాయిలందరికీ రోల్ మోడల్‌గా నిలుస్తున్నారు.




కన్యాకుమారి నుంచి లేకు..

ఉత్తర-దక్షిణానదులను ఏకబిగిన తమ రైడ్‌లతో కలిపే ప్రయత్నం చేసిన వీరు 129 గంటల్లో ప్రయాణించిన దూరం ఎప్పటికీ నమ్మలేనిదిగా రికార్డు సృష్టించింది. ఎందుకంటే ఇలా కన్యాకుమారి నుంచి లేకు వీరు చేసిన ప్రయాణం అక్షరాలా 3,825 కిలోమీటర్లు అదికూడా కేవలం అయిదంటే అయిదే రోజుల్లోనే!



బైకర్లకు చాలెంజ్

మోటర్‌సైకిల్‌పై ఇంత తక్కువ సమయంలో ఇలా దేశం చుట్టిరావడం అత్యంత చాలెంజింగ్ వ్యవహారం. ఇప్పటికే లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్న శుభ్ర, అమృతలు తాము ఎప్పటికైనా ఇంత పెద్ద సాహసం చేస్తామని కలలోకూడా ఊహించలేదని సింపుల్‌గా చెబుతున్నారు. ఏదో అలా అది జరిగిపోయింది అనే సింప్లిసిటీ చూపుతున్న వీరు ఇప్పటికే తమ బైకులపై 2లక్షల కిలోమీటర్లు ప్రయాణం చేసిన అనుభవం సంపాదించారు. ఆతరువాత భూటాన్, శ్రీలంక దేశాలను కూడా వీరు బైకులపైనే చుట్టి వచ్చారు. ఈ ఏడాది మంగోలియాకు వెళ్లడాన్ని టార్గెట్‌గా పెట్టుకున్న ఈ ఇద్దరు బైకర్లు ఇప్పుడు సెలబ్రిటీలుగా, ట్రావెల్ సైట్లు, యాప్స్, బ్లాగుల్లో వెలిగిపోతున్నారు.



కే టు కే తర్వాత?

13 ఏళ్లుగా స్నేహితులుగా ఉన్న వీరు గత ఏడేళ్లుగా కలిసి టూర్లకు వెళుతున్న వీరిద్దరూ ఈ సాహసానికి ముందు కొన్ని నెలలపాటు ట్రైనింగ్ సెషన్స్‌కు హాజరై, శారీరకంగా, మానసికంగా కఠినమైన టూర్‌కు సిద్ధమయ్యారు. అయితే ఇది కంప్లీట్‌గా స్పాన్సర్డ్ ట్రిప్ కావడంతో ఖర్చుకు వెనకాడాల్సిన అవసరం మాత్రం రాలేదు. కే టు కే (కాశ్మీర్ టు కన్యాకుమారి) తర్వాత మరో అతిపెద్ద ఎక్స్‌పెడిషన్ కోసం వీరు అప్పుడే మాస్టర్ ప్లాన్ వేస్తున్నారు.



భయాన్ని జయించే సాధనం ఇదే

అమ్మాయిలు తమలోని భయాందోళనలు పారద్రోలాలంటే బైక్ రైడింగ్ చేసి చూస్తే చాలు రాటుతేలుతారు. మానసికంగా, శారీరకంగా కూడా తమలోని శక్తి యుక్తులను అమ్మాయిలు రియలైజ్ అయ్యేలా చేసే మ్యాజిక్ రైడింగ్‌లో మాత్రమే ఉందంటారు వీరు. ఏ ప్రాంతమైనా సురక్షితమైనదే కాకపోతే అది చాకచక్యంగా మనం కనుగొంటే సురక్షితంగా ప్రపంచం చుట్టేసి రావచ్చని తమ అనుభవంతో చెబుతున్నారు.

ట్రావెలింగ్ సర్కస్

ట్రావెలింగ్ సర్కస్ అనే హ్యాష్‌ట్యాగ్‌తో వీరు తమ అనుభవాలను పోస్ట్ చేసే తీరు చాలా అద్భుతంగా ఉంటుంది.. మచ్చుకు ఈ వాక్యం చాలు.. ''I believe four wheels move the body but two wheels move the Soul''అన్న అమృత కాశీనాథ్ వ్యాఖ్యలు ఆమెలోని దృఢ చిత్తాన్ని చాటుతుంది కదూ. వీరు వ్యక్తిగతంగా పర్యటించడంతోపాటు, పలు టీమ్ అడ్వెంచర్లు కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నారు.



మం(చి)జు యుద్ధం

రొటీన్‌గా అందరిలా బిజీగా ఉన్న అమ్మాయి ఇతరుల కోసం కూడా కాస్త టైం వెచ్చిస్తుంది. ప్రస్తుతం ఈ వీడియో ఒకటి వైరల్ అవుతోంది. రోడ్ సైడ్ రోమియోలు, హీరోలుగా ఫీల్ అయ్యే ఆకతాయి బైక్ రైడర్ల భరతం పట్టేందుకు రంగంలోకి దిగిన ఈ అమ్మాయికి ఉన్నట్టుండి ఫాలోయర్ల సంఖ్య విపరీతంగా పెరిగింది.

మిషన్ ఫుట్‌పాత్

27 ఏళ్ల మంజూ థామస్ తన కళ్లెదుట జరుగుతున్న కొన్ని తప్పులను, ప్రమాదాలను చూస్తూ ఊరుకునే రకం కాదు. తనకు తోచినది చేసేస్తూ ఉంటుంది. అదేమిటంటే సాటి మనిషిగా చూస్తూ స్పందించకుండా ఎలా ఉంటాం అని ఎదురు ప్రశ్నిస్తుంది. పాదచారుల ప్రాణాలు ప్రాణాలు కావా? వీరికి రోడ్డుపై నడిచే హక్కు లేదా? మరైతే అందరూ ఏదో ఒక వాహనంలో ప్రయాణిస్తూనే రోడ్డుపైకి రావాలా? లేకపోతే రహదారిపైకి రాకూడదా? అని ప్రశ్నల వర్షం కురిపించే క్రూసేడర్.

ఖాఖీలు పట్టించుకోరేం?

ఫుట్‌పాత్‌పై వాహనాలు నడిపేవారివి తన వద్ద బోలెడన్ని ఫొటోలు, వీడియోలు ఉన్నాయని, వాటిని చూపి, పాదచారులకు ఎదురవుతున్న సమస్యలపై ట్రాఫిక్ పోలీసులకు మొదట్లో ఫిర్యాదు చేస్తే వారు స్పందించలేదని వాపోతున్నారు. అయినా పట్టు వదలని విక్రమార్కుడిలా సిటీ పోలీస్ కమిషనర్, డీసీపీలకు కంప్లైంట్లు ఇస్తూనే ఉన్నట్టు మంజూ వివరిస్తున్నారు. ఓవైపు ఫుట్‌పాత్‌పై డ్రైవ్ చేసే వాహనదారుల ఫొటోలు, వీడియోలు తమకు అందిస్తే, తగు చర్యలు తీసుకుని చలాన్ వేస్తామని నగర పోలీసులు నోటితో చెబుతున్నా నొసటితో మాత్రం వెక్కిరిస్తున్నారని ఆమె అసలు విషయాన్ని నెటిజెన్లకు వివరిస్తున్నారు.



నాలుగు రోజుల్లోనే సెలెబ్

మార్చ్ 16 బెంగళూరు నగరంలోని ఓ ప్రధాన రోడ్డుపై కొంతమంది బైకర్లతో ఫుట్‌పాత్‌పై బైకులు ఎందుకు డ్రైవ్ చేస్తారు? అని వాదిస్తూనే వాహనాలు ఫుట్‌పాత్‌పైకి రాకుండా రాళ్లు, టైల్స్ అడ్డుగా పెట్టడాన్ని అటుగా పోతున్న ఓ ఔత్సాహికుడు వీడియోగా షూట్ చేసి, సోషల్ నెట్‌వర్క్‌లో పోస్ట్ చేశాడు. అంతే అమాంతంగా 10 లక్షలకు పైగా ఈ వీడియోకు వ్యూస్ వచ్చిపడ్డాయి. ఆతరువాత మంజూ ఫోన్‌కు ఒకటే కాల్స్, మెసేజెస్. అందరూ ఆమె తెగువను, చొరవను అభినందించేవారే. హెచ్‌ఆర్ ప్రొఫెషనల్‌గా నగరంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న మంజు తాను కాలేజీ రోజులనుంచీ ఇలాగే పోరాడుతున్నట్టు చెబుతున్నారు.



ఎవరో ఒకరు ఎప్పుడో అప్పుడు..

అన్నట్టు ఈ నాలుగు రోజుల్లోనే బెంగళూరు నగరంలో సడన్‌గా మార్పు వచ్చింది. ఇలాంటి మంజులు సిటీలో ఇంకెంత మంది ఉన్నారో? ఎక్కడెక్కడ ఉన్నారో? ఎవరెవరు వీడియోలు, ఫొటోలు తీసి పోలీస్ కంప్లైంట్ ఇస్తారో? ఎందుకొచ్చిన గోల? కాస్త లేటయినా ఫుట్‌పాత్ జోలికి పోకపోతే సరి అనే ధోరణిలో యువత రాత్రికి రాత్రి మారిపోయేలా మంజూ ఎఫెక్ట్ కనిపిస్తుండడం నమ్మశక్యం కాని విషయం. ఒకవేళ తాము ప్రయాణిస్తున్న మార్గంలోనే మంజూ థామస్ ఉంటే? వామ్మో అస్సలు ఈ తలనొప్పి ఎందుకన్నది మోటర్ బైకుల్లో వెళ్తున్నవారి అంతరంగం అని బెంగళూరు నెటిజెన్లు తాజాగా చేస్తున్న పోస్టుల సారాంశం అంటే .. ఎవరో ఒకరు ఎపుడో అపుడు అన్నట్టు మంజూ చేస్తున్న సాహసానికి ప్రతిఫలం దక్కుతుండడం మంచిదే కదా. పలు నగరాల్లో ఫుట్‌పాత్ వినియోగదారుల సంఘాలు ఉన్నప్పటికీ వీరెవ్వరూ మంజూ థామస్‌లా వినూత్నంగా ప్రయత్నించకపోవడంతో బైకర్ల ధోరణిలో మార్పు రావడం లేదు.

దేశంలో నం.1 ప్రపంచంలో 142

హైదరాబాద్, మార్చి 21:

భారత దేశంలో జీవించేందుకు అత్యుత్తమ నగరం హైదరాబాదేనని మెర్సర్ వార్షిక జాబితా తేల్చేసింది. వరుసగా నాలుగోసారీ హైదరాబాద్‌కే పట్టం కట్టింది. దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో వాతావరణం అనుకూలంగా ఉంటుందని, నేరాల సంఖ్య తక్కువని తెలిపింది. 'క్వాలిటీ ఆఫ్ లివింగ్ రేటింగ్ 2018' పేరుతో విడుదల చేసిన ఈ జాబితాలో భాగ్యనగరం నెత్తిన కిరీటం పెట్టింది. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో భారత్‌లో జీవించేందుకు ఉత్తమ నగరంగా హైదరాబాద్ తొలి స్థానంలో నిలిచింది. క్రైమ్‌రేట్, వాతావరణం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని హైదరాబాద్‌ను ఎంపికచేశారు. హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్రలోని పుణె కూడా ఉత్తమ నగరాల జాబితాలో తొలి వరుసలో ఉంది. అంతర్జాతీయ ఉద్యోగులకు ఇక్కడ సౌకర్యంగా ఉంటుందని తేల్చింది. గృహనిర్మాణానికి, వేర్వేరు దేశాల నుంచి వచ్చిన వారికి అవసరమైన వస్తుసేవలు పుణెలో లభిస్తాయని వెల్లడించింది. కమ్యూనికేషన్ పరంగానూ పుణెకు మంచి మార్కులే పడ్డాయని తెలిపింది. కాగా.. దేశ రాజధాని ఢిల్లీ వరుసగా మూడో సంవత్సరం అట్టడుగు స్థానంలో ఉంది. విపరీతమైన వాయు కాలుష్యం, భారీ ట్రాఫిక్‌తో ఢిల్లీ ఈ జాబితాలో మరింత కిందకు పడిపోతోంది. మిగతా మెట్రో నగరాలు ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూరులు ఈ రేసులో వెనుకబడిపోయాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా జీవించడానికి ఉత్తమమైన నగరాల జాబితాలో హైదరాబాద్ 142వ ర్యాంక్ దక్కించుకుంది. హైదరాబాద్‌తో పాటు పుణె కూడా ఇదే ర్యాంక్ సాధించింది. గతేడాది హైదరాబాద్ 144వ స్థానంలో ఉండగా ఈసారి రెండు స్థానాలు ఎగబాకింది. ఇక పుణె కూడా 151వ ర్యాంక్ నుంచి 142వ స్థానానికి మెరుగుపడింది. బెంగళూరు 149, చెన్నై 151, ముంబయి 154, కోల్‌కతా 160, ఢిల్లీ 162 ర్యాంకులు దక్కించుకున్నాయి.

ఉత్తమ నగరం హైదరాబాద్.. దేశంలోనే 'భాగ్య' నగరం
ముచ్చటగా నాలుగోసారి కిరీటం.. అన్నివేళలా అనుకూల వాతావరణం



ప్రపంచంలో ఉత్తమ నగరం వియన్నా

అంతర్జాతీయంగా ఆస్ట్రియా రాజధాని వియన్నా ఉత్తమ నగరంగా తొలి ర్యాంకు దక్కించుకుంది. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 450 దేశాలలో నిర్వహించిన సర్వేలో వియన్నా ఈ ఏడాది కూడా టాప్లో నిలిచింది. ఆ తర్వాత స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ రెండో ర్యాంక్‌లో ఉంది. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్, జర్మనీలోని మ్యూనిచ్ 3వ స్థానాన్ని దక్కించుకున్నాయి. నార్త్ అమెరికాలో ఉత్తమ నగరంగా వాంకోవర్‌కు గుర్తింపు దక్కింది. ఈ జాబితాలో వాంకోవర్ ఐదో స్థానంలో నిలిచింది. ఇక ఆసియాలోనే బెస్ట్‌గా సింగపూర్ నిలిచింది. జాబితాలో దీనికి 25వ ర్యాంకు దక్కింది. మరోవైపు పారిస్ 39, లండన్ 41, న్యూయార్క్ 45, వాషింగ్టన్ 48, దుబాయ్ 74 ర్యాంకులు దక్కించుకున్నాయి.

పారిశుధ్యంలో బెంగళూరు బెస్ట్

భారత్‌లో బెంగళూరు స్వచ్ఛమైన నగరమంటూ మెర్సర్ కితాబిచ్చింది. పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, అంటువ్యాధుల ముప్పు, వాతావరణ కాలుష్యం, తాగునీటి లభ్యత, నాణ్యత తదితర ప్రమాణాల ఆధారంగా నిర్వహించిన సర్వేలో బెంగళూరు మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొంది. అంతర్జాతీయంగా ఈ విషయంలో బెంగళూరుకు 194వ ర్యాంకు దక్కిందని తెలిపింది. తర్వాతి స్థానాల్లో చెన్నై(199), పుణె(206) నగరాలు నిలిచాయి. దేశ రాజధాని ఢిల్లీ ఈ విషయంలోనూ అట్టడుగు స్థానంలోనే ఉంది. దీనికి కోల్‌కతా జతకలిసింది. ఈ రెండు నగరాలు పరిశుభ్రత విషయంలో అత్యంత వెనకబడి కింది నుంచి ఐదు స్థానాల్లో ఉన్నాయని మెర్సర్ జాబితా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఢిల్లీకి 228వ స్థానం దక్కగా.. కోల్‌కతాకు 227వ స్థానం దక్కింది.

మెర్సర్ 20వ వార్షికోత్సవం

ప్రపంచ వ్యాప్తంగా వివిధ నగరాల్లో జీవన ప్రమాణాలు, అక్కడి పౌరులకు లభించే సౌకర్యాలు, పరిశుభ్రత తదితర ప్రమాణాల ఆధారంగా ఏటా తమ సంస్థ ఓ జాబితాను విడుదల చేస్తుందని మెర్సర్ కంపెనీ ఇండియా ప్రాక్టీస్ లీడర్ పద్మా రామనాథన్ వెల్లడించారు. ఈ జాబితా రూపకల్పనలో అనేక అంశాలను ప్రామాణికంగా తీసుకొని పరిశోధిస్తామని తెలిపారు. ఇరవై ఏళ్లుగా ఈ ర్యాంకులు విడుదల చేస్తుండగా.. భారత్‌లోని కొన్ని నగరాలు తమ ర్యాంకింగ్‌లను ఏటేటా మెరుగు పరుచుకుంటూ వస్తుండగా, మరికొన్ని మాత్రం మరింత కిందికి దిగజారుతున్నాయని ఆమె వివరించారు.



తెలంగాణకు మరో విజయం

(మొదటిపేజీ తరువాయి)

కృషిచేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎత్తిచూపిన ఒక సమస్యపై కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని కేంద్ర ఔషధ ప్రమాణ నియంత్రణ సంస్థ సత్వరం స్పందించింది. తదనుగుణంగా ఆ సమస్యను పరిష్కరిస్తూ బుధవారం ఒక నోటిఫికేషన్ జారీచేసింది. దీని ప్రకారం... డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం -నిబంధనల మేరకు చెల్లుబాటయ్యే లైసెన్సుగల ఔషధ ఉత్పత్తిదారు రవాణా బిల్లులు సమర్పిస్తే సరిపోతుంది. అందువల్ల ఏ దేశానికైనా ఎగుమతులకు సంబంధించి 'నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం' (ఎన్‌వోసీ) కోసం అధికారులు ఒత్తిడి చేయరాదు. అంతే కాకుండా దేశంలో కాస్మెటిక్స్, ఔషధ, వైద్య పరికరాల ఎగుమతుల నియంత్రణకు సంబంధించిన నిబంధనల అమలును క్రమబద్ధీకరిస్తున్నట్లు సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీనిపై మంత్రి కేటీఆర్ సంతృప్తి ప్రకటించారు. ఫార్మా, వ్యాక్సిన్ ఉత్పత్తులలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం నుంచి ఫార్మా, వైద్య పరికరాల ఎగుమతులలో గణనీయ వృద్ధికి తాజా ఆదేశాలు దోహదపడగలవని ఆయన హర్షం వ్యక్తం చేశారు. కాగా, ప్రస్తుత సమస్య మాత్రమేగాక బయో-ఏషియా సదస్సు సమయంలో కేంద్రానికి మరో 12 ప్రధాన సిఫారసులు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు.

ప్రేమజంట ఆత్మహత్య

5 రోజుల క్రితం ఇద్దరూ అదృశ్యం
ఆలస్యంగా మృతదేహాల గుర్తింపు
విశాఖపట్నం జిల్లాలో దారుణం

విశాఖపట్నం, మార్చి 21 (మనం న్యూస్ బ్యూరో): విశాఖపట్నం జిల్లాలో ఐదు రోజుల క్రితం అదృశ్యమైన ఓ ప్రేమజంట ఆత్మహత్య చేసుకుంది. గుడిలోవ అటవీప్రాంతంతో ఆనందపురం పోలీసులు వీరి మృతదేహాలను కనుగొన్నారు. రోలుగుంట మండలం కొవ్వూరు గ్రామానికి చెందిన యర్రంశెట్టి రమణాజీ (32), బంటు రేవతి(28)గా వీరిని గుర్తించారు. బంధువుల, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ఒకే గ్రామానికి చెందిన వీరిద్దరూ చాలా కాలంగా ప్రేమించుకున్నారు. కాగా వీరి పెళ్లికి రమణాజీకి తల్లితండ్రులు అంగీకరించలేదు. ఆయనకు మరో యువతితో వివాహం చేశారు. వివాహం తరువాత కూడా వీరి ప్రేమ కొనసాగింది. ఆనందపురం సమీపంలోని ఓ మందుల దుకాణంలో రేవతి పనిచేసేది. ఈ నెల 17వ తేదీన వీరిద్దరూ అదృశ్యమయ్యారు. 19వ తేదీన రమణాజీ బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుడిలోవకు వెళ్లే దారిలో బుధవారం వీరిద్దరి మృతదేహాలను పోలీసులు గుర్తించారు. నాలుగైదు రోజుల క్రితమే ఆత్మహత్యకుపాల్పడి ఉంటారని భావిస్తున్నారు. రేవతి మృతదేహం నేలపై పడివుండగా, రమణాజీ మృతదేహం చెట్టుకొమ్మకు వేలాడుతూ కనిపించింది. కలసి జీవించలేమన్న భావనతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

మోదీతో ఎంపీ గీత భేటీ

విశాఖపట్నం, మార్చి 21 (మనం న్యూస్ బ్యూరో): అరకు పార్లమెంటు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ఎంపీ కొత్తపల్లి గీత కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పార్లమెంటులో మోదీని ఆమె కలిశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఈ సందర్భంగా మోదీ చెప్పారని గీత వెల్లడించారు. అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు వస్తు న్నందున.. దేశంలో కూడా ప్రోత్సాహం కల్పించేందుకు అధికా రులను ఆదేశించాలని మోదీని కోరినట్లు తెలిపారు.

ప్రత్యేక హోదా.. ఆంధ్రుల హక్కు

హైకోర్టు న్యాయవాదుల నిరసన

హైదరాబాద్, మార్చి 21: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డి మాండ్ చేస్తూ హైకోర్టు న్యాయవాదులు నిరసన ప్రదర్శన చేపట్టారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో హైకోర్టు ప్రాంగణం 4వ గేటు వద్ద నిరసన తెలిపారు. న్యాయవాదులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ 'ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం పాదయాత్ర'లో పాల్గొన్నారు.

పార్లమెంటులో ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక హోదా ప్రకటించాలని, ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని డిమాండ్ చేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చల్లా ధనంజయ, ఉపాధ్యక్షుడు ఆనంద్ శేషు, కార్యదర్శి బాచిన హనుమంతరావు తదితరులు నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.

అప్పులు.. తప్పవు!

(మొదటిపేజీ తరువాయి)





21 శాతం మాత్రమేనని ప్రకటించారు. కేంద్ర రుణాల్లో ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం చేసిన అప్పులు రూ.25 లక్షల కోట్లని వివరించారు. ఈ అప్పులను దుబారాగా అభివర్ణించలేమని, కేంద్ర బడ్జెట్ లో మూడోవంతు ఈ రుణాలు తీర్చడానికే సరిపోతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం అప్పుల పాలవుతోందన్న ఆందోళన ఎవరికీ అవసరం లేదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌పై చర్చకు శాసనమండలిలో బుధవారం ఆయన సమాధానమిస్తూ... తెలంగాణ కచ్చితంగా ధనిక రాష్ట్రమేనని, ఆదాయ వృద్ధి 22 శాతంగా నమోదు కావడమే ఇందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. కేంద్రంలోనే కాకుండా రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలు అప్పులు చేయడం లేదా? అని ఆ పార్టీ నేతల విమర్శలపై ప్రతి విమర్శ చేశారు. అప్పుగా తెచ్చిన సొమ్మును దుబారా చేస్తే ప్రశ్నించాలిగానీ, అనవసర రాజకీయాల కోసం విమర్శించొద్దని హితవు పలికారు.

ఆ దేశాలు ప్రపంచాన్ని శాసిస్తున్నాయ్

అమెరికా, జపాన్ వంటి దేశాల రుణభారం వారి జీడీపీ కంటే ఎక్కువే అయినప్పటికీ వారు ప్రపపంచాన్ని శాసించడం లేదా? అని సీఎం ప్రశ్నించారు. ఆర్థిక వ్యవస్థ సరళీకరణలో కేంద్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 71 ఏండ్లు దాటుతున్నా పాలకులు నేటికీ కండ్లు తెరవడం లేదని ఎద్దేవా చేశారు. భారత్‌కన్నా తక్కువ వ్యవసాయ భూమిగల చైనా గణనీయ ప్రగతి సాధించిందని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల కిందట ఆ దేశం జీడీపీ భారత్‌తో పోలిస్తే అతి తక్కువని, నేడు మన జీడీపీ చైనాతో పోలిస్తే నాలుగో వంతు మాత్రమేనని వివరించారు. ఎక్కడో మారుమూలగల ప్రాథమిక పాఠశాలకు కేంద్రానికి సంబంధమేంటని ప్రశ్నించారు. విద్య, వైద్యం, గ్రామీణ, పట్టణాభివృద్ధి, వ్యవసాయ శాఖలను కేంద్రం అట్టిపెట్టుకోవాల్సిన అవసరమేంటని నిలదీశారు. వాటన్నింటినీ రాష్ట్రాలకే వదిలేయాని డిమాండ్ చేశారు. నీతి ఆయోగ్ తొలి సమావేశంలో ప్రధాని మోదీ సహకారాత్మక సమాఖ్య తత్వం పేరిట గొప్ప ప్రసంగం చేశారని పేర్కొన్నారు. అది విన్న తర్వాత దేశం ఎంతో బాగుపడగలదని ఆశించినా అదంతా అడియాసేనని స్పష్టమైందన్నారు.

నీతి ఆయోగ్ చెప్పినా నిధులిచ్చే పరిస్థితి లేదు

మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు రూ.24వేలు కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫారసు చేసినా కేంద్రం 24 రూపాయలు కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పురోగతి సాధించిందని, ఈ ఏడాది రాష్ట్ర ఆదాయంలో 22 శాతం పెరుగుదల కనిపిస్తుండటమే ఇందుకు రుజువని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలకు కేంద్రం నిధులివ్వకపోగా అప్పు తెచ్చుకునే వెసులుబాటు కూడా కల్పించడంలేదని మండిపడ్డారు. ఇలాగైతే రాష్ట్రం ముందడుగు వేయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దేశంలో ఏ భాగం అభివృద్ధి చెందినా, దేశం ముందడుగు వేసినట్లేనని వ్యాఖ్యానించారు. కనీసం ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవాలని కోరుతూ కేంద్రానికి వందలకొద్దీ ఉత్తరాలు రాసినా నిధులు విదిలించడం లేదని ఆరోపించారు. ఈ పరిస్థితి మారాలని, స్వతంత్ర దేశంలో 70 వేల టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నా.. 40 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమికి నీరివ్వలేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ ఏడు దశాబ్దాలుగా నదీజలాల కోసం రాష్ట్రాలు కొట్లాడుకుంటూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర పాలకులు ఇకనైనా బుద్ధి తెచ్చుకుని వ్యవహరించాలని సూచించారు.

బడ్జెట్‌పై చర్చ విశ్లేషణాత్మకంగా ఉండాలి

ప్రతిపక్ష సభ్యులు రాష్ట్ర బడ్జెట్‌పై విమర్శలు గుప్పించడం సరికాదని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. దీన్ని విశ్లేషణాత్మకంగా అవగాహన చేసుకుని మాట్లాడగల పరిణతి సాధించాలని విపక్ష ఎమ్మెల్యేలకు, నేతలకు సలహా ఇచ్చారు. అంతేగానీ... ఆనవాయితీగా 'బడ్జెట్ చప్పగా ఉంది.. ఇదో అంకెల గారడీ' అనడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తూ పోతున్నదని, దీనివల్ల ప్రజల నెత్తిన రుణభారం పడుతుందని విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004-14 మధ్య 23 జిల్లాలకు చేసిన ఖర్చు రూ.1.29 లక్షల కోట్లు మాత్రమేనని గుర్తుచేశారు. కానీ, గడచిన నాలుగేళ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.24 లక్షల కోట్లు వ్యయం చేసిందని వివరించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి సంబంధించి ఈ ఏడాది ఏ రాష్ట్రానికీ రానన్ని అవార్డులు తెలంగాణకు వచ్చాయన్నారు. నిధులున్న రాష్ట్రాలే ప్రగతి సాధించగలవని, అదే సమయంలో వేగంగా నిర్ణయాలు తీసుకుంటేనే ముందుకెళ్లడం సాధ్యమని స్పష్టం చేశారు.




దొంగే.. దొంగ అన్నట్లుగా ఉంది!

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారు. ''దొంగే.. దొంగ అన్నట్లుగా ఉంది'' అని ఎద్దేవా చేశారు. వివిధ డిమాండ్లు నెరవేర్చాలని, సమస్యలు పరిష్కరించాలని ఉభయ సభల్లో గత 13 రోజులుగా టీఆర్ఎస్, ఏఐఏడీఎంకే తదితర పార్టీలకు చెందిన ఎంపీలు ఆందోళనలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దాంతో ఎలాంటి కార్యక్రమాలు జరగకుండానే ఉభయ సభలు వాయిదా పడుతున్నాయి. ఈ నేపథ్యంలో..బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు ఓ లేఖ రాశారు. అందులో సభ నిర్వహణకు అంతరాయం కల్పిస్తున్న ఎంపీల వేతనాల్లో కోత విధించాలని విజ్ఞప్తి చేశారు. ''ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించి బా. ధ్యతగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులే ఆ బాధ్యతల నుంచి తప్పించుకోవడం చాలా బాధగా ఉంది. కాబట్టి సభలను సజావుగా సాగనీయకుండా అడ్డుకొనే ఎంపీల జీతాల్లో కోతలు విధించాలని నేను కోరుతున్నా. 'నో వర్క్... నో పే (పని చేయని వారికి జీతం ఇవ్వొద్దు)' విధానాన్ని అందరమూ నిజాయితీగా అమలు చేద్దాం'' అని స్పీకర్‌కు మనోజ్ తివారీ లేఖ రాశారు. అయితే, దానికి కవిత వెంటనే కౌంటర్ ఇచ్చారు. ''ఇది మరీ బాగుంది. దొంగే దొంగ..దొంగ అని అరిచినట్టుంది వ్యవహారం. ప్రభుత్వం సమయానుసారంగా సమస్యలపై స్పందిస్తే ఏ పార్టీ, ఏ ఎంపీ కూడా ఇలా సభలో ఆందోళనలు నిర్వహించాలని అనుకోదు కదా'' అని ఆమె ట్విట్టర్ ద్వారా తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

శంకర్ దాదాలు!

(మొదటిపేజీ తరువాయి)



డాక్టర్ల అవతారం ఎత్తేస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌లో చిన్న తీగ లాగితే ఇలా డొంకంతా బయట పడింది. ఇప్పటివరకు దాదాపు 600 మంది ఇలాగే పొట్ట కోస్తే అక్షరం ముక్క రాకపోయినా తెల్లకోటు వేసుకుని, మెడలో స్టెతస్కోప్ తగిలిం చుకుని డాక్టర్లుగా చలామణీ అయిపోతున్నట్లు తెలిసింది. మరో వ్యాపం తరహా స్కాం ఆ రాష్ట్రంలోనూ వెలుగు చూసింది. ముజఫర్‌నగర్ మెడికల్ కాలేజీకి చెందిన ఇద్దరు వైద్య విద్యా ర్థులు తమ జవాబు పత్రాల స్థానంలో వేరే నిపు ణులు రాసినవి ఉంచినందుకు లక్ష రూపాయల చొప్పున మాఫియాకు అందిస్తూ దొరికిపోయారు. యూపీలోనే అగ్రశ్రేణి యూనివర్సిటీలలో ఒకటైన మీరట్‌లోని చౌదరి చరణ్‌సింగ్ యూనివర్సిటీకి చెందిన ఆరుగురు ఉద్యోగు లుసహా తొమ్మిది మంది ఈ గ్యాంగ్‌లో సభ్యు లని విచారణలో తేలింది. వీళ్లంతా కలిసి పెద్ద మొత్తంలో వైద్య విద్యార్థుల చేత ఇలాంటి మోసాలు చేయిస్తున్నారు. 2014 నుంచి నిర్విఘ్నంగా కొనసాగుతున్న ఈ రాకెట్.. ఇప్పటివరకు 600 మంది శంకర్ దాదాలకు ఎంబీబీఎస్ పట్టాలు దిగ్విజయంగా ఇప్పించింది. వాళ్లంతా ఇప్పుడు రాష్ట్రంలోనేగాక దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో డాక్టర్లుగా చలామణీ అవుతున్నారు. యూపీ పోలీసు విభాగంలోని ఎస్టీఎఫ్ బృందం ఈ గ్యాంగ్ గుట్టును రట్టుచేసింది. మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతున్న ఓ యువతి తాజాగా అరెస్టయిన ఇద్దరు విద్యార్థులకు ఈ గ్యాంగును పరిచయం చేసింది. ఆమెను ఇంకా అరెస్టు చేయాల్సి ఉంది. యూనివర్సిటీ సిబ్బందితో కుమ్మక్కైన గ్యాంగ్ సభ్యులు.. ముందుగానే కొంతమంది నిపుణులతో సమాధా నాలు రాయించి, విద్యార్థులు రాసిన జవాబు పత్రాల స్థానంలో వాటిని ఉంచుతున్నారు. ఇందుకోసం మెడికల్ విద్యార్థుల నుంచి రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు, ఇతర కోర్సుల వాళ్లవద్ద రూ.30-40 వేలవరకు వసూలు చేస్తున్నారు.

అరెస్టయిన ఇద్దరు విద్యార్థులలో ఒకరు ఆయుష్‌కుమార్ (21). ఇతడు గుర్‌గావ్‌లో అగ్రశ్రేణి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యుడి కొడుకు. హరియాణాలోని పానిపట్ వాళ్ల స్వస్థలం. రెండో విద్యార్థి స్వర్ణజీత్ సింగ్ పంజాబ్‌లోని సంగ్రూర్‌కు చెందినవాడు. ఇద్దరూ ముజఫర్‌నగర్ మెడికల్ కాలేజిలో రెండో సంవత్సరం ఎంబీబీఎస్ చేస్తున్నారు. పోలీసులకు అందిన సమాచారం ప్రకారం వీళ్ల గదులపై దాడి చేసి.. ఒరిజినల్ జవాబు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మార్చి 15న జరిగిన సెమిస్టర్ పరీక్షలలో తాము సరిగా రాయలేక పోవడంతో సహ విద్యార్థినిని కలిశారని, ఆమె వాళ్లకు ఇలా జవాబు పత్రాలు మార్పించే సలహా ఇచ్చిందని ఎస్టీఎఫ్ మీరట్ విభాగం ఇన్‌చార్జి బ్రిజేష్ సింగ్ తెలిపారు. ఆ తర్వాత అమ్మాయి తండ్రి స్వయంగా ఆ ఇద్దరు విద్యార్థులకు గ్యాంగ్‌తో డీల్ కుదిర్చారన్నారు. 2017లో జరిగిన సెమిస్టర్ పరీక్షలకు సంబంధిం చిన జవాబు పత్రాలన్నింటినీ ఎస్టీఎఫ్ దళం స్వాధీనం చేసుకుంది. పాత సంవత్స రాలకు సంబంధించిన జవాబు పత్రాలు కూడా స్వాధీనం చేసుకుని, వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తే మరిన్ని పేర్లు బయటకు రావడం ఖాయమని బ్రిజేష్ సింగ్ అభిప్రాయపడ్డారు. గ్యాంగ్ లీడర్ కవిరాజ్ సింగ్‌తో పాటు మరో ఐదుగురు యూనివర్సిటీ ఉద్యోగులను ఈ కేసులో ఇప్పటి వరకు గుర్తించారు. వారిలో శాశ్వత ఉద్యోగి పవన్ కుమార్, కాంట్రాక్టు ఉద్యోగులు కపిల్ కుమార్, సందీప్‌లను అరెస్టు చేశారు. మరో ఉద్యోగి సలేక్ చంద్ర, మాజీ ఉద్యోగి సీపీ సింగ్ పరారీలో ఉన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై క్షుణ్ణంగా దర్యాప్తు చేపట్టేందుకు వీలుగా సిట్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్టీఎఫ్ కోరింది.

హెచ్1-బి మళ్లీ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ప్రకటించింది. దాంతోపాటు ఇప్పటివరకు కొనసాగిన హెచ్1-బి పిటిషన్ల ప్రీమియం ప్రాసెసింగ్‌ను ఆపేస్తున్నట్లు కడా ప్రకటించారు. సాంకేతిక నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగులను అమెరికా కంపెనీలలో పనిచేయడానికి వీలు కల్పిస్తూ ఇచ్చేదే హెచ్1-బి వీసా. ఇటీవలి కాలంలో దీనిపై అనేక వివాదాలు తలెత్తాయి. భారతదేశం సహా, పలు ఇతర దేశాలకు చెందిన నిపుణులను రప్పించుకోడానికి బదులు అమెరికన్లకే ఆ ఉద్యోగాలు ఇవ్వాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తదితరులు వాదించారు. అయితే, అమెరికన్లలో అంత నైపుణ్యం గలవారు లేకపోవడం వల్లనే తక్కువ జీతాలకు వచ్చే ఇతర దేశాల వారిని తీసుకుంటున్నట్లు అమెరికన్ కంపెనీలు స్పష్టం చేయడంతో మళ్లీ అవకాశం లభించింది. ప్రతి సంవత్సరం భారత్, చైనా లాంటి దేశాల నుంచి కొన్ని వేల మంది ఐటీ నిపుణులను అమెరికా కంపెనీలు తీసుకుంటాయి. 2019 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇలా తీసుకునేవారికి జారీచేసే హెచ్1-బి విసాల పిటిషన్ ఫైలింగ్ 2018 అక్టోబరు 1 నుంచి మొదలవుతుంది. 2018 సెప్టెంబరు పదో తేదీతో ప్రీమియం ప్రాసెసింగ్ ఆపేస్తారు. ప్రీమియం ప్రాసెసింగ్ అంటే ఒక రకంగా తత్కాల్ లాంటిది. అదనపు ఫీజుతో దరఖాస్తులను మరింత ముందుగా పరిశీలించే విధానమే ప్రీమియం ప్రాసెసింగ్. మళ్లీ ప్రీమియం ప్రాసెసింగ్ ఎప్పుడు ప్రారంభించేదీ మరోసారి ప్రకటిస్తామని యూఎస్‌సీఐఎస్ తెలిపింది. ప్రీమియం ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా ఆపేయడం వల్ల హెచ్1-బి వీసాల సాధారణ ప్రాసెసింగ్‌కు పట్టే సమయం కొంత తగ్గుతుందని యూఎస్‌సీఐఎస్ అధికారులు తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న పిటిషన్లను కూడా ఇప్పుడు ప్రీమియం ప్రాసెసింగ్ ఒత్తిడి వల్ల చూడలేకపోతున్నామని.. వాటిని కొన్నాళ్ల పాటు ఆపితే వీటిని చూసుకోవచ్చని చెబుతున్నారు. హెచ్1-బి నాన్ ఇమ్మిగ్రెంట్ కోటాలో వెళ్లేవాళ్లు గరిష్ఠంగా మూడేళ్ల పాటు అమెరికాలో ఉండగలరు. దాన్ని మరోసారి కూడా పొడిగించే అవకాశం ఉంది. అయితే ఆరేళ్లకు మించి మాత్రం ఉంచబోరు. ప్రతి ఆర్థిక సంవత్సరానికి 65వేల వీసాలు మాత్రమే ఇవ్వాలని అమెరికన్ కాంగ్రెస్ చెబుతోంది. వాటిలో మొదటి 20వేల దరఖాస్తులలో అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ ఉన్నవారికి కోటా నుంచి మినహాయింపు ఉంటుంది. 2007 నుంచి 2017 వరకు 22 లక్షల హెచ్1-బి దరఖాస్తులు కేవలం భారతీయుల నుంచే అమెరికాకు అందాయి. ఆ తర్వాతి స్థానంలో చైనా ఉంది. అదే పదేళ్లలో చైనా నుంచి 3 లక్షల దరఖాస్తులు అమెరికాకు వెళ్లాయి.



న్యూఈయర్ వేడుకల్లో ఆత్మాహుతి దాడి

- కాబూల్‌లో 26 మంది మృతి

కాబూల్, మార్చి 21: ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో బుధవారం జరిగిన పర్షియన్ న్యూఈయర్ వేడుకల్లో ఆత్మా హుతి దాడి జరిగింది. ఈ ఘటనలో 26 మంది మరణించారు. 18 మంది గాయ పడ్డారు. పర్షియన్ న్యూ ఈయర్‌ను ఆఫ్ఘనిస్థాన్‌లో నౌరుజ్‌గా పిలుస్తా రు. ఆ రోజును దేశవ్యాప్తంగా సెలవుదినం పాటిస్తారు. వేడుకల్లో భాగంగా షియాలు మసీదులను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. కాబూల్‌లోని ఓ మసీదు వద్ద ప్రార్థనలు జరుగుతుండగా ఓ వ్యక్తి తనని తాను పేల్చుకోని విధ్వంసం సృష్టించాడు. ఈ దాడి తమ పనేనంటూ ఇప్పటివరకు ఎవ్వరూ ప్రకటన చేయలేదు.



మనీలాలో ఘోర రోడ్డు ప్రమాదం

- 19 మంది మృతి, 21మందికి గాయాలు

మనీలా, మార్చి 21: పిలిప్పిన్స్ రాజధాని మనీలా సమీపంలోని సాబ్లయాన్ వద్ద మంగళవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళుతున్న ఓ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి కొండపై నుంచి లోయలోకి పడింది. ఈ ఘటనలో 19 మంది మరణించగా, 21 మంది గాయపడ్డారు. బస్సు మనీలా వెళుతుండగా మిండోరా ద్వీపం వద్ద వంతెన రెయిలింగ్‌ను ఢీకొని బస్సు లోయలోకి పడింది. మృతుల్లో బస్సు డ్రైవర్ కూడా ఉన్నాడు. క్షతగాత్రులను రక్షించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడని, అందుకే ప్రమాదం సంభవించిందని క్షతగాత్రులు చెబుతున్నారు.

రాజా, కనిమొళిలకు హైకోర్టు నోటీసులు

- 2జీ కేసుపై ఢిల్లీ హైకోర్టులో సీబీఐ, ఈడీ అప్పీలు

న్యూఢిల్లీ, మార్చి 21: టెలికంశాఖ మాజీ మంత్రి ఏ రాజా, డీఎంకే ఎంపీ కనిమొళితోపాటు 2జీ కుంభకోణంలో ఇతరులకు ఢిల్లీ హైకోర్టు బుధవారం నోటీసులు జారీచేసింది. 2జీ స్కాం కేసులో సాక్ష్యాధారాలు లేవంటూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ విడుదల చేసిన విషయం తెలిసిందే! అయితే, ఈ తీర్పును సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)తోపాటు సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాయి. ఈ అప్పీలును స్వీకరించిన హైకోర్టు రాజా, కనిమొళితో సహా ఆరోపణలు ఎదుర్కొన్న మిగతావారికీ నోటీసులు జారీచేసింది. దీనిపై మే 25లోగా తమ స్పందనను ఫైల్ చేయాల్సిందిగా సూచించింది. సీబీఐ అభ్యర్థనపై విచారణ ప్రారంభించిన హైకోర్టు.. ఇప్పటివరకు నిందితులకు సంబంధించి ఈడీ, పీఎంఎల్‌ఏ అటాచ్ చేసిన ఆస్తులు రూ.223 కోట్ల విషయంలో యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశాలు జారీచేసింది. గత ఏడాది డిసెంబర్ 21న 2జీ కేసులో కనిమొళి, రాజాలకు వ్యతిరేకంగా సరైన ఆధారాలు లేవని పేర్కొంటూ.. వారిని నిర్దోషులుగా సీబీఐ ప్రకటించింది.


కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు పోలీసులు.. ఇద్దరు సైనికుల మృతి
- ఉగ్రవాదులతో ఇంకా కొనసాగుతున్న పోరు

జమ్ము, మార్చి 21: జమ్ముకశ్మీర్‌లోని కుప్వాడా జిల్లా పరిధిలో ఉగ్రవాదులతో కొనసాగుతున్న ఎన్‌కౌంటర్‌లో బుధవారం ఇద్దరు రాష్ట్ర పోలీసులు, ఇద్దరు సైనిక సిబ్బంది అమరులయ్యారు. మరో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. అయితే, సైనిక సిబ్బందిలో మరణించింది ఒక్కరు మాత్రమేనని రాష్ట్ర డీజీపీ ఎస్.పి.వైద్ తెలిపారు. అంతకుముందు ఇదే జిల్లాలోని అటవీ ప్రాంతంలో మంగళవారం రాత్రి నలుగురు గుర్తుతెలియని ఉగ్రవాదులు సైనికుల చేతిలో హతమయ్యారు. సైనికులతోపాటు రాష్ట్ర పోలీసు బలగంలోని ప్రత్యేక కార్యకలాపాల బృందం (ఎస్‌వోజీ)తో కూడిన సంయుక్త దళంపై ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఈ ఎన్‌కౌంటర్ ప్రారంభమైనట్లు రక్షణ శాఖ అధికార ప్రతినిధి కల్నర్ రాజేష్ కైలా తెలిపారు.

రాజ్‌బబ్బర్ గుడ్‌బై!

- యూపీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా



లఖ్‌నవ్, మార్చి 21: సీనియర్లు పక్కకు తప్పుకొని యువతకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పిలుపునివ్వడంతో క్రమంగా ఒక్కొక్కరుగా రాష్ట్ర పార్టీ అధ్యక్షులు తప్పుకొంటున్నారు. గోవా పీసీసీ చీఫ్ శాంతారామ్ నాయక్ తన పదవికి రాజీనామా చేసిన తర్వాత ఆయన బాటలోనే ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్, ప్రముఖ నటుడు రాజ్‌బబ్బర్ కూడా పదవిని వదులుకున్నారు. త్వరలోనే గుజరాత్ కాంగ్రెస్ అధినేత భరత్‌సింగ్ సోలంకి కూడా అదే బాటలో నడవచ్చని భావిస్తున్నారు. వయసు మీదపడిన నాయకులు నెమ్మదిగా పక్కకు తప్పుకొంటే మంచిదని రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ప్రస్తావించిన విషయం తెలిసిందే. అయితే.. అత్యంత కీలకమైన రాజ్యసభ ఎన్నికల పోలింగ్ జరగడానికి సరిగ్గా మూడు రోజుల ముందు రాజ్‌బబ్బర్ దిగిపోవడం మాత్రం కొంత చర్చనీయాంశమైంది. ఆయన రాజీనామాను ఇంకా ఆమోదించాల్సి ఉందని కాంగ్రెస్ వర్గాల సమాచారం. కొత్త అధ్యక్షుడు వచ్చేవరకు ఆయనను పదవిలో కొనసాగాల్సిందిగా కోరే అవకాశం కనిపిస్తోంది. యాదవ, ఓబీసీ, జాట్, దళితేతర ఓటు బ్యాంకును కేంద్రీకృతం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో బ్రాహ్మణ నాయకుడిని ఈ పదవిలోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తనకు ఏ బాధ్యత అప్పగించినా దాన్ని నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉంటానని యూపీసీసీ చీఫ్ పదవికి రాజీనామా చేసిన రాజ్‌బబ్బర్ తెలిపారు. 2019 ఎన్నికల దిశగా పార్టీ అధ్యక్షుడు ఏ కొత్త పని అప్పగించినా చేస్తానన్నారు. ప్రస్తుతానికి రాజ్‌బబ్బర్ రాజీనామాను ఇంకా రాహుల్ గాంధీ ఆమోదించకపోవడంతో ఆయన యూపీసీసీ చీఫ్‌గా కొనసాగుతారు. గుజరాత్ తరహాలోనే యూపీలో కూడా ఒక అధ్యక్షుడు, నలుగురు పాధ్యక్షులు ఉండే అవకాశం ఉందని, నలుగురికీ ఒక్కో జోన్‌కు సంబంధించిన బాధ్యత అప్పగించొచ్చని కాంగ్రెస్ వర్గాల సమాచారం.

బీజేపీ- కాంగ్రెస్ సోషల్‌వార్!

ఫేస్‌బుక్ వ్యవహారంపై భారత్‌లో ప్రకంపనలు.. కేంబ్రిడ్జి ఎనలిటికాతో బంధాలపై ఆరోపణలు

- ఏ పార్టీకి సంబంధాలున్నాయో విచారించండి
- ఈసీకి కాంగ్రెస్ నేత మనీష్ తివారీ విజ్ఞప్తి
- కాంగ్రెస్‌కే సంబంధముంది: రవిశంకర్ ప్రసాద్
- కేంద్రమంత్రి ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్






న్యూఢిల్లీ, మార్చి 21: ఫేస్‌బుక్ ఖాతాదార్ల సమాచారాన్ని చోరీచేసిన కేంబ్రిడ్జి ఎనలిటికా (సీఏ) కంపెనీ వ్యవహారం భారత్‌లోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆ 'చోరీ' సంస్థతో సంబంధాలపై కాంగ్రెస్ పార్టీ-బీజేపీ పరస్పర బురద జల్లుడు కార్యక్రమం మొదలుపెట్టాయి. కేంబ్రిడ్జి ఎనలిటికాతో ఏ పార్టీకి సంబంధాలున్నాయో విచారణ చేయించాలని ఎన్నికల కమిషన్‌ను కాంగ్రెస్‌నేత మనీష్ తివారీ కోరిన కొన్ని గంటల్లోనే.. కాంగ్రెస్ పార్టీకే దాంతో సంబంధాలున్నాయంటూ కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సమాచార చౌర్యానికి పాల్పడి ఎన్నికల్లో గెలిచే ప్రయత్నం చేసిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ, దాని అధ్యక్షుడు రాహుల్ గాంధీకి సంబంధించిన సోషల్ మీడియా నిర్వహణలో 'సీఏ' పాత్ర ఏంటని ఆయన ప్రశ్నించారు. భారతీయ పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని 'సీఏ'కు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. సమాచార చౌర్యం ద్వారా ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందా అని ప్రశ్నించారు. ఒక తప్పుడు సమాచార విశ్లేషణ సంస్థతో కాంగ్రెస్ పార్టీకి ఉన్న అనుబంధం గురించి మాత్రమే తాము ప్రశ్నించడం లేదని, మన దేశంలో ప్రజాస్వామ్య విలువలు, స్వేచ్ఛయుత ఎన్నికలు కూడా ప్రశ్నార్థకంగా మారడంపైనే అడుగుతున్నామని ఆయన అన్నారు. మంత్రి వ్యాఖ్యలను కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం అధినేత్రి దివ్యస్పందన ఖండించారు. కేంబ్రిడ్జి ఎనలిటికాతో కాంగ్రెస్‌కు సంబంధాలున్నాయంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆమె ట్వీట్ చేశారు. ఇరాక్‌లో 39 మంది భారతీయులను ఐసిస్ హతమార్చిన ఘటనపై ప్రజాగ్రహాన్ని మళ్లించేందుకు బీజేపీ ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందని ఆమె విమర్శించారు. తొలుత ఆ సమాచారాన్ని దాచిపెట్టి, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు.

భారత్ జోలికొస్తే సహించం

ఫేస్‌బుక్ భారతీయుల డేటా చోరీకి పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. బీజేపీ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుందన్నారు. భారత ఐటీ చట్టాలు బలంగా ఉన్నాయని, ఒకవేళ డేటా చోరీ జరిగినట్లు తెలిస్తే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని మంత్రి రవిశంకర్ జుకర్‌బర్గ్‌ను హెచ్చరించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కేంద్రమంత్రి.. రాహుల్ గాంధీ సోషల్ మీడియా ప్రొఫైల్‌లో కేంబ్రిడ్జి అనలిటికాతో ఎందుకు సంబంధాలు ఉన్నాయని ప్రశ్నించారు. ఓటర్లను ఆకర్షించేందుకు కేంబ్రిడ్జి అనలిటికా భారతీయుల డేటాను చోరీ చేస్తే మాత్రం ఊరుకునేది లేదన్నారు.

కేంబ్రిడ్జి అనలిటికా సీఈవో సస్పెన్షన్



ఫేస్‌బుక్ ఖాతాదారుల డేటా చౌర్యానికి పాల్పడిన కేంబ్రిడ్జి అనలిటికా కంపెనీ సీఈవో అలెగ్జాండర్ నిక్స్‌ను సస్పెండ్ చేస్తూ ఆ సంస్థ నిర్ణయం తీసుకుంది. రాజకీయ నాయకులపై రహస్యంగా ట్రాప్ చేసి.. వారిపై నివేదికలు తయారు చేయడంతో పాటు నింధనలకు విరుద్ధంగా షాడో కంపెనీలను నిర్వహిస్తున్నారని ఆయనపై కంపెనీ బోర్డు ఆరోపించింది. వీటిపై ఆయన విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని వెల్లడించింది.

ఫేస్‌బుక్‌ను డిలీట్ చేయండి!

- వాట్సాప్ సహ వ్యవస్థాపకుడి పిలుపు
- డేటా లీకేజి నేపథ్యంలో ఫేస్‌బుక్‌పై బాంబు

ఫేస్‌బుక్‌ను డిలీట్ చేయాలని, అందుకు ఇప్పటికే సమయం ఆసన్నమైందంటూ వాట్సాప్ సహ వ్యవస్థాపకుడు బ్రియాన్ ఆక్టన్ అందరికీ పిలుపునిచ్చారు. ఈ మేరకు తన ట్విటర్ ఖాతాలో ఆయన పోస్ట్ చేశారు. కేంబ్రిడ్జిలోని రాజకీయ డేటా విశ్లేషణ కంపెనీ ఒకటి దాదాపు 5 కోట్ల మంది ఫేస్‌బుక్ యూజర్ల సమాచారాన్ని వాళ్ల అనుమతి లేకుండానే సంపాదించిన విషయం తెలిసి అసలే ఫేస్‌బుక్ షేర్లు ఢమాల్‌మని పడిపోయిన తరుణంలో ఆక్టన్ నుంచి ఇలాంటి పిలుపు రావడంతో మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్లయింది. 2014లో ఫేస్‌బుక్ సంస్థ వాట్సాప్‌ను 1900 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కూడా ఫేస్‌బుక్‌తోనే ఆక్టన్ కొంతకాలం పాటు కొనసాగారు గానీ, ఈ సంవత్సరం ఆరంభంలో దానికి రాజీనామా చేసి సిగ్నల్ ఫౌండేషన్ అనే మరో కంపెనీ ప్రారంభించారు.

జుకర్‌బర్గ్ ఉక్కిరిబిక్కిరి



యూజర్ల డేటా చౌర్యం వ్యవహారంపై వరుస విచారణలతో ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. ఇప్పటికే సోమవారం బ్రిటిష్ పార్లమెంటరీ కమిటీ ఆయనను ప్రశ్నించగా.. తాజాగా 28 ఈయూ దేశాలు ఈ వ్యవహారంలో సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆదేశించాయి. మరోవైపు గూగుల్, ట్విటర్ సీఈవోలతో కలిసి అమెరికా కాంగ్రెస్ ముందు హాజరు కావాల్సిందిగా జుకర్‌బర్గ్‌ను ఆ దేశ చట్టసభ్యులు కూడా ఆదేశించారు. కాగా, యూజర్ల డేటా చౌర్యం ఆరోపణలతో వరుసగా రెండో రోజూ ఫేస్‌బుక్ షేర్లు పతనమయ్యాయి. వాల్‌స్ట్రీట్‌లో ఫేస్‌బుక్ కంపెనీ పరుగు ఢమాల్‌న పడిపోయింది. మంగళవారం 5.8 శాతం వరకు షేర్లు కిందికి పడిపోయాయి. సోమవారం ఫేస్‌బుక్ షేర్లు 7 శాతం తగ్గిన విషయం తెలిసిందే.

డేటా లీకేజీపై ఆడిట్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అధ్యక్ష ఎన్నికల సమయంలో కన్సల్టెంటుగా వ్యవహరించిన బ్రిటిష్ సంస్థ కేంబ్రిడ్జి అనెలిటికా.. ఫేస్‌బుక్ యూజర్ల సమాచారం సంపాదించి 2016లో ఎన్నికలను ప్రభావితం చేసిందని ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. ఈ సమాచార లీకేజి విషయంపై విచారణ కోసం తాము ఒక డిజిటల్ ఫోరెన్సిక్ సంస్థను హైర్ చేసినట్లు ఫేస్‌బుక్ రెండు రోజుల క్రితం ప్రకటించింది. ఆ సంస్థ కేంబ్రిడ్జి ఎనలిటికాపై సమగ్ర ఆడిటింగ్ చేస్తుందని ఫేస్‌బుక్ తెలిపింది. ఆ మేరకు తన సెర్వర్లు, సిస్టంల యాక్సెస్ ఇవ్వడానికి కేంబ్రిడ్జి ఎనలిటికా కూడా అంగీకరించింది. యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జికి చెందిన సైకాలజిస్టు, యాప్ రూపకర్త అలెగ్జాండర్ కోగన్ కూడా సహకరించేందుకు ఒప్పుకొన్నట్లు ఫేస్‌బుక్ తెలిపింది. మీడియాకు ఈ డేటా లీకేజి గురించి చెప్పిన కెనడా డేటా ఎనలిటిక్స్ నిపుణుడు క్రిస్టోఫర్ వైలీ మాత్రం ఈ ఆడిట్‌లో సహకరించేందుకు నిరాకరించారు.

నన్ను బలిపశువును చేస్తున్నారు



- డేటా చౌర్యంలో నా ప్రమేయం లేదు: కోగన్

తయారు చేసిన కేంబ్రిడ్జి అనలిటికా కోసం యాప్ సైకాలజిస్టు డాక్టర్ అలెగ్జాండర్ కోగన్ ఫేస్‌బుక్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. డేటా చోరీ వివాదంలో తనను అన్యాయంగా ఆ సంస్థ ఇరికిస్తోందని ఆరోపించాడు. సోషల్ మీడియా ద్వారా మనుషుల ప్రవర్తనను చిత్రించేందుకు ఈ ప్రత్యేకమైన యాప్‌ను 2014లో కోగన్ రూపొందించాడు. కానీ కేంబ్రిడ్జి అనలిటికా ఆ యాప్‌ను ట్రంప్ ఎన్నికల ప్రచారం కోసం వాడింది. సుమారు 5 కోట్ల మంది యూజర్ల డేటాను ఆ సంస్థ అక్రమంగా వాడుకుంది. ఫేస్‌బుక్ ఆ యాప్‌ను ట్రంప్ ప్రచారం కోసం దుర్వినియోగం చేస్తుందని తాను ఊహించలేదని కోగన్ మండిపడుతున్నాడు. డేటా చౌర్యం వ్యవహారంలో తన ప్రమేయం లేదని, ఫేస్‌బుక్ కావాలనే తనను బలిపశువును చేస్తోందని ఆరోపించారు. మరోవైపు ప్రొఫెసర్ కోగన్‌పై ఫేస్‌బుక్ సీరియస్ అయ్యింది. కోగన్ సైట్ విధానాలను ఉల్లంఘించాడని ఆరోపిస్తోంది. పర్సనాల్టీ సర్వే కోసమని చెప్పి డేటాను అక్రమంగా వాడుకున్నట్లు నిందిస్తోంది.

పోయాం.. మోసం



- 14 బ్యాంకులలో రూ.వెయ్యి కోట్లు హాంఫట్
- బ్యాంకింగ్ రంగానికి 'కనిష్క్ గోల్డ్' సున్నం
- మారిషస్‌లో ప్రమోటర్.. డైరెక్టర్ దంపతులు!
- నీరవ్.. మాల్యా.. లలిత్‌ల తరహాలో పరార్
- 215 కోట్ల మోసంపై సీబీఐకి ఎస్‌బీఐ ఫిర్యాదు
- ఆ తర్వాత అదే బాటలో 13 యాజమాన్యాలు







చెన్నై, మార్చి 21: దేశంలో పలువురు ప్రబుద్ధులు బ్యాంకులను ముంచిన కథలు ఒక్కొటొక్కటిగా బయటపడుతున్నాయి. తాజాగా స్వర్ణాభరణాల శృంఖల సంస్థ 'కనిష్క్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్' ఎస్‌బీఐ నేతృత్వంలోని 14 ప్రభుత్వ, ప్రైవేటురంగ బ్యాంకుల సమూహానికి సున్నం పూసింది. సదరు సంస్థ యజమానులు కూడా నీరవ్, విజయ్‌మాల్యా, లలిత్‌మోదీల తరహాలో విదేశాలకు చెక్కేశారు. మొత్తంమీద రూ.824.15 కోట్ల రుణం, వాటిపై వడ్డీసహా వెయ్యి కోట్లకు నామంపెట్టిన ఈ సంస్థ తెల్లారేసరికి దుకాణం మూసేసింది. నీరవ్ మోదీ రూ.12వేల కోట్లకు పీఎన్‌బీకి కుచ్చుటోపీ పెట్టి పారిపోయాకగానీ బ్యాంకు యాజమాన్యం మేల్కొనలేదు. అదే తరహాలో కనిష్క్ మోసం గురించి 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఎస్‌బీఐ)కు అర్థమయ్యేసరికే దాని యజమానులు పరారయ్యారు. ఈ నేపథ్యంలో తాము రూ.215 కోట్ల మేర మునిగినట్లు ఎస్‌బీఐ నిరుడు నవంబరు 11న రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ)కు నివేదించింది. ఆ తర్వాత 2018 జనవరి నాటికి మిగిలిన 13 బ్యాంకులు లబోదిబోమంటూ ఆర్బీఐ శరణుజొచ్చాయి. అటుపైన తొలుత ఎస్‌బీఐ చొరవ తీసుకుని సీబీఐకి ఫిర్యాదు చేయడంతో మిగిలిన బ్యాంకులూ దాన్ని అనుసరించాయి. కనిష్క్ సంస్థ ప్రధాన కార్యాలయం తమిళనాడు రాజధాని చెన్నై నగరంలోని టి.నగర్‌లో ఉంది. భూపేష్‌కుమార్ జైన్, అతని భార్య నీతా జైన్ ఈ సంస్థకు ప్రమోటర్లు, డైరెక్టర్లుగా ఉన్నారు. అయితే, వెయ్యికోట్లకు టోకరా వేసిన ఈ దంపతులతో మాట్లాడేందుకు యత్నించినా వారు అందుబాటులో లేరని బ్యాంకులు వాపోతున్నాయి. కాగా, వీరు ప్రస్తుతం పర్యాటక స్వర్గం మారిషస్‌లో మజా చేస్తున్నారని సమాచారం. ఈ ఉదంతంపై 2018 జనవరిలో ఎస్‌బీఐ యాజమాన్యం సీబీఐకి ఫిర్యాదు చేసినా ఇంకా ఎఫ్ఐఆర్ సిద్ధం కాలేదు. కనిష్క్ సంస్థ రాత్రికిరాత్రే రికార్డులను తారుమారు చేసి, తెల్లారేసరికి బిచాణా ఎత్తేసిందని మొరపెట్టుకుంది. తమ నేతృత్వంలోని 14 బ్యాంకుల కన్సార్టియం నుంచి కనిష్క్ సంస్థ రూ.824.15 కోట్లదాకా రుణాలు తీసుకున్నట్లు తెలిపింది. వడ్డీతో కలిపి ఈ బకాయిలు రూ.వెయ్యి కోట్లు దాటినట్లు పేర్కొంది. తొలుత 2017 మార్చిలో 8 సభ్య బ్యాంకులకు ఈ సంస్థ వడ్డీ ఎగ్గొట్టినట్లు వెల్లడించింది. ఏప్రిల్ నాటికి మొత్తం 14 బ్యాంకులకూ బకాయి చెల్లింపులు నిలిపివేసిందని పేర్కొంది. దీంతో 2017 మే 25న తాము కనిష్క్ కార్పొరేట్ కార్యాలయం, ఫ్యాక్టరీ, షోరూములను తనిఖీ చేసేందుకు యత్నించగా అక్కడ ఏ కార్యకలాపాలూ సాగడం లేదని స్పష్టమైనట్లు బ్యాంకుల అధికారులు తెలిపారు. మరోవైపు రికార్డులను తారుమారు చేశామని, సరుకు నిల్వలు తరలించేశామని భూపేష్ జైన్ బ్యాంకర్లకు ఒక లేఖ కూడా రాశారు.

నష్టాల పేరిట 2017 మే నెలలోనే మూత

వ్యాపార నష్టాలను భరించలేని స్థితిలో కనిష్క్ సంస్థ 2017 మే నెలలోనే బోర్డు తిప్పేసిందని 'మద్రాస్ జ్యూయలర్స్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధి తెలిపారు. కాగా, ఎస్‌బీఐ రికార్డుల ప్రకారం 2007 నుంచీ కనిష్క్ సంస్థ రుణాలు పొందుతోంది. అలా సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ బ్యాంకులు సదరు సంస్థకు రుణ పరిమితిని పెంచాయి. మరోవైపు కనిష్క్‌కు ఐసీఐసీఐ బ్యాంకు ఇచ్చిన రుణ వసూలు బాధ్యతను ఎస్‌బీఐ స్వీకరించింది. ఆ సమయానికి నిర్వహణ మూలధన రుణం రూ.50 కోట్లు, నిర్దిష్ట కాలవ్యవధి రుణాలు రూ.10 కోట్లుగా ఉన్నాయి. ఈ మొత్తాన్ని 2011 మార్చి నెలలో పీఎన్‌బీ, బ్యాంక్ ఆఫ్ ఇండియాలతో సంయుక్తంగా బహుళ బ్యాంకుల ఒప్పందంగా మార్చుకున్నారు. ఇక కనిష్క్ ఉదంతంపై కార్పొరేషన్ బ్యాంకు ఏజీఎం సౌందర రాజన్‌ను ఓ మీడియా సంస్థ ప్రతినిధి సంప్రదించగా- దీన్ని గురించి తమకు తెలుసునని ఆయన జవాబివ్వడం గమనార్హం. అయితే, బ్యాంకుల కన్సార్టియానికి నాయకత్వం వహించిన ఎస్‌బీఐ అన్ని ప్రశ్నలకూ జవాబివ్వగలదని భావిస్తున్నట్లు పేర్కొన్నా రు. ఇతర బ్యాంకులతో పోలిస్తే కనిష్క్ తమవద్ద తీసుకున్న నిర్వహణ మూలధన రుణం కేవలం రూ.20 కోట్లేనని చెప్పారు.


'కనిష్క్'కు బ్యాంకులు సమర్పించిన రుణ వివరాలు

ఎస్‌బీఐ రూ.215 కోట్లు; పీఎన్‌బీ రూ.115 కోట్లు; యూబీఐ రూ.50 కోట్లు, సిండికేట్ బ్యాంక్ రూ.50 కోట్లు; బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.45 కోట్లు; ఐడీబీఐ బ్యాంకు రూ.45 కోట్లు; యూకో బ్యాంకు రూ.40 కోట్లు, తమిళనాడు మర్కెంటైల్ బ్యాంకు రూ.37 కోట్లు; ఆంధ్రాబ్యాంకు రూ.30 కోట్లు; బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.30 కోట్లు; హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రూ.25 కోట్లు; ఐసీఐసీఐ రూ.25 కోట్లు; సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.20 కోట్లు, కార్పొరేషన్ బ్యాంక్ రూ.20 కోట్ల వంతున రుణవసతి కల్పించాయి.

ఎస్పీ.. బీఎస్పీకి అమిత్ 'షా'క్!


- రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ భేటీ
- ఏడుగురు ఎమ్మెల్యేల డుమ్మా.. వారంతా బీజేపీకి ఓటు?
- తెరవెనుక మంత్రాంగం నడిపిన అమిత్‌షా!

న్యూఢిల్లీ, మార్చి 21: ఉత్తర్‌ప్రదేశ్‌లో రెండు లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచి మంచి జోరుమీదున్న ఎస్పీ-బీఎస్పీకి గట్టి షాక్ తగిలింది. ఈ ఉప ఎన్నికల్లో ఎస్పీకి బీఎస్పీకి మద్దతు ఇచ్చినందుకు.. రాజ్యసభ ఎన్నికల్లో బీఎస్పీకి ఎస్పీ మద్దతు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే.. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో సమాజ్‌వాది పార్టీ నిర్వహించిన కీలక సమావేశానికి ఏడుగురు ఎస్పీ నేతలు డుమ్మా కొట్టారు. వీరి గైర్హాజరు వెనుక అమిత్‌షా హస్తం ఉన్నట్లు చర్చించుకుంటున్నారు. నిజంగానే వారు బీజేపీకి అనుకూలంగా మారితే మాత్రం బీఎస్పీ రాజ్యసభ సీటుకు గండిపడటం ఖాయమని అంటున్నారు. త్వరలో ఉత్తరప్రదేశ్‌లోని 10 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఒక్కో అభ్యర్థికి కనీసం 37 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఇప్పటికే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో తమకు 311 సీట్లు ఉన్న నేపథ్యంలో కనీసం 8 సీట్లు గెలుస్తామని బీజేపీ దీమాతో ఉంది. ఇక ఎస్పీకి 47 సీట్లు ఉన్న నేపథ్యంలో ఆ పార్టీకి ఒక ఎంపీ సీటు ఖాయం. అయితే, తమ వద్ద అదనంగా ఉన్న 10మంది ఎమ్మెల్యేల మద్దతు తమకు ఉప ఎన్నికల్లో సాయం చేసిన బీఎస్పీకి ఇవ్వాలని ఎస్పీ నిర్ణయించుకుంది. బీఎస్పీకి ఇప్పటికే 19మంది ఎమ్మెల్యేలు ఉండగా సమాజ్‌వాది పార్టీ నుంచి 10మంది ఎమ్మెల్యేల మద్దతు, మిగితా మద్దతు అజిత్‌సింగ్ పార్టీ నుంచి బీఎస్పీ తెచ్చుకోవాలని భావిస్తోంది. అయితే, అనూహ్యంగా ఏడుగురు ఎస్పీ ఎమ్మెల్యేలు కీలక సమావేశానికి రాలేదు. వీరిలో అఖిలేశ్ యాదవ్ బాబాయ్ శివపాల్ యాదవ్ కూడా ఉన్నారు. అయితే, వీరంతా బీజేపీకి అనుకూలంగా ఓటు వేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోందట. కానీ, సమాజ్ వాది పార్టీ నేతలు మాత్రం ఎన్నికల సమయానికి అంతా సర్దుకుంటుందని, తమ వాళ్లు తమతోనే ఉంటారనే విషయం అప్పుడు తెలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ కీలక పరిణా మం వెనుక అమిత్‌షా ఉన్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు.



ఆ రోజు.. అలా జరిగింది!

- బాత్‌రూమ్‌లో జయ స్పృహ తప్పిపడిపోయారు
- ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మెలకువ వచ్చింది
- విచారణ కమిషన్‌కు వెల్లడించిన శశికళ



చెన్నై, మార్చి 21: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితను ఆసుపత్రిలో చేర్చిన రోజు ఏం జరిగిందో ఆమె సన్నిహితురాలైన శశికళ విచారణ కమిషన్‌కు చెప్పారు. తీవ్ర జ్వరంతో ఉన్న జయలలితను ఆసుపత్రికి రావాలని వైద్యులు సూచించినా ఆమె నిరాకరించారని తెలిపారు. రాత్రి సమయంలో ఆమె స్పృహ కోల్పోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆమెను హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు చెప్పారు. ''2016, సెప్టెంబరు 22న రాత్రి 9.30 గంటల ప్రాంతంలో జయలలిత బ్రష్ చేసుకునేందుకు బాత్‌రూమ్‌కు వెళ్లారు. అప్పటికే ఆమెకు జ్వరం బాగా ఉంది. బాత్‌రూంలో ఆమె కిందపడిపోవడంతో సాయం పట్టమని నన్ను పిలిచారు. నేను వెంటనే వెళ్లి జయలలితను బాత్‌రూం నుంచి తీసుకొచ్చి బెడ్ మీద పడుకోబెట్టాను. అంతలో ఆమె స్పృహ కోల్పోయారు. దీంతో నేను మా బంధువైన డాక్టర్ శివకుమార్‌కు ఫోన్ చేశాను. డాక్టర్ వచ్చి జయలలితను పరీక్షించారు. ఆ తర్వాత అపోలో ఆసుపత్రి వైస్ ఛైర్‌పర్సన్ ప్రీతారెడ్డి భర్త విజయ్‌కుమార్ రెడ్డికి ఫోన్ చేసి అంబులెన్స్ పంపమని కోరారు.15 నిమిషాల్లో రెండు అంబులెన్స్‌లు వచ్చాయి. జయలలితను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించాం. మార్గ మధ్యంలో ఆమెకు స్పృహ వచ్చింది. ఎక్కడకు వెళ్తున్నాం అని అడిగితే ఆసుపత్రికి అని చెప్పాను'' అని శశికళ వెల్లడించినట్లు సమాచారం. ఆస్పత్రిలో జయన గవర్నర్ విద్యాసాగర్‌రావు, పన్నీర్‌సెల్వం, తంబిదురై, విజయ భాస్కర్ ఆమెను చూసినట్లు చెప్పారు. ఆ తర్వాత కూడా కొందరు నేతలు జయలలితను చూసినట్లు పేర్కొన్నారు. జయలలిత ఆసుపత్రిలో ఉన్నప్పుడు నాలుగు వీడియోలు రికార్డ్ చేశామని, అవన్నీ జయ అనుమతితోనే తీశామని శశికళ చెప్పారు. వాటిని కమిషన్‌కు సమర్పించామన్నారు. జయలలిత తీవ్ర అనారోగ్యంతో డిసెంబర్ 5, 2016న అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన విషయం తెలిసిందే.

వై.ఎస్.ఆర్‌గా మమ్ముట్టి



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కీ॥శే॥ డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జీవిత కథను సినిమాగా రూపొందిస్తున్నారు. మహి.వి.రాఘవ్ దర్శకుడు. 70 ఎం.ఎం.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'యాత్ర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పాత్రలో ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి నటిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత విజయ్ చిల్లా మాట్లాడుతూ "'ఆనందో బ్రహ్మ'తో తమ సంస్థకు రెండో విజయాన్ని అందించిన మహి వి.రాఘవ్ డైరెక్షన్‌లో మరో సినిమాను నిర్మించడం చాలా ఆనందంగా ఉంది. 'యాత్ర' కోసం మహి రెడీ చేసిన లైన్ నచ్చడంతో సినిమాను ఈ సినిమాను నిర్మిస్తున్నాం. వైఎస్ఆర్ పాత్రలో నటించడానికి మమ్ముట్టి అంగీకరించడం చాలా ఆనందం కలిగించింది. రెండు రాష్ట్రాల ప్రజలు ఆరాధించే నాయకుడు, ఎమోషనల్‌గా ప్రజలకు దగ్గరైన వ్యక్తి వైయస్. ఆయన జీవితంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తాం. త్వరలోనే ఈ బయోపిక్‌కి సంబంధించిన వివరాల్ని ప్రకటిస్తాం'' అన్నారు.



నా మనసుకు దగ్గరైన సినిమా ఎం.ఎల్.ఎ

– కల్యాణ్‌రామ్

నందమూరి కల్యాణ్ రామ్, కాజల్ అగర్వాల్ హీరో హీరోయిన్లుగా టి.జి.విశ్వప్రసాద్ సమర్పణలో బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్స్‌పై ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో కిరణ్‌రెడ్డి, భరత్ చౌదరి నిర్మించిన చిత్రం 'ఎంఎల్ఏ'. ఈ సినిమా మార్చి 23న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఫంక్షన్ జరిగింది. నందమూరి కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ ''కథను నమ్మి సినిమాలు తీసే నిర్మాతలంటే నాకు ఎంతో ఇష్టం. అటువంటి వారిలో ఈ నిర్మాతలు ముందుంటారు. తప్పకుండా భవిష్యత్‌లో పెద్ద నిర్మాతలు అవుతారు. పటాస్ విన్నప్పుడు ఎంత ఎగ్జయిట్ అయ్యానో.. ఈ సినిమాకు కూడా అంతే ఎగ్జయిట్ అయ్యాను. సినిమాను కళ్లకు కట్టినట్లు నెరేషన్ ఇచ్చాడు ఉపేంద్ర. నా మనసుకు దగ్గరైన సినిమా ఇది. తప్పకుండా ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది'' అన్నారు. అల్లరి నరేశ్ మాట్లాడుతూ ''కల్యాణ్‌కి ఎం.ఎల్.ఎ బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుంది. ఎంటైర్ టీంకు ఆల్ ది బెస్ట్'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ ''మంచి సినిమాను మంచి హీరో, టీంతో కలిసి చేయడం అంత సులభం కాదు. పటాస్ తర్వాత అదే ఎనర్జీ కల్యాణ్‌రామ్‌లో కనపడుతుంది. ఈ సినిమా తనకు మంచి హిట్ అవుతుంది'' అన్నారు. నిర్మాత కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ ''బ్లూప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో మా రెండో సినిమా. నేనే రాజు నేనే మంత్రి సమయంలోనే ఉపేంద్రగారు నాకు ఈ కథను చెప్పారు. థ్రిల్లింగ్‌గా సినిమాను కళ్లకు కట్టినట్లు నెరేట్ చేశారు. కథ విన్న కల్యాణ్‌రామ్‌గారు సినిమా చేయడానికి అంగీకరించారు. ఆయనతో ఈ సినిమాకు పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. నిర్మాతల గురించి ఆలోచించే హీరో'' అన్నారు. నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ మాట్లాడుతూ ''కల్యాణ్‌రామ్‌గారితో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో తొలి సినిమా చేయడం హ్యాపీగా ఉంది. ఆయనతో మరిన్ని సినిమాలను చేయాలనుకుంటున్నాను'' అన్నారు. దర్శకుడు ఉపేంద్ర మాధవ్ మాట్లాడుతూ ''కల్యాణ్‌గారు దర్శకుడిగా నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. కథ విన్న ఆయన 'మనం ఈ సినిమా చేస్తున్నాం' అని అన్నారు. ఎక్కువ సమయం తీసుకోకుండా ఓకే చెప్పేశారు. సినిమాకి పనిచేసిన ప్రతి ఆర్టిస్టు, టెక్నీషియన్ ఎంతో సపోర్ట్ చేశారు. అందరికీ థాంక్స్'' అన్నారు.

కన్నడ రీమేక్‌పై కన్ను?


బాలకృష్ణ

మాజీ ముఖ్యమంత్రి, కీ॥శే॥ ఎన్టీఆర్ జీవిత కథ ఆధారంగా త్వరలో తెరకెక్కబోయే 'యన్.టి.ఆర్' చిత్రంలో బాలయ్య నటించనున్న విషయం తెలిసిందే. అయితే ఈ చిత్రానికి తేజ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమా తర్వాత బాలయ్య నటించబోయే సినిమాపై పలు రకాల వార్తలు వినపడుతున్నాయి. అందులో ఒకటి బాలకృష్ణ కన్నడ సినిమా రీమేక్‌పై ఆసక్తిగా ఉన్నారని..సాధారణంగా రీమేక్‌లపై పెద్దగా ఆసక్తి చూపని బాలకృష్ణ తాజాగా ఓ కన్నడ మూవీపై కన్నేసినట్లు టాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్ నటించిన 'మఫ్టీ' చిత్ర రీమేక్‌లో నటించేందుకు బాలయ్య ఆసక్తిని చూపుతున్నట్లు తెలుస్తోంది. 'మఫ్టీ'లో శివ రాజ్‌కుమార్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించగా.. బాక్సాఫీస్ వద్ద ఆ చిత్రం కలెక్షన్ల వర్షం కురిపించింది. త్వరలోనే ఈ విషయమై క్లారిటీ రానుంది.

మరింత దగ్గరగా...


రకుల్ ప్రీత్ సింగ్

అభిమానతారల గురించి కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఆసక్తిని చూపిస్తుంటారు అభిమానులు. అటువంటి వారి కోసం రకుల్‌ప్రీత్ సింగ్ ఓ కొత్త ఆలోచన చేసింది. అందులో భాగంగా తన పేరుతో ఓ యాప్‌ను తయారు చేయించుకుంది. ఈ యాప్‌లో రకుల్ ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాలు అనుసంధానమై ఉంటాయి. ఈ యాప్ ద్వారా తన సినిమా విశేషాలను తెలియజేయడమే కాకుండా అభిమానులతో చాట్ కూడా చేస్తానన్నారు రకుల్. ప్రస్తుతం ఈ పంజాబీ ముద్దుగుమ్మ తమిళంలో కార్తి, సూర్య సినిమాల్లో నటిస్తుంది.


గోపీచంద్

వేసవిలో 'పంతం'

గోపీచంద్ కథానాయకుడిగా కె.కె.,రాధామోహన్ నిర్మిస్తోన్న చిత్రం 'పంతం'.'ఫర్ ఎ కాస్' ఉప శీర్షిక. కె.చక్రవర్తి దర్శకుడు. గోపీచంద్ నటిస్తోన్న 25వ చిత్రమిది. ఈ సినిమా ఫస్‌లుక్‌ను విడుదల చేసిన సందర్భంగా నిర్మాత కె.కె.రాధామోహన్ మాట్లాడుతూ ''మా బ్యానర్‌లో గోపీచంద్‌గారి 25వ సినిమాగా 'పంతం'ను హ్యాపీగా ఉంది. అనుకున్న ప్లాన్ ప్రకారం సినిమాలో 60 శాతం చిత్రీకరణను పూర్తి చేశాం. మంచి మెసేజ్‌తో పాటు కమర్షియల్ హంగులతో సినిమాను దర్శకుడు చక్రి చక్కగా తెరకెక్కిస్తున్నారు. హీరో గోపీచంద్‌గారి క్యారెక్టర్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. అలాగే ఇప్పటి వరకు కనపడని స్టైలిష్ లుక్‌లో గోపీచంద్‌గారు కనపడతారు. సినిమా ఫస్టులుక్‌ను విడుదల చేశాం. అలాగే మెహరీన్ చాలా మంచి పాత్రలో కనపడతారు. గోపీ సుందర్ సంగీతం, ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రఫీ సినిమాకు పెద్ద ఎసెట్ అవుతాయి. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణులు సహకారంతో సినిమాను అనుకున్నట్లు పూర్తి చేసి ఈ వేసవిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు.



మార్చి 23న 'రాజరథం'

నిరూప్ భండారి, అవంతిక శెట్టి జంటగా నటించిన చిత్రం 'రాజరథం'. అనూప్ భండారి దర్శకుడు. జాలీ హిట్స్ ప్రొడక్షన్స్ సంస్థపై అంజు వల్లభనేని, విషు దకప్పగారి, సతీష్ శాస్త్రి, అజయ్‌రెడ్డి గొల్లపల్లి ఈ సినిమాను నిర్మించారు. మార్చి 23న సినిమా విడుదలవుతుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సతీశ్ శాస్త్రి మాట్లాడుతూ ''యు.ఎస్‌లో డిస్ట్రిబ్యూటర్స్‌గా ఉండి ఎన్నో విజయవంతమైన సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేసిన మా జాలీ హిట్స్ సంస్థ నిర్మాణ రంగంలోకి వచ్చింది. అనూప్ భండారి దర్శకత్వంలో చేసిన ఈ సినిమాలో నిరూప్ భండారి హీరోగా నటించారు. సినిమా మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. అజనీశ్ లోక్‌నాథ్ ఈ సినిమాకు నేపథ్య సంగీతాన్ని అందించారు. మార్చి 23న విడుదలవుతున్న ఈ సినిమాను అందరూ ఆదరించాలి'' అన్నారు. రామ్‌కుమార్ మాట్లాడుతూ ''అందరూ యు.ఎస్‌కు చెందిన నిర్మాతలు. అయితే సినిమా రంగంపై ఉన్న ఆసక్తితో మంచి సినిమాలు చేయాలని వచ్చారు. 'రాజరథం' మార్చి 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇలాంటి సినిమాలను ఆదరిస్తే.. మరిన్ని కొత్త కాన్సెప్ట్ సినిమాలు వస్తాయి. రెండేళ్ల పాటు యూనిట్ కష్టపడి చేసిన చిత్రమిది. సినిమా కోసం ఇరవై రెండు కోట్ల ఖర్చు పెట్టి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా చేశాం'' అన్నారు. అవంతిక శెట్టి మాట్లాడుతూ ''ఒక మంచి సినిమాకు ఉండాల్సిన బెస్ట్ క్వాలిటీస్ అన్ని ఈ సినిమాలో ఉన్నాయి. మంచి సినిమా కోసం యూనిట్ అందరం ఎంతో కష్టపడ్డాం'' అన్నారు. నిరూప్ భండారి మాట్లాడుతూ ''ఈ సినిమా కోసం తెలుగు నేర్చుకున్నాను. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్. సినిమాలో అభి అనే మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థిగా కనపడతాను. రానాగారు అడగ్గానే వాయిస్ ఓవర్ అందించారు. అలాగే ఆర్యగారు సినిమాలో చాలా ముఖ్యమైన పాత్రలో నటించారు. నిర్మాతలు ఇచ్చిన సహకారంతో మంచి సినిమాను చేశాం. మార్చి 23న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది'' అన్నారు.

ఆమిర్‌కు అంబాని అండ



మహాభారతాన్ని తెరకెక్కించేందుకు బాలీవుడ్ హీరో ఆమిర్‌ఖాన్ ఎప్పటి నుంచో ప్లానింగ్ చేస్తున్నారు. అది తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని ఆమిర్ చాలాసార్లు చెప్పారు. అయితే ఈ సినిమా చెయ్యాలంటే ఎన్నో సంవత్సరాలు పడుతుంది. పైగా బడ్జెట్ కూడా ఎక్కువ. దీంతో ఈ సినిమాకు సహ నిర్మాతగా వ్యవహరించేందుకు రిలయన్స్ సంస్థ అధినేత ముఖేశ్ అంబానీ సిద్ధమయ్యారని తెలుస్తోంది. దాదాపు వెయ్యి కోట్ల రూపాయల బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తారని తెలుస్తోంది. ఒకే దర్శకుడితో కాకుండా కొందరు దర్శకులతో ఈ చిత్రాన్ని నాలుగు లేదా ఐదు భాగాల్లో నిర్మిస్తారట.

యదార్థ ఘటనలతో 'మర్లపులి'

సుధాకర్ ఇంపెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బోన్ క్రాఫ్ట్ క్రియేషన్స్ పతాకంపై డి నరసింహ సమర్పించిన చిత్రం 'మర్లపులి'. వరుణ్ సందేశ్ ప్రత్యేక పాత్రలో, అర్చన ప్రధాన పాత్రలో నటించి న ఈ చిత్రానికి దర్శకుడు డి.రామకృష్ణ. నిర్మాతలు బి సుధాకర్‌రెడ్డి, బి.భవాని శంకర్, ఖమ్మం శ్రీనివాస్. ఈ చిత్రం ఈనెల 23న విడుదల కానుంది. ఈ చిత్రం ఆడియోను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతల్లో ఒకరైన బి.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ''1983 సంవత్సరంలో జరిగిన యదార్థ ఘటన ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో రూపొందిన సినిమా'' అన్నారు. దర్శకుడు రామకృష్ణ మాట్లాడుతూ ''13 రోజుల్లో షూటింగ్ పూర్తి చేశాం. మంచి కథ, యథార్థగాథ కనుక తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను'' అన్నారు.


వరుణ్ సందేశ్


అమైరా దస్తూర్

సైకలాజికల్ థ్రిల్లర్‌లో...

బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్, రాజ్ కుమార్ రావ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమా 'మెంటల్ హై క్యా'. ఈ చిత్రంతో ప్రకాశ్ కోవెలమూడి బాలీవుడ్‌లోకి దర్శకుడిగా అడుగుపెడుతున్నారు. హాస్య ప్రధానంగా సాగే ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌కు కథ, మాటలను ప్రకాశ్ సతీమణి కనిక థిల్లాన్ అందిస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలతో.. ఇప్పటికే ప్రేక్షకుల్లో అంచనాలను పెంచింది ఈ చిత్రం. ఇదిలా ఉంటే.. ఈ చిత్రంలో రాజ్ కుమార్ రావ్‌కు జంటగా అమైరా దస్తూర్ నటించనుందని సమాచారం. ఈ నేపథ్యంలో.. చిత్ర బృందం అమైరాను సంప్రదించినట్టు తెలుస్తోంది. బాలాజీ మోషన్ పిక్చర్స్, కర్మ మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాదిలోనే విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.

భూమిక.. ఓ దెయ్యం



కన్నడలో విజయం సాధించిన 'యూ టర్న్' చిత్రాన్ని తెలుగులో సమంత రీమేక్ చేస్తున్న విషయం తెలిసిందే. తెలుగు నేటివిటీకి, తెలుగు ప్రేక్షకుల అభిరుచి మేరకు సినిమాలో కొన్ని మార్పులు, చేర్పులు చేసి తెరకెక్కిస్తున్నారు దర్శకుడు పవన్‌కుమార్. ఈ సినిమాలో సమంత ఓ జర్నలిస్ట్ పాత్ర పోషిస్తుండగా, భూమిక దెయ్యం పాత్రలో కనిపిస్తుందట. కథ ప్రకారం భూమిక పోషించే పాత్ర చాలా చిన్నదైనప్పటికీ కథలో ఆమె పాత్ర చాలా కీలకంగా ఉంటుందని తెలుస్తోంది. రాహుల్ రవీంద్రన్, ఆది పినిశెట్టి ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో కనిపిస్తారు. ఈ కన్నడ రీమేక్‌పై ప్రేక్షకుల్లో చాలా అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాకి సంబంధించిన మరింత సమాచారం త్వరలోనే తెలిసే అవకాశం ఉంది.

అవిశ్వాసం అనుమతించాల్సిందే

కేంద్రానికి ప్రత్యామ్నాయం లేదు.. చర్చకు అందరూ సిద్ధం కావాలి



- టీడీపీపై బీజేపీకి అనుమానం
- జాతీయ రాజకీయాలంటే ఇష్టం లేదు
- ఆ మాట చెబితే వాళ్లు నమ్మడం లేదు
- టీడీపీ ఎంపీలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

అమరావతి, మార్చి 21(మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం లోక్‌సభలో ప్రవేశపెడుతున్న అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించాల్సిందేనని, అది తప్ప కేంద్ర ప్రభుత్వానికి మరో ప్రత్యామ్నాయం ఏమీ లేదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తన మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా తిరుపతిలో ఉన్న ఆయన.. అక్కడినుంచే పార్టీ ఎంపీలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొంతకాలంగా బీజేపీ తమ పార్టీపై అనుమానం పెంచుకుందని ఆయన ఆరోపించారు. జాతీయ రాజకీయాల పట్ల తనకు ఆసక్తి లేదన్నా వాళ్లు నమ్మడం లేద న్నారు. అందుకే రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీకి ఏమాత్రం అవసరం లేకున్నా వైఎస్ఆర్‌సీపీ మద్దతు తీసుకుందని గుర్తుచేశారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై, ట్రిపుల్ తలాక్ మీద కూడా ముందుగా బీజేపీకి చెప్పే ఉభయ సభల్లో తమ ఎంపీలు ఆందోళన చేశారన్నారు. ఒకవైపు అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చి, మరోవైపు పీఎంఓలో ఉంటున్నారని... అక్కడే వైసీపి చిత్తశుద్ధి తెలిసిపోతోందని చంద్రబాబు విమర్శించారు.

వాయిదా వేస్తే.. మరింత ఆగ్రహం

''కేంద్రాన్ని సామరస్యంగా అడిగినప్పుడు చేయలేదు. మంత్రులు రాజీనామా చేసినా స్పందించలేదు. ఎన్డీయే నుంచి వైదొలిగినా కదలిక లేదు. అవిశ్వాసం పెట్టినా చేయడం లేదు. కేంద్రం మొండిగా వ్యవహరించడం వెనుక వ్యూహం ఏమిటి..? ఏ భరోసాతో కేంద్రం ఏపీ పట్ల ఇంత కఠినంగా వ్యవహరిస్తోంది? రాష్ట్ర ప్రజలు అన్నీ అర్థం చేసుకుంటున్నారు. న్యాయం చేయమని అడుగుతున్నాం. ఏపీకి జరిగిన అన్యాయంపై దేశవిదేశాల్లోని తెలుగువారిలో తీవ్ర అసంతృప్తి ఉంది. ఇతర రాష్ట్రాల్లోని తెలుగువారు కూడా ఈ అన్యాయాన్ని నిరసిస్తున్నారు. ఎంపీలు అందరూ సంఘటితంగా పోరాడాలి. 5 కోట్ల మంది ప్రజల మనోభావాలను ప్రతిబింబించాలి. ఎట్టి పరిస్థితుల్లో అవిశ్వాసం నోటీసును అనుమతించాల్సిందే. ప్రభుత్వానికి ఇక మరో ప్రత్యామ్నాయం అంటూ ఏమీ లేదు. సభను పదే పదే వాయిదాలు వేసుకుంటూ పోతే, మరింత ఆగ్రహానికి గురవుతారు. అవిశ్వాసంపై చర్చకు అందరూ సన్నద్ధం కావాలి. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఎలుగెత్తాలి. పునర్వ్యవస్థీకరణ చట్టంలో కేంద్రం ఏం చేస్తానని చెప్పింది..? ఎంతవరకు చేశారు..? ఇంకా ఏం చేయాలి..? పార్లమెంటు ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలుచేశారనే దానిపై ప్రతి ఒక్కరిలో అవగాహన ఉండాలి. అధ్యయనం చేయాలి, దానిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి'' అని చంద్రబాబు ఎంపీలకు సూచించారు.



అదే స్ఫూర్తితో పోరాడాలి...

''పార్లమెంట్‌లో ప్రజలకోసం పోరాడుతున్నాం. మన హక్కుల కోసం పోరాడుతున్నాం. చివరి రోజు వరకూ ఇదే స్ఫూర్తితో పోరాడాలి. ఎంపీలంతా కలిసికట్టుగా పనిచేయాలి. 1985 ఆగస్టు సంక్షోభంలో 161 మంది ఎమ్మెల్యేలు ఒకేతాటిపై నిలిచి, ఘన విజయం సాధించారు. అదే స్ఫూర్తి ఇప్పుడు ఎంపీలందరిలో కనిపించాలి. రాష్ట్రానికి న్యాయం జరిగేవరకు పోరాడాలి. మనకు ఎవరిమీదా కోపం లేదు. మనకు ఎవరిమీదా ద్వేషం లేదు. కేంద్ర పెద్దలు చెప్పినమాట నిలబెట్టుకోలేదు. కేంద్రం అన్యాయం చేసిందనే భావన ప్రజల్లో ఉంది. రాష్ట్ర సమస్యలు జాతీయస్థాయి అంశంగా మారాయి. బీజేపీ మినహా అన్ని పార్టీలు ఏపీ పట్ల సానుభూతితో ఉన్నాయి. ఇది స్ఫూర్తిదాయక సమయం. ఈ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి'' అని చంద్రబాబు టీడీపీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత వై.ఎస్.చౌదరి, ఎంపీలు సీఎం రమేష్, టీజీ వెంకటేష్, ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు కుటుంబరావు, శాసన సభ, శాసనమండలి చీఫ్ విప్‌లు పల్లె రఘునాథ రెడ్డి, పయ్యావుల కేశవ్, లోక్ సభ, రాజ్యసభ సభ్యులు, అసెంబ్లీ వ్యూహ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హోదా భారం వెంకన్నదే

రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశంలో న్యాయం జరిగేలా చూడాలని తిరుమల వేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. బుధవారం ఆయన కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రపంచం వ్యాప్తంగా ఉన్న హిందువులకు ఆశీస్సులు అందజేసే వేంకటేశ్వర స్వామి, రాష్ట్రానికి ప్రత్యేక ఆశీస్సులు అందజేయాలని కోరినట్టు చెప్పారు. రాష్ట్రాన్ని ఉన్నత స్థానంలో ఉంచాలని కోరినట్టు తెలిపారు. తన మనవడు దేవాన్ష్ జన్మదినం సందర్భంగా శ్రీవారి దర్శనానికి వచ్చినట్టు చంద్రబాబు చెప్పారు. దేవాన్ష్ అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలను తిరుమలలోనే చేసుకున్నామని, వేంకటేశ్వరస్వామి తమ కులదైవమని చెప్పారు. దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా తిరుమల అన్నప్రసాదం ట్రస్టుకు చంద్రబాబు 26 లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారు. చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలసి అన్న ప్రసాదం కాంప్లెక్స్‌కు వెళ్లారు. అక్కడ భక్తులకు భోజనాలు వడ్డించి, అక్కడే భోజనం చేశారు. దేవాన్ష్‌ను ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు చెప్పారు. చంద్రబాబు కుటుంబ సభ్యులతో పాటు ఆయన వియ్యంకుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కుటుంబ సభ్యులు శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం సాయంత్రమే వారు తిరుమల చేరుకుని రాత్రికి అక్కడే బస చేశారు. బుధవారం ఉదయం స్వామివారిని దర్శనం చేసుకున్నారు. చంద్రబాబు కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.



ఎమ్మార్పీఎస్ నేతలతో ఉపసంఘం భేటీ

- డప్పు, చెప్పుల వృత్తిదారులకు పెన్షన్‌పై చర్చ

హైదరాబాద్, మార్చి 21 (మనం ప్రతినిధి): డప్పు, చెప్పు చేతివృత్తులవారికి సంబంధించి 50-65 ఏళ్ల మధ్య ఉన్నవారందరికీ పెన్షన్ మంజూరు చేయాలని ఎమ్మార్పీస్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మంత్రివర్గ ఉపసంఘంతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, జగదీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి సమావేశమయ్యారు. తెలంగాణ ఎంఆర్పీఎస్ నేతలు వంగపల్లి శ్రీను, సుంకపాక దేవయ్య, యాతాకుల భాస్కర్, మేడి పాపయ్య, రేగుంట సునీల్, ఎస్సీ అభివ ద్ధి శాఖ కమిషనర్ బుద్ధ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని మంత్రులు ఎమ్మార్పీస్ నేతలకు హామీ ఇచ్చారు.

ఆగ్రో ప్రాసెసింగ్‌పై ఉప సంఘం భేటీ


హైదరాబాద్, మార్చి 21 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుపై విదివిధానాల రూపకల్పనకై అసెంబ్లీలోని సమావేశ మందిరంలో బుధవారం కేబినెట్ సబ్ కమిటీ భేటి అయ్యింది. ఈ భేటీలో మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్, జూపల్లి కృష్ణారావు, జగదీశ్వర్ రెడ్డి, సంబంధింత అధికారులు పాల్గొన్నారు. పరిశ్రమలు స్థాపించి తెలంగాణను అగ్రభాగాన నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని, పరిశ్రమల స్థాపనకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రులు సూచించారు.



ఓటు ఇలా వేయాలి!

- టీఆర్ఎస్ 'రాజ్యసభ' మాక్ పోలింగ్

హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో ఎలా ఓటు వేయాలి అనే అంశంపై బుధవారం టీఆర్ఎస్ఎల్పీలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఎంఐఎం సభ్యులు కూడా ఇందులో పాల్గొన్నారు. మంత్రి కేటీఆర్ మాత్రం పోస్టల్ బ్యాలట్ ద్వారా ఓటింగ్ చేశారు. 23 ఎన్నికకు సంబంధించి ఓటు ఎలా వెయ్యాలో సభ్యులకు అయా జిల్లాల ఇంచార్జి మంత్రులు వారికి అవగాహన కల్పించారు.



సీపీఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

- కాంగ్రెస్‌తో పొత్తు ప్రచారాన్ని ఖండించిన చాడ

హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): పార్లమెంటులో వామపక్షాల బలం తగ్గడంతో జాతీయ రాజకీయాలు కలుషితమవుతున్నాయని, వామపక్షాలు బలం పుంజుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అభిప్రాయపడ్డారు. పార్టీ రెండో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడ పత్రికను బుధవారం చాడ పార్టీ నేతలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 1-4వరకు హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో మహాసభలను నిర్వహిస్తామన్నారు. నిజాం కాలేజ్ మైదానం నుంచి సభాస్థలి వరకు ర్యాలీ ఉంటుందన్నారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి కె.నారాయణతోపాటు సీనీయర్ నాయకులు సభలకు హాజరవుతారని చాడ తెలిపారు. దేశంలో ఏక పార్టీ పాలనపోయి బహుళ పార్టీల పాలన కొనసాగుతోందన్నారు. ఏ ఫ్రంట్ అయినా ఇదే జరగబోతుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్, కోదండరాం పార్టీతో సీపీఐ పొత్తు పెట్టుకుంటుందని జరుగుతున్న ప్రచారాన్ని చాడ ఖండించారు. ఎన్నికల ప్రకటన తర్వాత ఎవరితో పొత్తు పెట్టుకునేది తామే వెల్లడిస్తామని చాడ చెప్పుకొచ్చారు.

నిమిషాల్లోనే వాయిదా



లోక్‌సభలో 4వ రోజూ అదే పరిస్థితి.. కేంద్రానికి టీడీపీ, వైసీపీ నోటీసులు.. మరోసారి చర్చకు రాని 'అవిశ్వాసం'

- సభ ఆర్డర్‌లో లేదని స్పీకర్ ప్రకటన
- ఎంపీల నిరసనతో నేటికి వాయిదా
- తెరపైకి బిహార్‌కు హోదా డిమాండ్

న్యూఢిల్లీ, మార్చి 21: లోక్‌సభలో నాలుగో రోజులుగా అదే పరిస్థితి. సభ ప్రారంభమైన వెంటనే ఎంపీలు ఆయా సమస్యలపై వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టడంతో అవిశ్వాసం తీర్మానం నోటీసులు పరిశీలనకు రాకుండానే వాయిదా పడుతోంది. బుధవారం లోక్‌సభ ప్రారంభమైన కొన్ని నిమిషాలకే వాయిదా పడింది. తెలంగాణకు రిజర్వేషన్ల కోటా పెంపు, రైతుల సమస్యలపై టీఆర్ఎస్, కావేరి నీటి యాజమాన్య బోర్డు ఏర్పాటు కోసం అన్నాడీఎంకే ఆందోళన చేపట్టాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని టీడీపీ, వైసీపీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వనందుకు నిరసనగా కేంద్రానికి టీడీపీ, వైసీపీ అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చాయి. కాగా సభ ఆర్డర్‌లో లేనందున తీర్మానానికి మద్దతిస్తున్న 50 మంది ఎంపీలను లెక్కించడం సాధ్యంకాదని స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. సభకు కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, సుష్మా స్వరాజ్, నిర్మలా సీతారామన్, రవిశంకర్ ప్రసాద్, డిప్యూటీ స్పీకర్ తంబిదురై, ఎస్పీ నేత ములాయం సింగ్ యాదవ్ తదితరులు వచ్చారు. అనంతరం సభ ప్రారంభమయ్యాక అదే పరిస్థితి నెలకొంది. ఎంపీలు ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి వెళ్లారు. ఆర్జేడీ బహిష్కృత ఎంపీ రాజేశ్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్ బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డు ప్రదర్శించారు. ఇక కాంగ్రెస్, టీఎంసీ, లెఫ్ట్ పార్టీ సభ్యులు తమ సీట్ల వద్ద నిల్చుని నినాదాలు చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ మాట్లాడుతూ.. సభ్యులు వెల్‌లో నుంచి తమ సీట్ల వద్దకు వెళ్లాలని కోరారు. అవిశ్వాస తీర్మానం సహా అన్ని డిమాండ్లపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అన్నాడీఎంకే ఎంపీలు నినాదాలు కొనసాగించగా, టీఆర్ఎస్ ఎంపీలు వెల్‌లోనే ఉండిపోయారు. స్పీకర్ అవిశ్వాస తీర్మానం నోటీసులను పరిశీలనకు తీసుకోగా.. మద్దతుగా కాంగ్రెస్, టీఎంసీ, లెఫ్ట్ పార్టీల సభ్యులు చేతులెత్తారు. కాగా సభ ఆర్డర్‌లో లేనందున పరిశీలించడం సాధ్యంకాదంటూ స్పీకర్.. గురువారానికి వాయిదా వేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం చర్చకు రాలేదు. మార్చి 5 నుంచి ఎంపీల నిరసనతో లోక్‌సభలో ఎలాంటి చర్చలూ జరగకుండానే వాయిదాల పర్వం కొనసాగుతోంది.

రాజ్యసభలోనూ రభస

రాజ్యసభలోనూ సభ్యుల నిరసన, నినాదాలతో గందరగోళం ఏర్పడింది. వరుసగా 13వ రోజు సభ కార్యక్రమాలు తుడిచిపెట్టుకుపోయాయి. ఆయా సమస్యలపై డీఎంకే, అన్నాడీఎంకే, టీఆర్ఎస్ ఎంపీలు ఆందోళన కొనసాగించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని టీడీపీ, వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. సభ ప్రారంభమైన కొన్ని నిమిషాలకే వాయిదా పడింది. సభ్యులు శాంతించకపోవడంతో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండానే గురువారానికి వాయిదా పడింది.



ఆధునిక బస్ షెల్టర్లు

- అన్ని సౌకర్యాలు కల్పిస్తాం: కేటీఆర్


హైదరాబాద్, మార్చి 21 (మనం ప్రతినిధి): జీహెచ్‌ఎంసీ పరిధిలో అన్ని సౌకర్యాలతో ఆధునిక బస్ షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నామని పురపాలక, నగరాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని బస్ షెల్టర్లు, బస్సుబేలు, వ్యూహాత్మక రహదారి అభివృద్ధి కార్యక్రమం అంశాలపై సయ్యద్ అమినుల్ హసన్ జాఫ్రీ, ఎం.ఎస్ ప్రభాకర్‌రావు వివరణ కోరగా మంత్రి సమాధానమిస్తూ... జీహెచ్‌ఎంసీ పరిధిలో 1221 బస్సు షెల్టర్లు ఉన్నాయని, బస్సు బేలను ఏర్పాటు చేయడం కోసం మరో 47 ప్రదేశాలను గుర్తించినట్టు తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రతి రోజు 35 లక్షల మంది , రాష్ట్ర వ్యాప్తంగా 90 లక్షల మంది బస్సుల ద్వారా ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. 826 ఆధునిక బస్సు షెల్టర్లు నిర్మాణానికి ప్రతిపాదన విజ్ఞాపనను జీహెచ్‌ఎంసీ కోరిందన్నారు. ప్రాజెక్టును నాలుగు ప్యాకేజీలుగా విభజించినట్టు తెలిపారు. వీటికి మూడు ఏజెన్సీలను విజయవంతమైన బిడ్డర్లుగా గుర్తించినట్టు తెలిపారు. పని అప్పగింత లేఖను జారీ చేసి విజయవంతమైన బిడ్డర్లతో రాయితీ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ, సౌత్ జోన్‌లో 85 ఆధునిక బస్సు షెల్టర్లను నిర్మిస్తున్నట్టు తెలిపారు. డిజైన్, నిర్మాణం, నిధులు, నిర్వహణ, బదిలీ ప్రాతిపదికన ప్రైవేట్ డెవలపర్‌ను నియమించడం ద్వారా ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం వ్యవస్థ కింద 826 ఆధునిక బస్సు షెల్టర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టినట్టు తెలిపారు. రాయితీ ఒప్పందం నిబంధనలు, షరతుల ప్రకారం, నియామక తేదీ నుంచి 180 రోజుల్లో బస్సు షెల్టర్లను నిర్మించనున్నట్టు పేర్కొన్నారు. ఎస్ఆర్‌డీపీ కింద జీహెచ్‌ఎంసీ పరిధిలో రోడ్లను అభివృద్ధి చేసి కొత్త రోడ్లను చేపట్టడానికి నిధులను సమీకరిస్తున్నామని తెలిపారు. బాండ్లను జారీ చేయడం ద్వారా రూ. 1000 కోట్ల మొత్తాన్ని సమీకరించాలని జీహెచ్‌ఎంసీ ప్రతిపాదించినట్టు తెలిపారు. రూ. 200 కోట్ల మొదటి విడత మొత్తాన్ని ఇప్పటికే సమీకరించి అనేక రోడ్ల పనులను చేపట్టినట్టు పేర్కొన్నారు. మెర్సర్ సంస్థ చేసిన బెస్ట్ క్యాలిటీ ఆఫ్ లివింగ్ సర్వేలో నాలుగు సార్లు హైదరాబాద్‌కు నెంబర్‌వన్ స్థానం వచ్చిందని గుర్తు చేశారు. రూ. 23 వేల కోట్ల అంచనాలతో ప్లైఓవర్లు, బ్రిడ్జీలు నిర్మించే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. మునిసిపల్ బాండ్ల విషయంలో సహకరిస్తామని మోడీ హామీ ఇచ్చారన్నారు. ఉప్పల్ స్కై వేను త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఉత్తర తెలంగాణకు వెళ్లే రహదారుల్లో కంటోన్మెంట్ స్థలాలు ఉండడంతో ఆదిలాబాద్, రామగుండం రహదారులను అభివృద్ధి చేయడానికి కేంద్రం సహకరించట్లేదన్నారు. హెచ్ఆర్‌డీసీ కింద ఉన్న 9130 కిలో మీటర్ల రోడ్ల అభివృద్ధిలో భాగంగా రూ. 600 కోట్లతో మొదటి దశ పనులు ప్రారంభమైనట్టు తెలిపారు.

ఫలక్‌నుమా టు ఎయిర్‌పోర్టుకు మెట్రో

ఫలక్‌నుమా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రోను విస్తరించనున్నట్లు మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో పాతబస్తీ ఎమ్మెల్యేలతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు ఆయన తెలిపారు. పాతనగర అభివృద్ధికి పలు కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. ఆయా కార్యక్రమాల పురోగతిని మంత్రి సమీక్షించారు. పాతబస్తీలో మెట్రో పనుల్లో వేగం పెంచాలన్నారు. ఫలక్‌నుమా వరకు ఎంఎంటీఎస్.. అక్కడి నుంచి మెట్రోలో ఎయిర్‌పోర్టుకు చేరుకునేలా మెట్రో పనులను విస్తరించనున్నట్లు వివరించారు. చార్మినార్ పాదాచారుల ప్రాజెక్టుపైన చర్చించామన్నారు.

28,623 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం

- జాప్యం నివారణకు విజిలెన్స్ వింగ్ ఏర్పాటు
- పదో తరగతి వరకు తెలుగు తప్పనిసరి: కడియం



హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): విజిలెన్స్ వింగ్‌ను ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజన పథకం అమలులో జాప్యాన్ని నివారిస్తామని విద్యాశాఖ మంత్రి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం, తప్పనిసరి పాఠ్యాంశంగా తెలుగు అంశాలపై బుధవారం శాసనమండలిలో సభ్యులు ఆర్.భూపతిరెడ్డి, పాతూరి సుధాకర్‌రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు, భానుప్రసాద్‌రావు వివరణ కోరగా మంత్రి సమాధానమిచ్చారు. మధ్యాహ్న భోజన పథకంలో జాప్యానికి బాధ్యులైన వంట చేసే ఏజెంట్లు లేదా హెడ్ మాస్టర్లపై చర్యలు తీసుకోవడంతోపాటు దుర్వినియోగమైన మొత్తాన్ని రికవరీ చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డీఈఓలు, ఎంఈవోలు తనిఖీ చేసి పర్యవేక్షించాలి. పాఠశాల ప్రాంతంలో పర్యవేక్షణకు పాఠశాల యాజమాన్య కమిటీలను కూడా బాధ్యులుగా చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 28,623 పాఠశాలల్లో ఉన్న 23,83,759 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో 1 నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. తెలంగాణలో 9, 10 తరగతులకు కూడా మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని ఈ ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యంతోపాటు, వారానికి మూడ్లు కోడి గుడ్లు అందిస్తున్నట్టు తెలిపారు. మూడు గుడ్ల ఖర్చు కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని, ఇందుకు 90 కోట్లు అదనంగా ఖర్చు అవుతుందన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి ఏటా 677 కోట్లు ఖర్చు కాగా అందులో 300 కోట్లు మాత్రమే కేంద్రం అందిస్తుందన్నారు. ఎంత మంది విద్యార్థులు భోజనం చేశారు అనే విషయాన్ని వాట్సాప్ ద్వారా ఉన్నతాధికారులుకు తెలియజేసేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలోని 7080 పాఠశాలల్లో రూ.146 కోట్లతో వంటగదుల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో వారి మాతృభాషను వారు కూడా తప్పనిసరి పాఠ్యాంశంగా చేసినప్పుడు తీసుకున్న చర్యలను పరిశీలించేందుకు వేసిన కమిటీ నివేదికను కూడా ఇచ్చిందన్నారు. ఇతర రాష్ట్రాల్లో 1 నుంచి 10వ తరగతి వరకే మాతృభాష తప్పనిసరి పాఠ్యాంశంగా ఉందని, 1 నుంచి 12వ తరగతి వరకు మాతృభాషను తప్పనిసరిగా చేయడంతో ఇంటర్ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అందుకే రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 1 నుంచి 10 వ తరగతి వరకు తెలుగు భాషను తప్పని సరి పాఠ్యాంశంగా చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.




గుట్కా రాకెట్ గుట్టు రట్టు

- 50 లక్షల విలువైన సరుకు పట్టివేత
- పోలీసుల అదుపులో 19 మంది.. 11 కార్లు సీజ్

రామచంద్రాపురం, మార్చి 21(మనం న్యూస్): నిషేధిత గుట్కా ప్యాకెట్లను తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. రామచంద్రాపురంలో జరిపిన తనిఖీలలో ఈ గుట్కా రాకెట్‌ను ఛేదించినట్లు శంషాబాద్ పోలీసులు వెల్లడించారు. బుధవారం రామచంద్రాపురం పరిధిలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమ గుట్కా ప్యాకెట్లు సరఫరా చేస్తున్న 19 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి భారీగా గుట్కా ప్యాకెట్లతోపాటూ, 11 కార్లను స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. ఈ సందర్భంగా మాదాపూర్ డీసీపీ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో గుట్కాలపై నిషేధం లేకపోవడంతో అక్కడ గుట్కా తయారీ కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దీంతో కర్ణాటక నుంచి గుట్కా పాకెట్లను తరలిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ ప్రాంతాల్లో గుట్కాల అక్రమ రవాణా జోరుగాసాగుతోందన్నారు. ఖరీదైన కార్లలో గుట్కా పాకెట్లను పెద్ద ఎత్తున నగరానికి తీసుకొస్తున్నారని ఆయన వివరించారు. కార్లలో గుట్కా పాకెట్ల తరలింపుపై కొంతకాలంగా దృష్టి సారించి తనిఖీలు నిర్వహిస్తున్నామని డీసీపీ తెలిపారు. తాజాగా పట్టుబడ్డ గుట్కా పాకెట్ల విలువ సుమారు 50 లక్షలకు పైగా ఉంటుందని వివరించారు.

కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలి: పొన్నం




కరీంనగర్, మార్చి 21(మనం బ్యూరో): అవినీతికి పాల్పడితే.. చెప్పుతో కొట్టండి, నేరుగా నాకు ఫోన్ చేయండి వారి తాట తీస్తా.. అని సీఎం కేసీఆర్ చెప్పిన మాటలను ఆయన పార్టీ వారే తుంగలో తొక్కారని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతికి పాల్పడుతున్న కేటీఆర్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనుల్లో కమీషన్‌లు తీసుకొమ్మని మంత్రి కేటీఆర్ చెప్పాడని అన్నందుకు సిరిసిల్ల మున్సిపల్ చైరపర్సన్‌తో రాజీనామా చేయించారన్నారు. కేటీఆర్ మంత్రి వర్గం నుంచి తప్పుకోకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. సిరిసిల్ల ఘటనలో కేటీఆర్ కాకుండా వేరే మంత్రి ఉంటే ఇప్పటికే ఆయన పదవి ఊడేదన్నారు. కేటీఆర్‌ను మంత్రి పదవ నుంచి తప్పించి కేసీఆర్ తన నిజాయతీని చాటుకోవాలన్నారు.

రాజ్యసభ ఎన్నికలకు టీటీడీపీ దూరం


హైదరాబాద్, మార్చి 21(మనం ప్రతినిధి): రాజ్యసభ ఎన్నికల్లో పాల్గొనకూడదని తెలంగాణ తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. అధికారంలో ఉన్న టీఆర్ఎస్‌కు, ప్రతిపక్ష కాంగ్రెస్‌కు సమాన దూరాన్ని పాటించడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ బుధవారం ప్రకటించారు. ఈ నెల 23న జరిగే రాజ్యసభ ఎన్నికల ఓటింగ్‌లో తమ పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొనరని ఆయన తెలిపారు. కాగా, ఎన్నికల స్టంట్‌లో భాగంగానే కేసీఆర్ ఉచిత వైద్య పథకానికి తెరలేపారని టీటీడీపీ ప్రధాన కార్యదర్శి నన్నూరి నర్సిరెడ్డి ఆరోపించారు. ఆక్సిజన్ అందక ఉస్మానియాలో ఒకేరోజు ఐదుగురు మృత్యువాత పడ్డారని, రూ.150 లంచం ఇవ్వలేక ఎర్రగడ్డ ఛాతి ఆస్పత్రిలో ఒకరు మరణించారని అన్నారు.

సెన్సెక్స్ మార్చి 2018 21



పెరిగినవి	%	తగ్గినవి	%
భారతీ ఎయిర్‌టెల్	4.39	టాటా స్టీల్	-1.85
ఎన్‌టీపీసీ	2.11	టాటా మోటార్స్	-1.58
లార్సెన్ టూబ్రో	1.45	అదానీ పోర్ట్స్	-1.44
ఇండస్‌ఇండ్	1.20	హీరో మోటార్	-1.25
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	1.00	పవర్ గ్రిడ్	-0.90

నిఫ్టీ మార్చి 2018 21



పెరిగినవి	%	తగ్గినవి	%
భారతీ ఎయిర్‌టెల్	4.45	టాటా స్టీల్	-1.81
బజాజ్ ఫైనాన్స్	2.85	అదానీ పోర్ట్స్	-1.70
ఐడియా సెల్యులర్	2.59	బోష్	-1.63
ఎన్‌టీపీసీ	2.37	టాటా మోటార్స్	-1.46
అల్ట్రాటెక్	1.59	హీరో మోటో	-1.43


టాప్ గైనర్స్ 21 మార్చి

33,136.18

బి.ఎస్.ఇ సెన్సెక్స్

పాయింట్లు	139.42	%
417.70	భారతీ ఎయిర్‌టెల్	4.39%
169.60	ఎన్‌టీపీసీ	2.11%
1312.40	లార్సెన్ టూబ్రో	1.45%
1737.00	ఇండస్‌ఇండ్ బ్యాంకు	1.20%
1857.65	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	1.00%
1818.00	హెచ్‌డీఎఫ్‌సీ	1.00%
1056.00	కోటక్ మహీంద్రా	0.99%
175.75	ఓఎన్‌జీసీ	0.95%
8877.15	మారుతీ సుజుకి	0.90%
525.35	యాక్సిస్ బ్యాంకు	0.85%

బులియన్ | గత 7 రోజులు



ఉద్యోగాలు పెరుగుతాయి

న్యూఢిల్లీ: నిర్దిష్ట కాల పరిధికి సిబ్బందిని ఉద్యోగాల్లోకి తీసుకునే సదుపాయాన్ని అన్ని రంగాలకు విస్తరింపజేయాలన్న ప్రభుత్వ నిర్ణయం వల్ల సమీప భవిష్యత్తులో ఉద్యోగాల సృష్టి పెంపొందుతుందని భారత పారిశ్రామిక, వాణిజ్య మండలుల సమాఖ్య (ఫిక్కీ) బుధవారంనాడు పేర్కొంది. ఆర్డర్లు, అసైన్‌మెంట్లు ఉన్న కాలంలో, నిర్ణీత కాలానికి అభ్యర్థులను ఉద్యోగాల్లోకి తీసుకునేందుకు వీలు కల్పించే ఈ చర్య కంపెనీలకు సహాయపడుతుంది. ఉత్పత్తి కార్యకలాపాలు తక్కువగా ఉండే కాలంలో అదనపు సిబ్బంది భారాన్ని మోయవలసిన పని ఉండదని 'ఫిక్కీ' అధ్యక్షుడు రసేశ్ షా పేర్కొన్నారు. ''ఇప్పుడున్న కార్మిక చట్టాలలోని నిబంధనల కిందఅటువంటి వెసులుబాటుకు లేదు. ఎగుమతి ఆర్డర్లు పూర్తి చేయడం వంటి కాల బద్ధ పనులకు అదనపు సిబ్బందిని తీసుకునేందుకు పరిశ్రమలు సంకోచిస్తున్నాయి. సవరణతో ఈ ప్రతిబంధకం తొలగిపోతుంది. రానున్న నెలల్లో ఉద్యోగాల సంఖ్య పెరుగుతుంది'' అని ఆయన అన్నారు.

మళ్ళీ 33వేల స్థాయికి సెన్సెక్స్

పెరిగిన విదేశీ నిధుల ప్రవాహం | లాభాలను పటిష్టపరచుకున్న మార్కెట్లు

ముంబయి: బుధవారం వరుసగా రెండవ సెషన్‌లోనూ షేర్లు బలంగా నిలదొక్కుకున్న ధోరణిని కనబరచాయి. బొంబాయి స్టాక్ ఎక్స్చేంజి (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 'సెన్సెక్స్' కీలకమైన 33,000 స్థాయిని మళ్ళీ అందుకుంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధాన సమావేశం ఫలితంపై ఆసక్తి కొనసాగింది. విదేశీ ఫండ్లు నిలకడగా పెట్టుబడులను ప్రవహింపజేయడం, స్పెక్యులేటర్ల షార్ట్ పొజిషనల్ల కవరింగ్-అప్ ట్రేడింగ్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయని బ్రోకర్లు చెప్పారు. బి.ఎస్.ఇ 'సెన్సెక్స్' 139 పాయింట్లు ఎగసి 33,136.18 పాయింట్ల వద్ద ముగిసింది. విస్తృతమైన నేషనల్ స్టాక్ ఎక్స్చేంజి (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' 30 పాయింట్లు లాభపడి 10,155.25 పాయింట్ల వద్ద ముగిసింది. బుధవారం టెలికాం రంగ షేర్లు బాగా లాభపడ్డాయి. బలంగానే ప్రారంభమైన 'సెన్సెక్స్' 33,136.18 పాయింట్ల వద్ద ముగియడానికి ముందు 33,354.93 పాయింట్ల గరిష్ఠ స్థితిని చూసింది. ఇంతకుముందు సెషన్‌లో అది 73.64 పాయింట్లు పుంజుకుంది. ఇక 50 షేర్ల 'నిఫ్టీ' ఇంట్రా-డేలో 10,227.30 పాయింట్ల స్థాయిని తాకినా, తర్వాత, లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో 30.90 పాయింట్ల లాభంతో సరిపెట్టుకుని 10,155.25 పాయింట్ల వద్ద ముగిసింది.



విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మంగళవారం నాడు రూ. 344.16 కోట్ల విలువ చేసే షేర్లు కొనుగోలు చేయగా, దేశీయ మదుపు సంస్థలు కూడా రూ. 731.17 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశాయని తాత్కాలిక డాటా వెల్లడించింది.

అమెరికా పైనే అందరి దృష్టి

''అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల గమనం భవిష్యత్తులో ఏ మార్గం తీసుకోబోతోందనే సంకేతాల కోసం మార్కెట్లలో పాల్గొంటున్నవారు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వడ్డీ రేటు పెంచి ద్రవ్య విధానాన్ని మరింత కట్టుదిట్టం చేస్తే మార్కెట్‌లో తీవ్ర ఉత్థాన పతనాలుంటాయి. అంతర్లీనంగా ఎలాంటి హెచ్చరికలు లేకుండా, ఫెడరల్ రిజర్వ్ తీసుకునే నిర్ణయం ఊహాగానాలకు అనుగుణంగానే ఉంటే, స్వల్ప కాలంలో మనం రిలీఫ్ ర్యాలీ చూడవచ్చు'' అని జియోజీత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ చెప్పారు.

తీపి కబురుతో పెరిగిన షుగర్ షేర్లు

ముడి, రిఫైన్డ్ చక్కెరపై 20 శాతం ఎగుమతి సుంకాన్ని ప్రభుత్వం మంగళవారం రద్దు చేయడంతో షుగర్ కంపెనీల షేర్లు కొనుగోలుదార్లను ఆకర్షించాయి. ఎగుమతులను పెంపొందించేందుకు ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత 2017-18 మార్కెటింగ్ సీజన్‌లో చక్కెర రికార్డు స్థాయిలో 29.5 మిలియన్ టన్నుల మేరకు ఉత్పత్తి కాగలదని భావిస్తున్నారు. బలరాంపూర్ చినీ (8.90 శాతం), ధామ్‌పూర్ షుగర్ (0.90 శాతం), కె.సి.పి షుగర్ (5.28 శాతం), గాయత్రి షుగర్ (2.54 శాతం) లాభపడ్డాయి.

తేరుకున్న బ్యాంకింగ్ షేర్లు

బ్యాంకింగ్ రంగ షేర్లు తిరిగి మెరుగైన స్థితిని కనబరచడం ప్రారంభించాయి. షార్ట్-కవరింగుకు తోడు వాల్యూ-బయింగ్ చోటుచేసుకోవడం అందుకు తోడ్పడింది. హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, కోటక్ బ్యాంక్ 1.24 శాతం వరకు లాభపడ్డాయి.



ఉక్కు అచ్చులపై యాంటీ-డంపింగ్ సుంకం

ట్రంప్ ప్రభుత్వ తాజా నిర్ణయం

వాషింగ్టన్: చైనా, భారతదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న స్టెయిన్‌లెస్ స్టీల్ అచ్చులపై కుమ్మరింత నిరోధక సుంకాన్ని విధించాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. రెండు దేశాలు ఎగుమతిదార్లకు సబ్సిడీలు సమకూరుస్తున్నాయని ప్రాథమిక దర్యాప్తులో తేలిన అనంతరం అది ఆ నిర్ణయానికి వచ్చింది. చైనా, భారతదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న చక్కనైన డెనియర్ పాలిస్టర్ స్టేపుల్ ఫైబర్‌పై అమెరికా జనవరిలో అలాగే యాంటీ-డంపింగ్ సుంకం విధించింది. ఈ రెండు దేశాలకు చెందిన ఎగుమతిదార్లు వరుసగా 41.73 నుంచి 47.55 శాతం, 9.50 నుంచి 25.28 శాతం సబ్సిడీలు పొందాయని వాణిజ్య శాఖ కనుగొనడంతో అమెరికా కుమ్మరింత నిరోధక సుంకాన్ని విధించింది.

చైనా, ఇండియాల ఎగుమతిదార్లు అమెరికాలో స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్లాంజీలను సముచితమైన ధరకన్నా తక్కువకి అమ్ముతున్నారని వాణిజ్య శాఖ కనుగొంది. చైనా సరసమైన ధరకన్నా 257.11 శాతం తక్కువకి, ఇండియా 18.10 నుంచి 145.25 శాతం తక్కువకి ఆ అచ్చులను విక్రయిస్తున్నట్లు మంగళవారం జారీయైన ఒక అధికారిక ప్రకటన వెల్లడించింది. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో, చైనా, ఇండియాల నుంచి స్టెయిన్‌లెస్ స్టీల్ అచ్చులను దిగుమతి చేసుకున్నవారి నుంచి ఈ ప్రాథమిక రేట్ల ఆధారంగా నగదు డిపాజిట్లు వసూలు చేయవలసిందని వాణిజ్య శాఖ అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్‌ను కోరింది. 2016లో చైనా నుంచి దిగుమతి చేసుకున్న అచ్చుల విలువ 16.3 మిలియన్ అమెరికన్ డాలర్ల మేరకు, ఇండియా నుంచి దిగుమతి చేసుకున్నవాటి విలువ 32.1 మిలియన్ అమెరికన్ డాలర్ల మేరకు ఉంటుందని అంచనా.

'అనుచిత సబ్సిడీలు'

కోర్ పైప్ ప్రొడక్ట్స్ ఇన్‌కార్పొరేటెడ్ (కరోల్ స్ట్రీమ్, ఐ.ఎల్), మాస్ ఫ్లాంగ్ కార్పొరేషన్ (హ్యూస్టన్)తో సహా కొయలిషన్ ఆఫ్ అమెరికన్ ఫ్లాంగ్ ప్రొడ్యూసర్స్ వేసిన పిటిషన్ మేరకు వాణిజ్య శాఖ ఈ ప్రాథమిక దర్యాప్తు చేపట్టింది. ''అనుచితమైన విదేశీ ప్రభుత్వ సబ్సిడీలు, డంపింగ్ ద్వారా మా దేశీయ వ్యాపారాలు ధ్వంసమవుతూంటే అమెరికా తాపీగా కూర్చుని చూస్తూ ఊరుకోబోదు'' అని అమెరికా వాణిజ్య మంత్రి విల్బర్ రాస్ అన్నారు. ''వ్యాపారాలను, కార్మికులను రక్షించేందుకు అమెరికన్ పరిశ్రమల తరపున ఈ ప్రభుత్వం ఈ సముచితమైన, పారదర్శకమైన చర్య తీసుకుంటోందిఈ నిర్ణయానికి సంబంధించిన వాస్తవాల సమీక్షను మేం కొనసాగిస్తాం'' అని ఆయన చెప్పారు. అమెరికా వాణిజ్య చట్ట అమలుపై ట్రంప్ ప్రభుత్వం ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. వాణిజ్య శాఖ 2017 జనవరి 20 నుంచి 2018 మార్చి 20 వరకు 102 యాంటీ-డంపింగ్, కౌంటర్‌వెయిలింగ్ డ్యూటీ ఇన్వెస్టిగేషన్లు చేపట్టింది. 2016 జనవరి 20 నుంచి 2017 మార్చి 20 వరకు ఇవి 96 శాతం పెరిగాయని, ఆ ప్రకటన తెలిపింది. అమెరికాలోకి అసమంజసమైన ధరలతో వచ్చిపడుతున్న దిగుమతుల హానికర ప్రభావాల నుంచి సహాయాన్ని అంతర్జాతీయ ఆమోదయోగ్య యంత్రాంగం ద్వారా అమెరికా వ్యాపార సంస్థలు, కార్మికులకు యాంటీ-డంపింగ్ చట్టం వీలు కల్పిస్తోంది. ''వాణిజ్య శాఖ ప్రస్తుతం 428 యాంటీ-డంపింగ్, కౌంటర్‌వెయిలింగ్ సుంక ఆదేశాలను నిర్వహిస్తోంది. అనుచిత వర్తక ప్రభావానికి గురైన అమెరికన్ కంపెనీలు, పరిశ్రమలకు అవి ఊరట కల్పిస్తున్నాయి'' అని ఆ ప్రకటన తెలిపింది. ఈ దర్యాప్తులపై తుది నిర్ణయాలను వాణిజ్య శాఖ 2018 జూన్ 5 ప్రాంతానికి వెలువరిస్తుందని అది వెల్లడించింది.

ESSAR

నుమిటల్, ఆర్సిలార్ బిడ్లు చెల్లవు


ముంబయి: ఎస్సార్ స్టీల్ స్వాధీనానికి నుమిటల్, ఆర్సిలార్ మిత్తల్ వేసిన బిడ్లు రెండింటినీ భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్.బి.ఐ) నేతృత్వంలోని రుణ దాతల కన్సార్టియం బుధవారంనాడు తిరస్కరించింది. సవరించిన ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టీ కోడ్ కింద అవి అనర్హమైనవి అవుతాయని పేర్కొంది. సంబంధిత పార్టీలు బిడ్డింగ్‌లో పాల్గొనకూడదని సవరించిన ఐ.బి.సి నిర్దేశిస్తోంది. ఎస్సార్ స్టీల్‌కు చెందిన రుణ దాతల కమిటీ (సీవోసీ) బుధవారం నాడిక్కడ జరిపిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ''ఐ.బి.సి.లోని సెక్షన్ 29 ఎ కింద అవి (నుమిటల్, ఆర్సిలార్‌మిత్తల్) అనర్హమైనవిగా తేలింది. సంతృప్తికరమైన అర్హతల వర్గంలోకి అవి రాలేదు. ప్రమోటర్లతోకానీ, సంబంధిత వ్యక్తులతోకానీ సంబంధాలున్నవారు బిడ్ చేయడానికి లేదు'' అని బ్యాంకింగ్ వర్గాలవారు తెలిపారు. పరిష్కారం కోసం ఎన్.సి.ఎల్.టి వద్ద ఎదురు చూస్తున్న ఉత్తమ్ గాల్వాతో సంయుక్త రంగంలో సంస్థ ఉన్నందున ఆర్సిలార్‌మిత్తల్ అనర్హమైనదిగా తేలింది. ఇక స్పెషల్ పర్పస్ వెహికల్ ప్రమోటర్లలో ఒకరు రేవంత్ రూయా కావడంతో నుమిటల్ బిడ్ చెల్లుబాటు కాలేదు. రేవంత్ ఎస్సార్ గ్రూప్ ప్రమోటర్ రవి రూయా కుమారుడు. ఎస్సార్ స్టీల్ ఒరిజినల్ ప్రమోటర్లలో రవి రూయా ఒకరు. ఎస్సార్ స్టీల్ 30 బ్యాంకర్లకు పైగా రూ. 45,000 కోట్లకు పైగా బకాయి పడింది. రెండవ విడత బిడ్డింగ్‌కి రుణ దాతలు ఏప్రిల్ 2ను చివరి తేదీగా నిర్ణయించారు. ప్రమోటర్లతో సంబంధాలను తెగతెంపులు చేసుకుంటే అనర్హమైనవిగా ముద్రపడిన రెండు కంపెనీలు మరోసారి బిడ్ చేయవచ్చని బ్యాంకర్లు తెలిపారు.

స్టార్టప్‌లతో చిక్కేమీ లేదు

జైపూర్: అన్ని స్టార్టప్‌లకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంది. కానీ, మార్కెట్ కొరవడడం, ఇతర అంశాల వల్ల వాటిలో 60 శాతం విఫలమవచ్చునని సమాచార సాంకేతిక పరిజ్ఞాన రంగ ప్రముఖుడు టి.వి. మోహన్‌దాస్ పాయ్ అన్నారు. భారతదేశంలో సుమారు 30,000 స్టార్టప్‌లు సుమారుగా మూడున్నర లక్షల నుంచి నాలుగు లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయని ఇన్ఫోసిస్ మాజీ డైరెక్టర్ అయిన పాయ్ చెప్పారు. ప్రతి ఏటా సుమారుగా 5 వేల నుంచి 6 వేల స్టార్టప్‌లు పుట్టుకొస్తున్నాయని అన్నారు. ''(ఈ మొలక సంస్థలలోకి) గత ఏడాది సుమారుగా 13.65 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఈరోజున అవి సుమారుగా 95 బిలియన్ డాలర్ల విలువను సృష్టించాయి'' అని పాయ్ అన్నారు. భారతదేశంలో 2025 నాటికి సుమారు 32 లక్షల మంది ఉద్యోగులతో లక్ష స్టార్టప్‌లు చురుకుగా పనిచేస్తూ ఉంటాయని ఆయన అంచనా వేశారు. కేంద్రం చేపట్టిన స్టార్టప్ ఇండియా విధానం, వివిధ రాష్ట్రాలు రూపొందించిన విధానాలు, ఐ.టి రంగ ప్రయత్నాలు, ఫ్లిప్‌కార్ట్ తదితర సంస్థలు సాధించిన విజయం మరింత మంది కొత్త సంస్థలను నెలకొల్పేందుకు, వ్యవస్థాపక సామర్థ్యాన్ని చాటుకునేట్లు పురికొల్పుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అన్ని స్టార్టప్‌లకు చక్కని భవిష్యత్తు ఉందని, కాకపోతే, సక్రమంగా పనిచేసినవారు సఫలమవుతారని ఆయన అన్నారు. ''కానీ, అంతరించిపోయే రేటు కూడా ఎక్కువే. వాటిలో సుమారు 60 శాతం విఫలం కావచ్చు. ఈ సంస్థల స్వభావమే అంత'' అని ఆయన అన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మొదటిసారి అవతరిస్తున్నవారు ఏర్పాటు చేస్తున్నవి కనుక, చాలా భాగం స్టార్టప్‌లు స్థాయిలను పెంచుకోలేకపోవచ్చు లేదా మార్కెట్ పొందలేకపోవచ్చని మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ చైర్మన్ అయిన పాయ్ అభిప్రాయపడ్డారు. ''వ్యాపారంలో ఎలా వ్యవహరించారో మొదటిసారి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అవుతున్నవారికి తెలియకపోవచ్చు. కానీ, శుభవార్త ఏమంటే, వారు విఫలమైనా ఫరవాలేదు. ఒక వ్యాపారాన్ని నిర్మించడంలో పొందిన అనుభవం వల్ల, లేదా సమస్యల పరిష్కర్తగా పరిణమించడం వల్ల ఒనగూడే ప్రయోజనం అపారమైంది'' అని ఆయన అన్నారు.

'జైట్లీని రాయ్ కలుస్తూనే ఉన్నారు'


న్యూఢిల్లీ: బ్యాంక్ బోర్డ్స్ బ్యూరో (బి.బి.బి) చైర్మన్ వినోద్ రాయ్‌ని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అనేక సందర్భాలలో కలుసుకుని, బి.బి.బి పనితీరు, బ్యాంకింగ్ సంస్కరణల గురించి చర్చించారు. వారిద్దరి మధ్య కడపటి సమావేశం ఈ నెల మొదట్లో జైట్లీ నివాసంలో, వారాంతంలో చోటుచేసుకుంది. ప్రభుత్వ యాజమాన్య బ్యాంకుల్లో సంస్కరణలకు సిఫార్సులు చేస్తూ బి.బి.బి 60 పేజీల నివేదికను తయారు చేసింది. కేంద్రం తన సూచనలపై ఏ నిర్ణయం తీసుకోకుండా అలా పెట్టుకు కూర్చుందని బి.బి.బి సోమవారం నాడు పేర్కొంది. కమ్యూనికేషన్‌కు విఘాతం ఏర్పడిందని రాయ్ ఆరోపించారు. ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఫైనాన్షియల్ సర్వీసుల శాఖ నుంచి తన సలహాలపై ఉలుకుపలుకు లేదని, జైట్లీతో సమావేశాన్ని కోరుతూ 2017 జూలై 26న పంపిన అభ్యర్థన ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉందని కూడా ఆయన ఆరోపించారు. అందులో వాస్తవం లేదని సీనియర్ ప్రభుత్వ వర్గాలవారు అంటున్నారు. ఈ ఆరోపణలపై త్వరలో స్వయంగా జైట్లీయే స్పందిస్తారని వారు చెబుతున్నారు. ''బి.బి.బి నివేదికలో ప్రస్తావించిన తేదీ (జూలై 26) తర్వాత, ఆర్థిక మంత్రి, బి.బి.బి చైర్మన్ అనేక సందర్భాలలో అధికారికంగా, ఇష్టాగోష్ఠి పూర్వకంగా కలుసుకున్నారు. బ్యాంకింగ్ సంస్కరణలు, బి.బి.బి పనితీరు గురించి ఇద్దరి మధ్య చర్చలు సాగాయి'' అని ఒక అధికారి వివరించారు.



బి.బి.బి చేసిన సిఫార్సుల గురించి చర్చించేందుకు రాయ్‌ని, బి.బి.బి.లోని ఇతర సభ్యులని డి.ఎఫ్.ఎస్ కార్యదర్శి రాజీవ్ కుమార్ కూడా కలుసుకున్నారని ఆ అధికారి తెలిపారు. బి.బి.బి సిఫార్సులపై నియత మార్గాల గుండా డి.ఎఫ్.ఎస్ స్పందించిందని మరో అధికారి కూడా ధ్రువీకరించారు. ఆ చర్చల స్వరూప స్వభావాల గురించి మరిన్ని వివరాలను మాత్రం ఆ అధికారి వెల్లడించలేదు. 'సిఫార్సుల సంకలనం' శీర్షికతో ఉన్న బి.బి.బి. నివేదికను పబ్లిక్ డొమైన్‌లో ఉంచారు. బి.బి.బి సభ్యుల పదవీ కాలం మార్చి 31న ముగుస్తుందనగా, కేవలం 10 రోజుల ముందు దాన్ని పబ్లిక్ డొమైన్‌లో ఉంచారు. బ్యూరో గత రెండేళ్లుగా చేసిన పనిని అది వెల్లడిస్తోంది. జాతీయ ప్రజాస్వామిక కూటమి (ఎన్.డి.ఏ) ప్రభుత్వానికి, బి.బి.బి.కి మధ్య కమ్యూనికేషన్ విఘాతం ఏర్పడిందని రాయ్ ఆ నివేదికలో పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పాలనాపరమైన సంస్కరణలు ఆవిష్కరించేందుకు మాజీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ అయిన రాయ్ నేతృత్వంలో 2016 ఫిబ్రవరిలో బి.బి.బి.ని నెలకొల్పారు. జైట్లీకి జూలై 26న రాసిన లేఖలోని ముఖ్యాంశాలను కూడా రాయ్ ఆ నివేదికలో ప్రస్తావించారు. వివిధ అంశాలపై చర్చించేందుకు మంత్రితో సమావేశాన్ని కోరుతూ ఆ లేఖ రాశారు. ''ప్రభుత్వానికి, బ్యూరోకి మధ్య సహజసిద్ధమైన సంబంధాల'' అవసరం ఉందన్నది ఆ అంశాల్లో ఒకటి. ''(ఆర్థిక మంత్రితో) సమావేశం కోసం బ్యూరో ఎదురు చూస్తూనే ఉంది'' అని రాయ్ నివేదికలో అధోజ్ఞాపికగా పేర్కొన్నారు. నియామకాలలో సంస్కరణలు, పరిహారం, పనితీరు మదింపు, పాలనలపై ఏడాది క్రితం చేసిన సిఫార్సులపై ఫైనాన్షియల్ సర్వీసుల శాఖ ఏమనుకుంటున్నదీ ఇంతవరకు తెలియరాలేదని బి.బి.బి. పేర్కొంది. బ్యాంకింగ్ నియంత్రణలను స్వతంత్రంగా తీసుకునే వీలు కల్పించాలని రాయ్ ఆ నివేదికలో కోరారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ. 129 బిలియన్ల కుంభకోణం వెలుగు చూసిన నేపథ్యంలో కొద్ది రోజుల కిందట ఆర్.బి.ఐ గవర్నర్ ఊర్జిత్ పటేల్ కూడా అదే రకమైన అభిప్రాయాన్ని బాహాటంగా వ్యక్తపరిచారు.

ముందు రిఫండు...తర్వాత ఫ్లాట్ల అప్పగింత

రూ. 200 కోట్లు డిపాజిట్ చేయాలని జైప్రకాశ్ అసోసియేట్స్‌కు సుప్రీం కోర్టు ఆదేశం



న్యూఢిల్లీ: సమస్యలతో సతమతమవుతున్న సంస్థ జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్)ను మే 10వ తేదీకల్లా రెండు విడతల్లో రూ. 200 కోట్లు డిపాజిట్ చేయవలసిందిగా సుప్రీం కోర్టు బుధవారంనాడు ఆదేశించింది. ఏప్రిల్ 6కల్లా రూ. 100 కోట్లు, మిగిలిన మొత్తం మే 10వ తేదీ నాటికి డిపాజిట్ చేయవలసిందిగా ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా అధ్యక్షతనగల ధర్మాసనం ఆ రియల్ ఎస్టేట్ అగ్ర సంస్థను కోరింది. రిఫండు కోరిన గృహ కొనుగోలుదార్లకు నెలవారీ వాయిదాల (ఇ.ఎం.ఐ) చెల్లింపులను ఎగవేశారంటూ ఎలాంటి నోటీసులు పంపకూడదని కూడా న్యాయమూర్తులు ఎ.ఎం. ఖాన్విల్కర్, డి.వై. చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం కోరింది. రిఫండు కోరిన గృహ కొనుగోలుదార్ల ప్రాజెక్టువారీ చార్టును సమర్పించవలసిందని, అప్పుడు నగదును నిష్పత్తి ప్రాతిపదికన పంపిణీ చేయవచ్చని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. ''ప్రస్తుతం మేం రిఫండు పైనే దృష్టి కేంద్రీకరించాం. ఫ్లాట్ల డెలివరీ కోరుతున్న గృహ కొనుగోలుదార్ల లేవనెత్తిన అంశాన్ని తర్వాత పరిశీలిస్తాం'' అని కోర్టు తెలిపింది. కాగా, 31,000 మంది గృహ కొనుగోలుదార్లలో ఎనిమిది శాతం మంది మాత్రమే రిఫండు కోరారని, మిగిలినవారు ఫ్లాట్లనే అడుగుతున్నారని ఉన్నత న్యాయస్థానానికి జేఏఎల్ తెలియజేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకు 13,500 ఫ్లాట్లకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్లు కోరుతున్న అభ్యర్థనలు అందాయని సంస్థ కోర్టుకు తెలిపింది. గృహ కొనుగోలుదార్ల ప్రయోజనాలను సంరక్షించేందుకు సుప్రీం కోర్టు సూచన మేరకు సంస్థ జనవరి 25న రూ. 125 కోట్లను డిపాజిట్ చేసింది. గృహ కొనుగోలుదార్లకు ఇళ్ళు కట్టి అప్పగించండి లేదా వారు కట్టిన సొమ్మును తిరిగి ఇవ్వండి అంటూ దేశంలో చేపట్టిన గృహ నిర్మాణ ప్రాజెక్టుల వివరాలు సమకూర్చవలసిందిగా జేపీ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ (జేఐఎల్) హోల్డింగ్ సంస్థ అయిన జేఏఎల్‌ను జనవరి 10న ఆదేశించింది. జేఏఎల్‌పై నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్.సి.ఎల్.టి) ఎదుట దివాలా ప్రొసీడింగులకు శ్రీకారం చుట్టేందుకు అనుమతి కోరుతూ, ఈ కేసును సత్వరం విచారించే విధంగా ప్రాధాన్యం కల్పించవలసిందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ చేసిన అభ్యర్థనను సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఆ అంశాన్ని తదుపరి దశలో పరిశీలిస్తామని చెప్పింది. దాదాపు 32,000 మంది ఫ్లాట్లు బుక్ చేసుకున్నారని, ఇప్పుడు వాయిదాలు కూడా చెల్లిస్తున్నారని చిత్రా శర్మతో సహా గృహ కొనుగోలుదార్లు కొందరు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఐ.డి.బి.ఐ బ్యాంకు నుంచి తీసుకున్న రూ. 526 కోట్ల రుణాన్ని జేఏఎల్ ఎగవేసింది. అప్పుల ఊబిలో కూరుకున్న ఆ సంస్థపై దివాలా ప్రొసీడింగులు చేపట్టాలని ఐ.డి.బి.ఐ. బ్యాంకు చేసిన అభ్యర్థనను గత ఏడాది ఆగస్టు 10న ఎన్.సి.ఎల్.టి మన్నించడంతో గృహ కొనుగోలుదార్లు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

మనం పర్యాటకం
గురువారం, 22 మార్చి 2018
www.manamnews.com



చుట్టూ సముద్రపు కెరటాల హొయలు. మధ్య మధ్యలో పచ్చని ప్రకృతి అందాల నడుమ ఇసుకుతిన్నెల మెరుపులు. జనసంచారం తక్కువగా కనిపించే ఎన్నో ఆకర్షణీయమైన ప్రదేశాలు. చారిత్రక నేపథ్యం ఉన్న కట్టడాలు. ఉప్పునీటి అడుగున కనిపించే ఎన్నో జీవరాశులు. ఇవన్నీ చూడాలంటే అండమాన్ దీవులకు వెళ్లాల్సిందే! ఈ అందమైన దీవులను చూసేందుకు ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఎందరో ఔత్సాహిక పర్యాటకులు పెద్దఎత్తున వస్తుంటారు. చెన్నై నుంచి సముద్ర మార్గంలో సుమా రుగా 1800 కిలోమీటర్లు దూరంలో అండమాన్ దీవులు ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న ఈ దీవుల చరిత్ర, అక్కడి ప్రకృతి పర్యాటక విశేషాలు మీకోసం!!

అండమాన్ అందాలు



సరదాగా ఎక్కడికైనా కుటుంబ సమేతంగా వెళ్లాలని నిర్ణయించుకున్నాం. అందుకోసం అండమాన్ నికోబార్ దీవులను ఎంపిక చేసుకున్నాం. ఓ ప్రైవేటు టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా ఐదురోజుల పాటు అక్కడ సందర్శనకు ప్లాన్ చేశాం. ఉదయాన్నే అనంతపురం నుంచి బెంగళూరుకు చేరుకున్నాం. అక్కడి కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో 11.30 గంటలకు విమానం ఎక్కి, రెండు గంటల సమయంలో పోర్ట్ బ్లెయిర్ ప్రాంతంలోని విమానాశ్రయం చేరుకున్నాం. విమానాశ్రయానికి ఒకటిన్నర కిలోమీటర్లు దూరంలోని ఓ త్రీస్టార్ హోటల్లో బస చేశాం. ఓ గంట విశ్రాంతి అనంతరం పోర్ట్ బ్లెయిర్‌లో ఉన్న కార్బైన్స్ కేవ్‌బీచ్‌ను సందర్శించి, సుదీర్ఘమైన సముద్రతీరం వెంబడి వెళ్ళి సెల్యులార్ జైలును సందర్శించాం. అక్కడి స్వాతంత్ర్య సమరయోధుల వీరగాథలను తెలుసుకున్నాం.







స్వాతంత్ర్యానంతరం సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో ఫోర్‌ప్లే ప్రాంతంలో సెల్యులార్ జైలులో ఫ్రీడమ్ ఫైటర్లు ఉండడానికి అనుకూలంగా దీనిని మార్చారట! ఈ ప్రాంతంలో సుభాష్‌చంద్రబోస్ ప్రతిమలు, భారతీయ జెండాలు ఎక్కడ చూసినా కనిపిస్తాయి.

పోర్టు బ్లెయిర్

అండమాన్ దీవులలో జనసంచారం బాగానే ఉంది. అండమాన్ ఐలాండ్ ప్రజలు తీరానికి అతి సమీపంలో నివాసం ఉంటారు. అయితే, నికోబార్ దీవులలో మాత్రం మిలిటెంట్లు మాత్రమే ఉంటారు. ఈ ప్రాంతంలో చొరబాటుకు అవకాశం ఉండటంతో మిలిటరీ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. మాల్దీవులు శ్రీలంకకు ఆనుకుని ఉంటాయి. మరుసటిరోజు హావలక్ ద్వీప తీరం, సముద్రపు అంచున కట్టబడిన రిసార్టులు, వందేళ్లకు పైన చరిత్ర కలిగిన చెట్లతో నిండిన అరణ్యాలు, సుప్రసిద్ధమైన రాధానగర్ బీచ్ సందర్శించాం. మూడవ రోజు ఎలిఫెంట్ బీచ్, పక్క ప్రాంతాలు, నాల్గవ రోజు రాజీవ్‌గాంధీ క్రీడా ప్రాంగణం, కారల్ దీవిలో సముద్ర అడుగుభాగంలో చేసిన ప్రయాణం జీవితంలో మర్చిపోలేం. అక్కడికి దగ్గరలో ఉంది రోస్ ఐలాండ్. ఈ దీవిలో పోలీసుల పర్యవేక్షణలో జెట్టీలు నడప బడతాయి. ఈ దీవిలో తమ పరిపాలన సాగించటానికి కేంద్రంగా ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడి నుంచి బ్రిటీష్ వారు సెల్యులార్ జైలు నిర్మాణాన్ని పర్యవేక్షించేవారని స్థానిక గైడ్ వివరించారు. ఇటీవల సునామీ వచ్చిన సమయంలో పోర్టు బ్లెయిర్ ఈ దీవే కాపాడిందని చెప్పారు. ఈ దీవి లేకుంటే అండమాన్‌లోని ప్రముఖ ప్రాంతాలు సునామీలో కలిసిపోయి ఉండేవట! అలాగే, రోస్ ఐలాండ్ బ్రిటీష్ కాలంలో వారి పరిపాలనా కేంద్రాలలో ఒకటి. ఇదీ ప్రస్తుతం పోలీసుల పర్యవేక్షణలోనే ఉంది.

కెరటాల హొయలు

గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డులో గుర్తింపు పొందిన హావలక్ రాధానగర్ బీచ్, మెయిల్ ఐలాండ్, ఫోర్‌ప్లే ఒక్కొక్కటిగా చుట్టేశాం. ఎక్కడి నుంచి చూసినా కనిపించే ఇసుక తిన్నెలు, చెవులకు ఇంపుగా వినిపించే అలల హోయలు మమ్మల్ని ఎంతగానో ఆకర్షించాయి. అండమాన్ దీవులలో ప్రధానంగా ఎనిమిది దీవులను సందర్శకులు వీక్షించేందుకు అనుకూలంగా ఉంటాయి. విమానమార్గంలో అయితే వీక్షకులు ఫోర్ ప్లే ప్రాంతానికి చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి దీవులను చూసేందుకు షిప్పులు, ఎసి ఫెరీస్‌లు అందుబాటులో ఉంటాయి. ఫెరీస్‌లో 200 మందికి పైగా ప్రయాణం చేయవచ్చు. అండమాన్ దీవులలో నెయిల్, హావలక్, రాజ్ ఐలాండ్, నార్త్ బే, జాలిబారు ఐలాండ్, బ్రదర్స్ అండ్ సిస్టర్స్, సెల్లార్ జైల్, జపాన్ బాంబింగ్ పాయింట్, క్యూబా అండర్ సీవాక్, అక్వేరియం మ్యూజియం, భారాతంగ్ ప్రాంతాలను పెద్దఎత్తున వీక్షకులు సందర్శిస్తారు. భారాతంగ్ ప్రాంతంలో అగ్ని పర్వతం ఉంది. మిలిటరీ అనుమతి మేరకు దూరం నుంచి ఈ పర్వతాన్ని తిలకించవచ్చు.

వివిధ రకాల ప్యాకేజీలు

అండమాన్ దీవులను సందర్శించటానికి అనేక ప్రముఖ ట్రావెలింగ్ సంస్థలు ప్యాకేజీలను అందుబాటులో ఉంచాయి. అంతర్జాలం ద్వారా ఆయా సంస్థల వెబ్‌సైట్లను సందర్శించి, ప్యాకేజీలను బుక్ చేసుకోవచ్చు. నాలుగు రాత్రులు, ఐదు పగళ్ళు, పది పగళ్లు, పదకొండు రాత్రులు ఇలా అనేక ప్యాకేజీలు ఉన్నాయి. ప్రయాణంతో పాటు విడిది, ఆహారం ఇలా అన్ని విషయాలనూ ఆ సంస్థలే చూసుకుంటాయి. నేరుగా వెళ్లదలిచే వారికి విడిది కోసం ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. దీవులలో అనేకమైన స్టార్ విడిది గృహాలు, రెస్టారెంట్లు, హోటళ్ళు సాధారణ ధరల్లో అందుబాటులో ఉంటాయి. అలాగే, ఈ దీవులలో నార్త్, సౌత్, చైనీస్, జపనీస్ వంటి అనేకరకాల వంటకాలు అందుబాటులో ఉంటాయి. బెంగాలీ, మలయాళం, తమిళం, ఆంధ్రా ప్రాంతాల నుంచి ఎక్కువమంది ప్రజలు సందర్శన కోసం వస్తుంటారు.

ఎప్పుడెప్పుడు వెళ్లాలి?

అండమాన్ దీవులకు సాధారణంగా వర్షాకాలంలో తప్ప ఎప్పుడైనా వెళ్లొచ్చు. జనవరి నుంచి మే చివరకు,



జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలలో ఈ దీవులు రద్దీగా ఉంటాయి. అలాగే, ఈ కాలంలో ప్యాకేజీ ధరలు అధికంగా ఉంటుంది. ప్యాకేజీల ద్వారా సాధారణంగా టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా ఐదు రోజుల ప్యాకేజీకి ఒక్కో మనిషికి రూ.20 వేల వరకూ ఖర్చవుతుంది. అమేజింగ్ అండమాన్ కోరల్ టూర్స్ అండ్ ట్రావెల్స్, మేక్ మై ట్రిప్, దామస్‌కుక్, యాత్ర.కామ్ తదితర అనేక టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థలు అందుబాటులో ఉన్నాయి.



చల్లచల్లని ప్యాంట్

దూరప్రయాణాలపై మమకారం ఉన్న కుర్రకారు ఇంట్లో ఖాళీగా కూర్చోరుగా! కశ్మీర్, ఊటీ, కన్యాకుమారి, గోవా.. ప్రాంతం ఏదైనా దేశమంతా తిరుగుతూనే ఉంటారు. తీవ్రమైన చలి, భరించలేనంత ఎండ, కుండపోత వర్షం.. ఒక్కోచోట భిన్నమైన వాతావరణ పరిస్థితి. అన్నీ తట్టుకోవాలంటే బైకర్లు వేసుకునే దుస్తులు సైతం భిన్నంగా ఉండాల్సిందే. అచ్చంగా ఇలాంటివారి కోసమే స్కాట్ కాన్సెప్ట్ 'వీటీడీ ప్యాంట్'లు మార్కెట్లోకి వచ్చాయి. చలి ప్రదేశాల్లో వెచ్చగా ఉండటం.. వేడిగా ఉన్నపుడు ఒంటికి చల్లదనం ఇవ్వడం ఈ ప్యాంట్ ప్రత్యేకత. నైలాన్, డ్యూరబుల్ వాటర్ రెపెల్లెంట్ కోటింగ్ ఫ్యాబ్రిక్‌తో తయారు చేశారు. రైడింగ్‌లో ఉన్నపుడే కాదు.. మామూలు సందర్భాల్లో కూడా వీటిని ధరించవచ్చు.



పర్యాటకం ఇక సులువు

ఏదైనా టూర్‌కు వెళ్లాలంటే ఎన్నో ప్లాన్ చేసుకోవాలి. ఎక్కడ దిగాలి, వసతి సౌకర్యాలు ఎక్కడ బాగుంటాయి. రవాణా సదుపాయాలు ఎలా ఉంటాయి ఇలా అనేక విషయాలను తెలుసుకోవాలి. అయితే కొన్నిసార్లు ప్లాన్ చేసుకున్నా చూడాల్సిన ప్రదేశాలకు ఎలా వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతుంటాం. అలాంటప్పుడు చేతిలో మ్యాప్ ఉంటే చేరాల్సిన చోటుకు ఎలా చేరుకోవాలో సులువుగా తెలుసుకోవచ్చు. అలా అని మ్యాప్ చేత్తో పట్టుకుని తిరగాల్సిన అవసరం లేదు. స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు. మ్యాప్స్ అందించే అప్లికేషన్లు చాలానే ఉన్నా గూగుల్ మ్యాప్స్ బెస్ట్ ఆప్షన్. మీ స్మార్ట్‌ఫోన్‌కు ఇంటర్నెట్ కనెక్టివిటీ తప్పనిసరిగా ఉండాలి. అయితే మీరు సందర్శించాలనుకుంటున్న ప్రాంతాలకు సంబంధించిన మ్యాప్‌లను ముందుగానే ఇన్‌స్టాల్ చేసుకుంటే ఇంటర్నెట్ కనెక్టివిటీ లేకుండానే అవసరమైనప్పుడు ఉపయోగించుకోవచ్చు. హాలిడేస్ టూర్ వెళ్లాలనుకుంటున్నారు కానీ, ఎక్కడికి వెళ్లాలో అర్థం కావడం లేదా.. అలాంటప్పుడు యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోండి. మీ బడ్జెట్, మీకున్న ఆసక్తి, ఇతర అంశాల ఆధారంగా సులువుగా ట్రావెల్ ప్లాన్ చేసుకోవచ్చు. ఇందులో ట్రావెలర్స్ రివ్యూలను చదవొచ్చు. ట్రావెల్ బ్రోచర్స్ కావాలన్నా పొందొచ్చు. పర్యాటక ప్రాంతాలను సందర్శించిన వారి అభిప్రాయాలను తెలుసుకోవడం వల్ల ఆ ప్రదేశాలపై త్వరగా అవగాహనకు రావడం సాధ్యమవుతుంది.



సముద్రంలో సాహసాలు

కొందరు టూర్‌కు వెళ్లారంటే చాలు నానా హంగామా చేస్తారు. వీలైనంత ఎంజాయ్ చేస్తారు. ముఖ్యంగా సాహసాల్ని ఇష్టపడేవారు ఎక్కువగా అడ్వెంచర్ ప్లేస్‌లను ఎంచుకుంటారు. వారిలో కొందరు ట్రెక్కింగ్‌ను ఇష్టపడితే, మరికొందరు సముద్రంలో సాహసాలు చేస్తుంటారు. ఇలాంటివారికి గోవాలోని బనానా రైడ్ బాగా సరిపోతుంది. ఎక్కువగా బ్యాచిలర్స్ గోవా ట్రిప్‌ను ప్లాన్ చేస్తుంటారు. అక్కడికెళ్లి బీచ్ అందాల్ని, గోవా కల్చర్‌ను ఎంజాయ్ చేయటంతో పాటు వీలైతే బనానా రైడ్ చేయండి. అందులో మజా ఉంటుంది. లైఫ్ జాకెట్స్ ధరించి బనానా బోట్‌పై కూర్చుంటే చాలు మరో బోట్ దీన్ని లాక్కెళుతుంది. సముద్రం అలలకు ఎదురుగా వెళుతూంటే ఆ ఎంజాయే వేరు. అది మాటల్లో చెప్పలేని అనుభూతి. బనానా రైడ్ ధర అందరికీ అందుబాటులోనే ఉంటుంది. అందుకే ఈసారి స్నేహితులతో కలిసి గోవా వెళ్లినపుడు బనానా రైడ్ వెళ్లటం మర్చిపోకండి.



బ్యాగ్ ప్యాకింగ్ టిప్స్

కొందరు మాన్‌సూన్ సమయంలోనే టూర్‌ప్లాన్ చేస్తుంటారు. చిరుజల్లుల స్నేహంతోనే ముందుకు సాగుతుంటారు. జలపాతాలు, నదులు, పచ్చని ప్రకృతిని తిలకించటానికి వెళ్లే వారు బ్యాక్‌ప్యాకింగ్ ట్రిప్‌కే ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. సులువుగా, ఏ బరువూ లేకుండా ట్రావెలింగ్ ఇలా చేయచ్చు. బడ్జెట్ ఫ్రెండ్లీ పర్యాటక స్థలాలకు మనదేశంలో కొదువేలేదు. ముందు వెళ్లాల్సిన ప్రాంతం ఎంచుకోవాలి. ట్రావెలింగ్ కోసం ఎక్కువ బరువును ప్యాక్ చేసుకోవటం మీకే ఇబ్బంది. అందుకే రెండు, మూడు జతల దుస్తులు, షూస్, ఫస్ట్ ఎయిడ్ కిట్ బ్యాగ్.. వాటితో పాటు వర్షాకాలం వేసుకునే తేలికపాటి దుస్తులు బ్యాగ్‌లో ఉంచుకోవాలి. ప్రయాణానికి ముందే మీరు టూర్ వెళ్లే ప్రాంతంలో తక్కువ దొరికే హోటల్‌ను బుక్ చేసుకోవాలి. బయట ఫుడ్ వద్దనుకుంటే ఎంచక్కా హోటల్‌లోనే మనం వండుకునే ఫెసిలిటీ ఉంటుంది. అలాంటి హోటల్ ఆ ప్రాంతంలో దొరికితే బుక్ చేసుకోవాలి. విమానాల్లో వెళ్లటం, క్యాబ్స్‌లో వెళ్లటం వల్ల ఖర్చు ఎక్కువ అవుతుంది. అందుకే ఎంచక్కా బస్సు లేదా రైలులో ప్రయాణించటం మంచిది. ప్రయాణ ఖర్చు తగ్గించుకుంటే ఆ డబ్బును టూర్‌కు వెళ్లిన ప్రాంతాల్లో ఇతర పనులకు ఉపయోగించు కోవచ్చు. టూర్‌కు వెళ్లి ప్రతిరోజూ క్యాబ్స్‌లో తిరగటం కంటే లోకల్ బస్సులు, ట్రైన్లలో ప్రయాణించటం మంచిది. ఇలా చేస్తే రకరకాల మనుషులతో పాటు కల్చర్స్ గమనించవచ్చు. టూర్‌ను ఎంజాయ్ చేశామనే ఫీలింగ్ కూడా కలుగుతుంది.

టూర్స్‌తో హ్యాపీ

కొందరికి వ్యాయామం చేస్తే మూడ్ మారుతుంది. ఇంకొందరికి షాపింగ్ చేస్తే మంచి హుషారొస్తుంది. కానీ ఇవేవీకాకుండా ట్రావెల్ చేస్తేనే మూడ్ మంచి స్వింగ్‌లోకి వస్తుందంటున్నారు పరిశోధకులు. ఇటీవల జరిపిన ఒక అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. హాలిడే ఉన్న రోజున లేక వీకెండ్‌లో ఎక్కడికైనా టూర్ పెట్టుకుంటే మనసుకు ప్రశాంతంగా ఉంటుందట. వ్యాయామం చేయడం, షాపింగ్ చేయడం కన్నా తమకిష్టమైన ప్రదేశాలను చుట్టి రావడం వల్ల హ్యాపీగా ఫీలవుతారట. అధ్యయనంలో భాగంగా 1,005 మందిని పరిశీలించారు. అందులో 38 శాతం పురుషులు, 34 శాతం మంది స్త్రీలు తమకిష్టమైన ప్రదేశాలకు వెళ్లినపుడు వాళ్ల మూడ్‌లో ఎంతో మార్పు వస్తుందని చెప్పారు. ఇలాంటి సంతోషం మరెందులోనూ లభించదని అన్నారు. ట్రావెలింగ్‌లో ఎండకు ఎక్కువ ఎక్స్‌పోజర్ అయ్యే అవకాశాలు ఉంటాయి కాబట్టి వారిలో మూడ్‌ను బూస్ట్ చేసే సెరటోనిన్ హార్మోన్ ఉత్పత్తి అధికంగా అవుతుందట. ట్రావెలింగ్ వల్ల హెల్త్ ఇంప్రూవ్ కావడమే కాకుండా బరువు తగ్గడం, ఆత్మవిశ్వాసం కూడా మెరుగుపడుతుందట.





ఇద్దరు కెప్టెన్లతోనే ప్రారంభ వేడుక

ఐపీఎల్-11లో కొత్త సాంప్రదాయం

ముంబాయి : ఈ ఏడాది ఐపీఎల్ ప్రారంభ వేడుకల్లో ఇద్దరు కెప్టెన్లు మాత్రమే కనిపించబోతున్నారు. ఇప్పటి దాకా ఐపీఎల్ ఓపెనింగ్ వేడుకలో ఎనిమిది ఫ్రాంచైజీలకు చెందిన కెప్టెన్లు కనిపించేవారు. కానీ ఈ ఏడాది మాత్రం కేవలం ఇద్దరు కెప్టెన్లతోనే ఐపీఎల్ ఆరంభ వేడుక జరుగనుంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ ఏడాది తొలి మ్యాచ్‌కి ముందే ఐపీఎల్ ఆరంభ వేడుకలు జరుగనున్నాయి. ఏప్రిల్ 7న వాంఖడే స్టేడియం వేదిక ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్ మధ్య జరిగే తొలి మ్యాచ్‌కి ముందు ఈ వేడుక చేసేందుకు ఐపీఎల్ పాలక మండలి సిద్ధమైంది. అయితే కొందరు బీసీసీఐ సీనియర్ అధికారుల అలసత్వం కారణంగా ఎనిమిది మంది కెప్టెన్లు సరైన సమయంలో అక్కడకి చేరుకోలేకపోతున్నారు. ఇందుకోసం ఎనిమిది మంది కెప్టెన్లతో కలిసి ఏప్రిల్ 6వ తేది సాయంత్రం ఓ వీడియోని చిత్రీకరించనున్నారు. గత ఏడాది వరకూ ఆరంభ వేడుకల్లో ఎనిమిది మంది కెప్టెన్లు పాల్గొని 'స్పిరిట్ ఆఫ్ క్రికెట్ గురించి ప్రతిజ్ఞ చేసేవారు. కానీ ఈ ఏడాది మాత్రం ముంబై కెప్టెన్ రోహిత్, చెన్నై కెప్టెన్ ధోనీ మాత్రమే ఇందులో పాల్గొననున్నారు. ఏప్రిల్ 8న మొహాలీలో ఢిల్లీ, పంజాబ్ మ్యాచ్ సాయంత్రం నాలుగు గంటలకు, కోల్‌కతా, బెంగూళరు మధ్య కోల్‌కతాలో మ్యాచ్ రాత్రి ఎనిమిది గంటలకు జరుగనుంది. దీనిపై బీసీసీఐ అధికారు ఒకరు మాట్లాడుతూ.. ''ఐపీఎల్ టీం సరిగ్గా పని చేయడంలో విఫలమైంది. అశ్విన్, గంభీర్‌లను మ్యాచ్ ముందు రోజు మధ్యాహ్నం ముంబై రావాలని అహ్వానిస్తున్నారు. ఒకవేళ వాళ్లు ఆరంభ వేడుకలకు వస్తే.. వాళ్లు 7వ తేది రాత్రి 9 గంటలకు ఫ్లైట్ ఎక్కాల్సి ఉంటుంది. అది మిస్ అయితే.. వాళ్లు రోడ్డు మార్గం ద్వారా ఢిల్లీ చేరుకోవాల్సి వస్తుంది. సాయంత్రం 4గంటలకు మ్యాచ్ ఉండగా వాళ్లు రోడ్డు ప్రయాణంచేయడం ఎంతో ప్రమాదకరం. కోహ్లీ, దినేశ్ కార్తీక్‌ల పరిస్థితి కూడా అంతే.. వాళ్లకి ఎనిమిది గంటలకు మ్యాచ్ ఉంది. ఇది పూర్తిగా అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగింది'' అని పేర్కొన్నారు.



అదే అతిపెద్ద పొరపాటు

ఫైనల్లో ఆటతీరుపై మౌనం వీడిన విజయ శంకర్

ముంబాయి : కొలంబోలో బంగ్లాదేశ్‌తో గత ఆదివారం జరిగిన ట్రై సిరీస్ ఫైనల్లో చివరి బంతికి కొట్టిన సిక్స్‌తో భారత్‌ను గెలిపించిన దినేశ్ కార్తీక్‌పై ప్రశంసల జల్లు కురిసింది. అయితే అదే మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ ఆటతీరుపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫైనల్లో విజయ్ శంకర్ ప్రదర్శించిన ఆటతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న శంకర్ తన ఇన్నింగ్స్‌పై మౌనం వీడాడు. చివరి మూడు ఓవర్లలో భారత జట్టు విజయానికి 35 పరుగులు చేయాల్సి ఉండగా, ఈ తరుణంలో వరుసగా నాలుగు బంతుల్ని విజయ్‌శంకర్ వృధా చేశాడు. దీంతో భారత్ ఓటమి ఖాయమైపోయిందనుకున్నారు. అనూహ్య రీతిలో చివరి బంతికి సిక్స్ కొట్టి దినేశ్ కార్తీక్ భారత్‌ను గెలిపించినప్పటికీ విజయ్‌శంకర మాత్రం అభిమానుల మదిలో విలన్‌గానే ఉండిపోయాడు. ఆ ఐదు బంతుల్లో పరుగులు చేయకపోవటంపై ఇప్పటికీ నేను బాధపడుతూనే ఉన్నానని, అదే నా అతి పెద్ద పొరపాటు. మ్యాచ్ ముగించే అవకాశం అరుదుగా వస్తుందని, తాను మ్యాచ్‌ను ఫినిష్ చేయలేక పోయానని విజయ్‌శంకర అంగీకరించాడు. ఒత్తిడికి మానసికంగానే సిద్ధమయ్యానని అయితే ఒత్తిడిని ఎదుర్కొన లేకపోయానని చెప్పాడు. ఇక ఆ మ్యాచ్‌లో విజయ్ శంకర్ ఇనింగ్స్‌పై సోషల్ మీడియాలో రకరకాల కామెంట్లు వెలువెత్తుతున్నాయి. అభిమానులు సోషల్ మీడియాలో విజయ్‌శంకర్‌ను తెగ తిట్టిపోస్తున్నారు. అయితే అభిమానుల ఆగ్రహం కన్నా తల్లిదండ్రులు, బంధువుల నుంచి సానుభూతి వ్యక్తమవుతోంది. అభిమానుల విమర్శల కన్నా.. సానుభూతి మాటలు విజయ్‌ను తెగ ఇబ్బందిపెడుతున్నాయి. 'నేను ఆమ్యాచ్‌ను మరచి పోదామనుకుంటున్నా.. ఈ సానుభూతి నన్ను ఆ పని చేయనివ్వటం లేదు, ఈ సింపతీని తట్టుకోలేక పోతున్నా' అని విజయ్ శంకర్ అన్నాడు. అయినా భారత జట్టుకు ఆడే సమయంలో ఇలాంటి తిట్లు భరించాల్సిందేనని అంగీకరించాడు. ఆ మ్యాచ్‌ను గెలిపించి ఉంటే ఎవరూ పట్టించుకునే వారు కాదని అన్నాడు. ఇలాంటి సవాళ్లను స్వీకరించినప్పుడే ఆటగాడిగా ఎదుగుతామని అన్నాడు. స్ట్రైక్ రొటేట్ చేయకుండా భారీ షాట్లకు వెళ్లటం తాను చేసిన పొరపాటని అంగీకరించాడు.

నెరవేరిన కల

ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌ను శాసించి ఆ తర్వాత క్రమంగా పాతాళానికి పడిపోయిన వెస్టిండీస్ మళ్లీ పడిలేచిన కెరటంలా ఆడుతోంది. విషమ పరీక్షలో నెగ్గి వచ్చే వన్డే ప్రపంచ కప్‌లో ఆడేందుకు అర్హత సంపాదించింది. ప్రపంచకప్‌కు ఐసీసీ ర్యాంకుల్లో మొదటి 8 స్థానాల్లో ఉన్న జట్లు నేరుగా అర్హత సంపాదించగా.. అఫిలియేటెడ్, అసోసియేట్ దేశాలకూ అవకాశమివ్వాలన్న ఉద్దేశంతో నిర్వహించిన క్వాలిఫైయింగ్ ఈవెంట్ సూపర్ సిక్స్ పోటీలో వెస్టిండీస్ స్కాట్లాండ్‌ను చిత్తు చేసి 2019లో ఇంగ్లండ్‌లో జరిగే ప్రపంచ కప్ బెర్త్ దక్కించుకుంది.

వరల్డ్ కప్‌కు వెస్టిండీస్ అర్హత



హరారే: 2019 వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ పోటీల్లో ఎట్టకేలకు వెస్టిండీస్ జట్టు అర్హత సాధించింది. రెండు సార్లు వన్డే ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన వెస్టిండీస్ జట్టు ఈ సారి ఆ పోటీల్లో అర్హత కోసం నానా తంటలు పడింది. ఒకప్పటి ప్రపంచ మేటి జట్టు ఇప్పుడు పసికూనలతో ఆడి చెమటోడ్చి చివరకు డక్‌వర్త్ పద్ధతిలో గెలిచి ప్రపంచకప్‌లో ప్రవేశించింది. స్టార్ ఆటగాళ్లు ఉన్న విండీస్ క్వాలిఫాయింగ్ పోటీల్లో స్థాయికు తగ్గట్టు ఆడలేకపోయింది. బుధవారం స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు 198 పరుగులకే ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన స్కాట్లాండ్ (35.2 ఓవర్లలో) 125/5 పరుగులు చేసింది. టాస్ గెలిచిన స్కాట్లాండ్ మొదట వెస్టిండీస్‌ను బ్యాటింగ్‌కు అహ్వానించింది. స్కాట్లాండ్ బౌలర్లు ఆరంభంలోనే విండీస్‌కు కోలుకోలేని దెబ్బ తీశారు. విండీస్ స్టార్ బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్ (0)ను ఖాతా తెరువకుండానే పెవిలియన్‌కు పంపారు. తర్వాత వచ్చిన హోప్స్ (0)ను కూడా అవుట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తర్వాత లెవీస్ (66), సామ్యుల్స్ (51) అర్ధ శతకాలు సాధించి విండీస్‌ను ఆదుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు కీలకమైన 121 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించారు. తర్వాతి బ్యాట్స్‌మన్లలో బ్రాత్‌వైట్ (24) మినహా మిగతా వారు రాణించకపోవడంతో విండీస్ జట్టు 48.4 ఓవర్లలో 198 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన స్కాట్లాండ్ జట్టులో ఓపెనర్లు క్రాస్ (4), సియోట్జర్ (2) త్వరగా అవుటయ్యారు. తర్వాత జోన్స్ (14), మాక్‌లాడ్ (21), బెర్రింగ్‌టన్ (33), మున్సీ (32 నాటౌట్) ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే ఈ సమయంలో వర్షం కురవడంతో మ్యాచ్ నిలిచిపోయింది. తర్వాత డక్‌వర్త్ ప్రకారం విండీస్‌కు విజేతగా ప్రకటించారు. దీంతో విండీస్ జట్టు 2019లో జరిగే ప్రపంచకప్‌కు అర్హత సాధించడంతో వెస్టిండీస్ క్రికెటర్లతో పాటూ, అభిమానులు కూడా సంభరాలు జరుపుకున్నారు.



రేపు మమతతో షమి భార్య భేటీ

కోల్‌కతా : టీమిండియా పేసర్ మహ్మద్ షమి భార్య హసీన్ జహాన్ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీని కలవనున్నారు. ఈ మేరకు ఆమె సీఎం అపాయింట్ మెంట్ తీసుకున్నారు. ఈనెల 23న మమతా బెనర్జీని వ్యక్తిగతంగా కలిసి తన బాధలను తెలియజేయడంతో పాటు తనకు మద్దతివ్వాలని ఆమె సీఎంను కోరనున్నారు.ఇక అంతకముందు తాను న్యాయం కోసం పోరాడుతున్నానని, షమి అరెస్ట్ అయ్యేలా తనకు సహకరించాలని హసీన్ మీడియాను కోరారు. తన బాధను అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. షమి పలువురి యువతులతో అక్రమ సంబంధాలు పెట్టుకున్నాడని, తనని మానసికంగా వేధించాడని, షమి సోదరుడు తనపై అత్యాచారానికి ఒడిగట్టాడని, పాక్ యువతితో కలిసి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని హసీన్ సంచలన ఆరోపణలు చే సింది. అంతటితో ఆగని హసీన్ కోల్‌కతా పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనను చంపేందుకు కుట్ర పన్నాడని షమిని, అతని కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయాలని జహాన్ డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలతో రంగంలోకి దిగిన బీసీసీఐ అవినీతి నిరోధక విభాగాన్ని విచారణ జరిపి రిపోర్ట్ అందజేయాలని ఆదేశించింది. ఈ రిపోర్ట్‌పైనే షమీ భవితవ్యం ఆధారపడి ఉంది. మరో వైపు కోల్‌కతా పోలీసుల అభ్యర్థన మేరకు బీసీసీఐ షమి దక్షిణాఫ్రికా టూర్ వివరాలను అందచేసింది. గత నెల 17, 18 తేదీల్లో షమి దుబాయ్‌లో ఉన్నట్టు బీసీసీఐ ధృవీకరించింది. ఈ వ్యవహారంపై కోల్‌కతా పోలీసులు విచారణ జరుపుతున్నారు.

కొచ్చి వన్డే వేదిక మార్పు?

నిపుణుల అభిప్రాయం తర్వాత తుది నిర్ణయం

క్యాండిల్ లైట్ ర్యాలీకి శశిథరూర్ పిలుపు

కొచ్చి : కొచ్చి ఫుట్‌బాల్ స్టేడియంలో వన్డే క్రికెట్ మ్యాచ్ నిర్వహించాలన్న కేరళ క్రికెట్ సంఘం నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాస్టర్ బ్లాస్టర్ సచిన్‌తో పాటు పలువురు క్రీడాకారులు, అభిమానులు కేరళ క్రికెట్ సంఘం నిర్ణయంపై అసంతృప్తిని వ్యక్తం చేయయడంతో ఈ వ్యవహారంపై గ్రేటర్ కొచ్చిన డెవలప్‌మెంట్ అథారిటీ కీలక నిర్ణయం తీసుకుంది. కొచ్చిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వన్డే మ్యాచ్ నిర్వహించాలా వద్దా అన్న అంశంపై నిపుణుల సలహా తీసుకోవాలని యోచిస్తోంది. ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫీఫా) నిబంధనలు అనుగుణంగా కోట్లు ఖర్చుపెట్టి రూపొందించిన కొచ్చి స్టేడియంలో వచ్చే నవంబర్‌లో వన్డే మ్యాచ్ నిర్వహించాలని కేరళ క్రికెట్ సంఘం నిర్ణయించింది. అయితే దీనిపై విమర్శలు మొదలవడం, కొచ్చి కిబదులుగా తిరువనంతపురంలో ఆ వన్డే నిర్వహించుకోవాలన్న సూచనలు రావండంతో కొచ్చిన్ డెవలప్‌మెంట్ అథారిటీ పునరాలోచనలో పడింది. ఫుట్‌బాల్ స్టేడియం టర్ఫ్ దెబ్బతినకుండా వన్డే మ్యాచ్ నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. మరో వైపు ఈ ప్రపంచ స్థాయి ప్రమాణాలుగల కొచ్చి ఫుట్‌బాల్ స్టేడియంను కాపాడుకునేందుకు ఎంపి శశిథరూర్ నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చారు. శనివారం తిరువనంతపురంలో క్యాండిల్‌ర్యాలీ నిర్వహించాలన్నారు.



మెట్టుదిగిన కేరళ క్రికెట్ బోర్డు

మరోవైపు నవంబర్‌లో జరిగే ఈ వన్డేను తిరువనంతపురంలో నిర్వహించేందుకు కేరళ క్రికెట్ బోర్డు బీసీసీఐతో చర్చిస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలు గల ఫుట్‌బాల్ స్టేడియంలో వన్డేను నిర్వహించడం వల్ల టర్ఫ్ పాడైపోతుందని అభిమానులతో పాటు గంగూలీ, సచిన్, తదితరుల ఒత్తిడితో ఈ వేదికను మార్చాలన్నఅభిప్రాయానికి దాదాపుగా వచ్చింది. మొన్నటి వరకూ జరిగిన ఇండియన్ సూపర్‌లీగ్‌లో కేరళ బ్లాస్టర్స్‌కు కొచ్చి సొంత మైదానం. ఈఫుట్‌బాల్ సూపర్‌లీగ్‌లో క ఏరళ జట్టుకు సచిన్, కోల్‌కతా జట్టుకు గంగూలీ సహయజమానులు. దీంతో వారిద్దరూ బీసీసీఐతో వన్డే వేదిక మార్పుపై చర్చించారని సమాచారం.

గోల్డ్‌కోస్ట్ పిలుస్తోంది...

ఐపీఎల్ 11 సీజన్‌తో పాటు ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో జరిగే 21వ కామన్‌వెల్త్ గేమ్స్ భారత క్రీడాభిమానులను ఈ వేసవిలో అలరించబోతున్నాయి. బ్రిటన్ పాలించిన దేశాల క్రీడాకారులంతా కలసి పాల్గొనే ఈ పోటీల్లో భారత్‌కు చెప్పకోదగ్గ చరిత్రే ఉంది. మరో పదిహేను రోజుల్లో ప్రారంభం కానున్న ఈ పోటీల్లో ఈ సారి భారత్ సత్తా ఎంత. భారత్ ఏ యే భాగాల్లో గట్టిపోటీ ఇస్తుంది.



2018 కామన్‌వెల్త్ గేమ్స్ కౌంట్‌డౌన్

(మనం క్రీడావిభాగం)

వచ్చే నెల మొదటి వారంలో ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ 21వ కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వనుంది. 12 రోజుల పాటు జరిగే ఈ మినీ ఒలింపిక్ సంగ్రామంలో ఆరు ఖండాలకు చెందిన 71 దేశాలు పాల్గొంటున్నాయి. మొత్తం 19 క్రీడాంశాల్లో 275 పతకాల కోసం దాదాపు పదివేల మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఏప్రిల్4న కర్రెరా స్టేడియంలో జరిగే ప్రారంభ వేడుకలతో ఈ కామన్‌వెల్త్ సంగ్రామం మొదలవుతుంది. 'షేర్ ది డ్రీమ్' నినాదంతో మొదలయ్యే ఈక్రీడల్లో ఈ సారి ఆధిపత్యం చెలాయించేందుకు భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, కెనడా వంటి దేశాలు రెడీ అయ్యాయి.

భారత్‌కు ఘన చరిత్ర

ఈ పోటీల్లో భారత్ 15 క్రీడాంశాల్లో 215 మంది క్రీడాకారులతో బరిలోకి దిగుతోంది. ఇంతకు ముందు 2014లో గ్లాస్కో (స్కాట్లాండ్)లో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్ 64 పతకాలతో ఐదో స్థానంలో నిలిచింది. షూటింగ్, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, హాకీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో భారత మిగతా జట్లకు గట్టిపోటీ ఇచ్చేందుకు రెడీ అయింది. ఒలింపిక్స్‌లో భారత్ సత్తా ఒకటి రెండు పతకాలకే పరిమితమైనప్పటికీ కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్‌కు ఘన చరిత్రే ఉంది. ఇప్పటి వరకూ జరిగిన 20 కామన్‌వెల్త్ క్రీడల్లో 14 సార్లు పోటీపడ్డ భారత్ 430పతకాలు గెలుచుకుంది. ఇందులో 155 స్వర్ణ, 155 రజత, 120 కాంస్య పతకాలున్నాయి. 2002 నుంచి భారత్ ఈ పోటీల్లో మొదటి ఐదు అగ్రదేశాల్లో నిలుస్తోంది.

ఇదీ కామన్‌వెల్త్ కథ...

బ్రిటన్ పాలించిన దేశాల మధ్య స్నేహం పెంచేందుకు ఈ కామన్‌వెల్త్ క్రీడలు అంకురించాయి. 1891లో అష్లే కూపర్ ఈ కామన్‌వెల్త్ గేమ్స్‌కు అంకురార్పణ చేశాడు. 1911లో కింగ్‌జార్జ్-5 పట్టాభిషేకం తర్వాత ఈ క్రీడలను ఫెస్టివల్ ఆఫ్ ఎంపైర్‌గా నిర్వహించారు. 1928 ఆమ్‌స్టర్‌డామ్ ఒలింపిక్స్ సమయంలో బ్రిటన్ పాలించిన దేశాలన్నీ కలసి ఆడాయి. దీంతో కామన్‌వెల్త్ క్రీడలు నిర్వహించాలన్న డిమాండ్ ఊపందుకుంది. రెండేళ్ల తర్వాత 1930లో కెనడాలో తొలిసారి బ్రిటీష్ ఆఫ్ ఎంపైర్స్‌గా ఈ పోటీలు మొదలయ్యాయి. 1954-66 మధ్య బ్రిటీష్ అండ్ కామన్‌వెల్త్ గేమ్స్‌గా, 1978 నుంచి కామన్‌వెల్త్ గేమ్స్‌గా నిర్వహిస్తూ వచ్చారు.

గోల్డ్‌కోస్ట్ కామన్‌వెల్త్ క్రీడల మస్కట్ బొరోబి



ఈ మెగా క్రీడా సంగ్రామంలో మస్కట్‌ది ఓ ప్రత్యేక చరిత్ర. ఈ క్రీడలను ప్రమోట్ చేసేందుకు ఈ మస్కట్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఈ మస్కట్‌ను రూపొందించే విషయంలో నిర్వాహకుల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. పోటీలకు రెండేళ్ల ముందు నుంచే మస్కట్‌ను సిద్ధం చేసి గేమ్స్ ఇమేజ్‌ను పెంచుతారు. ఈ సారి గోల్డ్‌కోస్ట్ కామన్‌వెల్త్ క్రీడలకు ఆస్ట్రేలియా జంతువు కంగారు ప్రేరణతో ఓ టీచర్ రూపొందించిన బొరోబిని మస్కట్‌గా ఎంపిక చేశారు. ఆదివాసీ సంస్కృతిని గుర్తు తెచ్చే విధంగా నీలంరంగు బొచ్చు చెవులు, విచిత్రమైన ముక్కు, చేతులతో ఈ బొరోబి మస్కట్‌ను రూపొందించారు. నాలుగు వేల ఎంట్రీల్లో బొరోబి విజేతగా నిలిచింది.

ఇంగ్లండ్ వర్సెస్ కివీస్

నేటి నుంచి ఆక్లాండ్‌లో డే అండ్‌నైట్ టెస్ట్



ఆక్లాండ్ : న్యూజిలాండ్ ఇంగ్లండ్ జట్ల మధ్య నేటి నుంచి ఆక్లాం వేదికగా తొలి టెస్ట్ ప్రారంభమవుతుంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా జరుగుతున్న ఈమ్యాచ్ తొలి సారిగా న్యూజి లాండ్‌లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహించ నున్నారు. రెండు జట్ల మధ్యా వన్డేలు హోరా హోరీగా జరగడంతో ఈ టెస్ట్ సిరీస్ మరింత ఆసక్తికరంగా సాగుతుందని అభిమానులు అంచనా వేస్తున్నారు. గాయం నుంచి కోలుకున్న ఆల్‌రౌండర్ స్టోక్స్ రాకతో బలం పుంజుకున్న ఇంగ్లండ్ న్యూజిలాండ్‌కు గట్టిపోటీ ఇస్తుందని అంచనా. స్టోక్స్ రాక జట్టు బలం పెంచిందని అయితే తమ జట్టు ఆటగాళ్లు ఇంకా బాగారాణించాల్సి ఉందని ఇంగ్లండ్ కెప్టెన్ రూట్ చెబుతున్నాడు. నైట్‌క్లబ్‌తో జరిగిన గొడవ కారణంగా నిషేధానికి గురైన స్టోక్స్ ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో మళ్లీ జట్టుకు అందుబాటులోకొచ్చాడు. ఇక న్యూజిలాండ్ కూడా ఈ మ్యాచ్‌కు భారీ వ్యూహంతో బరిలోకి దిగుతోంది. స్టార్ ఓపెనర్ రాస్ టేలర్ కోలుకోవటం తమ జట్టుకు ఉత్సాహాన్ని పెంచిందని కెప్టెన్ విలియమ్‌సన్ చెబుతున్నాడు.

ఆస్ట్రేలియాతో అమీతుమీకి భారత్ రెడీ

నేటి నుంచి మహిళా జట్ల టీ20 ట్రైసిరీస్



ముంబాయి : మూడు వన్డేల సిరీస్‌లో ఆస్ట్రేలియా చేతిలో వైట్‌వాష్ అయిన భారత మహిళల జట్టు గురువారం నుంచి మొదలయ్యే ట్రై సిరీస్ టీ20 టోర్నీలో తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో తలపడుతుంది. ముంబాయి వేదికగా జరిగే ఈ టి20 ట్రై సిరీస్‌లో ఇంగ్లండ్ మూడో జట్టుగా బరిలోకి దిగుతోంది. ఇటీవల దక్షిణాఫ్రికాపై 3-1తేడాతో విజయం సాధించిన భారత్ ఆ ఉత్సాహంతో ఆస్ట్రేలియాను ఓడించాలని ఉవ్విళ్లూరుతోంది. అయితే వదోదరలో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో 0-3 తేడాతో చిత్తయిపోయిన భారత్‌కు ఈ టి20 సిరీస్‌లో విజయం సాధించటం అంత తేలికేమీ కాదు. మిగతా రెండు జట్లతో పోలిస్తే భారత జట్టు అన్ని విభాగాల్లోనూ ఇంకా బలహీనంగా ఉందనే చెప్పుకోవాలి. బ్యాటింగ్‌పైనే కొండంత ఆశలుపెట్టుకున్న భారత్‌కు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్, మిథాలీరాజ్‌లతో పాటు స్మృతి మంధన లు నిలకడగా ఆడి పరుగులు సాధించగలితే ఆస్ట్రేలియాకు గట్టి పోటీ ఇచ్చే అవకాశముంది. ఈ ముగ్గురుతో పాటు వేదా కృష్ణమూర్తి, ఆల్‌రౌండర్ పూజా వస్త్రాకర్‌లపై భారత ఆశలు పెట్టుకుంది. పేస్ బౌలర్లు ఝులన్ గోస్వామి రాకతో జట్టు కాస్త బలంగా కనిపిస్తోంది. గోస్వామికి తోడు శిఖా పాండే కూడా మెరుగైన బౌలింగ్ ప్రదర్శించగలిగితే ఆసీస్‌కు ధీటుగా ఆడినట్టే.

సౌతాఫ్రికాతో ఆస్ట్రేలియా సై

నేటి నుంచి మూడో టెస్ట్



కేప్‌టౌన్ : స్టార్ బౌలర్ రబడాపై నిషేధం అడ్డంకులు తొలగడంతో ఉత్సాహంగా ఉన్న దక్షిణాఫ్రికా జట్టు కేప్‌టౌన్‌లో నేటి నుంచి ఆస్ట్రేలియాతో మూడో టెస్ట్ ఆడుతుంది. రెండు జట్లు చెరో టెస్ట్ గెలుచుకుని సిరీస్ 1-1తో సమం చేయడంతో ఈ మ్యాచ్‌పై ఆసక్తి పెరిగింది. డర్బన్‌లో జరిగిన తొలి టెస్ట్ డ్రస్సింగ్ రూమ్‌లో వార్నర్ -డికాక్ గొడవ, రెండో టెస్ట్‌లో రబాడా - స్మిత్ వివాదంతో ఈ సిరీస్ ఆసక్తికరంగా మారింది. ఐసీసీ నిబంధనలు ఉల్లంఘించినందుకు రబడాపై డీమెరిట్ పాయింట్లు జరిమానా విధించిన ఐసీసీ ఆ తర్వాత వెనక్కు తగ్గడంతో ఈ సిరీస్‌లో మిగతా రెండు టెస్ట్‌ల్లో ఆడేందుకు సౌతాఫ్రికా బౌలర్ రబడాకు అవకాశం దక్కింది. రెండో టెస్ట్‌లో ఏకంగా 11 వికెట్లు పడగొట్టిన రబడా ఈ మ్యాచ్‌లోనూ ఆస్ట్రేలియాపై తన ప్రతాపం చూపెట్టేందుకు రెడీ అవుతున్నాడు.

స్మిత్ అసంతృప్తి

రబడాపై ఐసీసీ ఇచ్చిన తీర్పు పట్ల ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. పోర్ట్‌ఎలిజిబెత్ టెస్ట్‌లో రబడా తనను ఉద్దేశపూర్వకంగా ఢీ కొట్టిన రబడాపై ఐసీసీ నిషేధం తొలగించటం సరికాదని అభిప్రాయపడ్డాడు. ఈ విషయంలో జరిగిన విచారణలో ఐసీసీ తనను సంప్రదించి ఉంటే బావుండేదన్నాడు. ఇక ఈ నిర్ణయం తమకేమీ ఆశ్చర్యాన్ని కలిగించలేదని చెప్పాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.